


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 129

మంగళవారం 30-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**మార్కెట్లోకి 'బిగ్‌బాస్'?**

కేంద్ర ప్రభుత్వం ముందు ఎల్ఐసీ లిస్టింగ్ ప్రతిపాదన -బిజినెస్‌లో



**వట్టి మాటలు కట్టి పెట్టండి**

రోహిత్ శర్మతో ఎలాంటి విభేదాలు లేవన్న కెప్టెన్ కోహ్లి –స్పోర్ట్స్‌లో

# టైగర్ జిందా హై..

- 5లో

## దేశంలో పులులు 2,967

**పులులకు భద్రమైన దేశంగా భారత్**

- పులుల గణన నివేదిక విడుదల సందర్భంగా ప్రధాని వెల్లడి
- 2006తో పోలిస్తే దేశంలో రెట్టింపైన పులుల సంఖ్య
- అభివృద్ధి, పర్యావరణం మధ్య సమతుల్యం సాధ్యమన్న మోదీ



## రాష్ట్రంలో 26

- తెలంగాణలో నాలుగేళ్లలో పులుల సంఖ్య చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. ఆమ్రాబాద్, కవ్వాల్‌లలో పులుల సంరక్షణ కేంద్రాలుండగా, ఈ రెండింటిలో కలిపి 2014లో 20 పులులు ఉండేవి. ప్రభుత్వం చేపడుతున్న సంరక్షణ చర్యలతో 2018 నాటికి ఆ సంఖ్య 26కు పెరిగింది. ఇవే కాకుండా, మరో ఆరు పులి పిల్లలు కూడా ఆమ్రాబాద్, కవ్వాల్‌లలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

- 4లో

# ఇక సెలవ్

- జైపాల్‌రెడ్డికి కార్యకర్తలు, నేతల కన్నీటి వీడ్కోలు
- హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని పీవీ ఘాట్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి
- చితికి నిప్పంటించిన కుమారుడు అరవింద్ రెడ్డి
- శోకసంద్రమైన సాగర్ తీరం.. కిక్కిరిసిన పీవీ ఘాట్
- తరలివచ్చిన వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు
- ఇంటి వద్ద నుంచి గాంధీభవన్‌కు.. అక్కడి నుంచి నెక్లెస్‌రోడ్డుకు అంతిమయాత్ర

- వివరాలు 2లో






# చినుకు తడి.. మురిసిన మడి

**నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో ఆనందం**

- ఎండిపోయే దశలో ఉన్న పంటలకు ఊపిరిలూదుతున్న వర్షాలు
- జోరందుకున్న వ్యవసాయ పనులు
- హిమాలయాల నుంచి సాధారణ స్థితికి చేరుకున్న రుతుపవన ద్రోణి
- దీంతో ఉపరితల ఆవర్తనానికి మార్గం సుగమం.. దీంతోనే వర్షాలు

**మొలకలు వాడిపోతున్నాయని, స్వల్పకాలిక రకాల పంటలు విత్తుకునేందుకు కూడా అదును దాటిపోతుందని ఆందోళన చెందుతున్న దశలో నాలుగైదు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆశలు చిగురింపజేశాయి. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో పంటలకు మళ్లీ ప్రాణమొచ్చినట్లయింది.**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి, మొక్కజొన్న, కంది, సోయాబీన్ వంటి పంటలకు ప్రాణం పోస్తున్నాయని అన్నదాతలు పేర్కొంటున్నారు. అంతేగాక వరి నాట్లు కూడా ఊపందుకుంటాయని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా నైరుతి రుతుపవనాలు మన రాష్ట్రంలోకి ఆలస్యంగా ప్రవేశించాయి. ఆ తర్వాతైనా సరిగా వర్షాలు పడ్డాయా అంటే అదీ లేదు. దీంతో చాలాచోట్ల భూమిలో వేసిన విత్తనాలు వేసినట్లే లోపలే ఉండిపోయాయి. చాలాచోట్ల మొలకలు రాలేదు. వచ్చినచోట్ల మొలకలు వాడిపోయే దశలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లో వర్షాభావం నెలకొంది. చాలాచోట్ల రైతులు పంటలు వేసేందుకు కూడా ముందుకు రాలేదు. దీంతో సాధారణంగా సాగు విస్తీర్ణం కంటే ఇప్పటి వరకు వాస్తవంగా సాగైన విస్తీర్ణం తగ్గినట్లు

మిగతా 2వ పేజీలో ▶



## ఇక ఎత్తిపోసుడే

జూరాలకు నేడు కృష్ణా జలాల రాక
ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి లక్ష క్యూసెక్కుల వరద
జూరాలలో 5 టీఎంసీల నిల్వ దాటగానే ఎత్తిపోతలు మొదలు
గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణపై సీఎం సమీక్ష

- వివరాలు 14లో

# ముఖేశ్ గౌడ్ కన్నుమూత

- కేన్సర్‌తో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస..
- సంతాపం తెలిపిన కాంగ్రెస్ ముఖ్య నేతలు
- 2018 అసెంబ్లీ ఎన్నికల అనంతరం అనారోగ్యం
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- వైఎస్ హయాంలో బీసీ మంత్రిగా సేవలు
- మజ్లిస్ కోటలో కాంగ్రెస్‌ను ముందుండి నడిపించిన నేత



**సాక్షి, హైదరాబాద్:** కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎం.ముఖేశ్‌గౌడ్ (60) సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. కేన్సర్‌తో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి ఆదివారం మధ్యాహ్నం విషమించడంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. ఐసీయూలో చేర్చి మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు ప్రయత్నించినప్పటికీ.. ఆయన శరీరం చికిత్సకు సహకరించలేదు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో

మిగతా 2వ పేజీలో ▶






# కోటిస్తేనే కనికరించారు!

- ఫైనాన్షియర్‌ను అపహరించిన దుండగులు
- హైదరాబాద్‌లో అర్ధరాత్రి హైడ్రామా
- సినిమా షూటింగ్‌ను తలపించేలా ఘటన
- రూ. 3 కోట్లు డిమాండ్... కోటికి కుదిరిన డీల్
- డబ్బు తీసుకొని గజేందర్‌ను వదిలిన కిడ్నాపర్లు
- దోమలగూడలో ఘటన.. కేసు నమోదు

- వివరాలు 14లో



## మ్యాన్ ✕ వైల్డ్...

**'డిస్కవరీ'లో కనిపించనున్న మోదీ**

సాహస వీరుడు బేర్ గ్రిల్స్‌తో కలిసి అడవుల్లో ప్రధాని సంచారం
ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్కులో చిత్రీకరణ
ఆగస్టు 12న కార్యక్రమం ప్రసారం

5లో

# మాట్లాడుకుందాం రండి



- విభజన సమస్యలపై చర్చల కోసం రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ఆహ్వానం
- ఢిల్లీలోని హోంశాఖ కార్యాలయంలో ఆగస్టు 8న భేటీ
- 8 అంశాలతో కూడిన ఎజెండా రూపకల్పన
- ఏపీ భవన్, ఆప్మెల్ సంస్థ విభజనలాంటి అంశాలపై చర్చ
- 9, 10 షెడ్యూళ్లలోని సంస్థలపై మరోసారి దృష్టి

వివరాలు 4లో






## విశ్వాసపరీక్షలో 'యెడ్డీ' విజయం



- మూజువాణి ఓటుతో విశ్వాస తీర్మానానికి ఆమోదం
- ప్రతీకార రాజకీయాలు చేయను: యడియూరప్ప




## కర్ణాటక స్పీకర్ రాజీనామా

- విశ్వాస పరీక్ష పూర్తయిన వెంటనే పదవి నుంచి తప్పుకున్న రమేశ్ కుమార్

- వివరాలు 5లో


# ఎన్నారై సీట్లొద్దు!

**అధిక ఫీజులతో పూర్తిగా భర్తీకాని ఎంబీబీఎస్ సీట్లు**



- బీ–కేటగిరీ సీట్లన్నీ భర్తీ అయినా.. ఎన్నారై కేటగిరీలో 141 సీట్లు మిగులు
- డీమ్డ్ వర్సిటీల్లో ఫీజులు తక్కువగా ఉండటంతో విద్యార్థుల పరుగులు
- మన ఎన్నారై ఫీజు రూ. 23 లక్షలైతే.. డీమ్డ్ ఫీజు 10–12 లక్షల మధ్యే..

- వివరాలు 3లో

# జైపాల్‌కు కన్నీటి వీడ్కోలు

- గాంధీభవన్‌లో ఆజాద్, ఖర్గే, చాకో, కుంతియా, ఉత్తమ్ నివాళులు
- 'సెక్యులరిజానికి చాంపియన్' జైపాల్ అని గుర్తుచేసుకున్న నేతలు
- గంటపాటు గాంధీభవన్‌లో పార్థివ దేహం.. తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- గాంధీభవన్‌కు వచ్చి నివాళులర్పించిన సీపీఎం నేత ఏచూరి

**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. సోమవారం ఉదయం ఆయన నివాసం నుంచి పార్థివదేహాన్ని 12:20 గంటల సమయంలో గాంధీ భవన్‌కు తీసుకువచ్చారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై భౌతికకాయాన్ని ఉంచి పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఏఐసీసీ పక్షాన రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్, మాజీ లోక్‌సభ పక్ష నేత మల్లికార్జున ఖర్గే, రాజ్యసభ సభ్యుడు పీసీ చాకో, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి ఆర్సీ కుంతియా తదితరులు జైపాల్ భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. వీరితో పాటు రాష్ట్ర పార్టీ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కె.జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రేవంత్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, గూడూరు నారాయణరెడ్డి, మర్రిశశిధర్‌రెడ్డి, మల్లు రవి, పొన్నం ప్రభాకర్, కుసుమ కుమార్, సంపత్ కుమార్, వంశీచంద్ రెడ్డి, చిన్నారెడ్డి, శ్రీనివాస కృష్ణన్, జగ్గారెడ్డి, సీతక్క, వి.హనుమంతరావు, మధుయాష్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు నగేశ్, ఈరవత్రి అనిల్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎమ్మార్‌జీ వినోద్‌రెడ్డి, బొల్లు కిషన్, కుమార్‌రావు తదితరులు జైపాల్ భౌతిక కాయానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. జైపాల్ భౌతికకాయాన్ని సందర్శించేందుకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. మధ్యాహ్నం 1:15 గంటల సమయంలో పార్థివ దేహాన్ని గాంధీభవన్ నుంచి నెక్లెస్‌రోడ్‌కు తీసుకెళ్లారు. ఏఐసీసీ పక్షాన హాజరైన నేతలతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా నెక్లెస్‌రోడ్డుకు వెళ్లి జైపాల్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

### గాంధీభవన్‌కు వచ్చిన ఏచూరి

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కూడా గాంధీభవన్‌లో జైపాల్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి మీడియాతో మాట్లాడుతూ తనకు జైపాల్‌తో 3దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచే ఆయనతో పరిచయం ఉందని, యునైటెడ్ ఫ్రంట్, యూపీఏ ప్రభుత్వాల ఏర్పాటులో ఇద్దరం కలిసి పనిచేశామని చెప్పారు. దేశంలోని అరుదైన రాజకీయ నాయకుల్లో జైపాల్ ఒకరని, ఆయన ఆకస్మిక మరణం తనను చాలా బాధించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి నెక్లెస్‌రోడ్డులో జైపాల్ రెడ్డికి నివాళులర్పించారు.

### సెక్యులర్ అంటే గుర్తొస్తారు: ఆజాద్

జైపాల్‌రెడ్డితో తనకు దశాబ్దాల పరిచయం ఉందని, ఇద్దరం వేరే పార్టీల్లో ఉన్నా మంచి మిత్రులుగా ఉన్నామని రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ జైపాల్ రెడ్డి మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. సెక్యులర్ అంటే మొదట గుర్తొచ్చేది జైపాల్ రెడ్డేనని, సెక్యులరిజం, సోషలిజం మార్గంలో నడవడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని చెప్పారు. జైపాల్ ఉత్తమ పార్లమెంటేరియన్, బహుభాషా కోవిదుడని, ఏ శాఖ మంత్రిగా అయినా నిజాయితీతో పనిచేశారని కొనియాడారు.

### మన్మోహన్ మెచ్చిన నేత: ఖర్గే

జైపాల్‌తో తనకు 1963 నుంచి పరిచయం ఉందని, తాను విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడే జైపాల్ తనకు తెలుసునని లోక్‌సభలో మాజీ ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే చెప్పారు. మన్మోహన్‌సింగ్ మెచ్చిన నేత జైపాల్‌రెడ్డి అని, ఆయన మాట్లాడుతుంటే డిక్షనరీలు వెతుక్కునే వారమన్నారు. రాజ్యసభ సభ్యుడు చాకో మాట్లాడుతూ జైపాల్ రెడ్డితో కలిసి పనిచేశానని, నిబద్ధత, నిజాయతీకి ఆయన మారుపేరని ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా మాట్లాడుతూ సోషలిజం, సెక్యులరిజంలకు జైపాల్ చాంపియన్ అని కొనియాడారు. కాంగ్రెస్ శ్రేణులు ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ భూమి పుత్రుడు జైపాల్‌రెడ్డి దేశరాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు. రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించారన్నారు.

## నివాళులర్పించిన రాజ్యసభ

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఎస్.జైపాల్‌రెడ్డికి రాజ్యసభ నివాళులర్పించింది. సోమవారం ఉదయం సభ ప్రారంభం కాగానే ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు జైపాల్‌రెడ్డి మరణంపై సంతాప ప్రకటన చేశారు. 'ఈ సభ మాజీ సభ్యుడు ఎస్.జైపాల్ రెడ్డి తన 77వ ఏట నిన్న ఉదయం మరణించారు. ఆయన మరణంతో దేశం ఒక సీనియర్ పార్లమెంటేరియన్‌ను, ఒక అత్యుత్తమ వక్తను, సమర్థవంతుడైన అడ్మినిస్ట్రేటర్‌ను కోల్పోయింది. ఏపీ అసెంబ్లీలో రెండు పర్యాయాలు ఆయనతో పాటు కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది. ఒకే బెంచిలో కూర్చునేవాళ్లం. ప్రజాసంబంధ అంశాలపై ఎవరి మార్గంలో వాళ్లం వాదించేవాళ్లం. నాలుగు దశాబ్దాలుగా ఆయన నాకు స్నేహితుడు. ఆయన కంటే నేను ఆరేళ్లు చిన్నవాడిని. అందువల్ల ఆయన అనేక సందర్భాల్లో నాకు మార్గదర్శనం చేసేవారు. జైపాల్ రెడ్డి మరణానికి ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నాం..'అని చైర్మన్ అన్నారు. జైపాల్‌రెడ్డి మరణానికి సంతాపం తెలిపేందుకు సభ్యులు లేచి కొద్ది క్షణాలు మౌనం పాటించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఆరోజుల్లో అసెంబ్లీ సమావేశాలు ఉదయం 8 గంటలకే ప్రారంభమయ్యేవని, తామిద్దరూ ఉదయం ఏడు గంటలకు అల్పాహార సమయంలో అనేక అంశాలపై చర్చించుకునేవాళ్లమని గుర్తుచేసుకున్నారు. లోతైన అవగాహన, ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ, హిందీ భాషలపై ఆయనకున్న పట్టు చాలా గొప్పదని వివరించారు. 'జైపాల్‌రెడ్డి మనల్ని విడిచివెళ్లారన్న విషయం తీవ్రంగా బాధ కలిగిస్తోంది. నేను నిన్న హైదరాబాద్‌లో ఉన్నాను. వారింటికి వెళ్లి నివాళులు అర్పించాను. 40 ఏళ్లుగా వ్యక్తిగత అనుబంధం ఉండటంతో నేను నా భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోయాను..'అని పేర్కొన్నారు.

## ఎన్‌ఎంసీ బిల్లు పేదలకు వ్యతిరేకంగా ఉంది: నామా



**సాక్షి, న్యూఢిల్లీ:** జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) బిల్లు పేదలకు వ్యతిరేకంగానూ, ధనికులకు అనుకూలంగానూ ఉందని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ మెడికల్ కమిషన్ బిల్లుపై సోమవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలల్లో 50% సీట్ల రుసుము నిర్ణయాధికారం ప్రభుత్వానికి, మిగిలిన 50% ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు వదిలేయడం వల్ల అవి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేసే పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్యసదుపాయాలు కల్పించాలని, నేటికీ వైద్యులను చూడని గ్రామాలు సైతం దేశంలో అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశరాజధాని ఢిల్లీలోని ఎయిమ్స్‌లాంటి ఆస్పత్రిలోనే సరైన వైద్య సదుపాయాలు లేక రోగులు అల్లాడిపోతున్నారంటే, ఇంకా గ్రామాల్లో ఏవిధంగా పరిస్థితులు ఉంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్‌ఎంసీ బిల్లు పేదలకు అనుకూలంగా ఉండేలా సవరణలు తీసుకు రావాలని కోరారు. బిల్లుతో వైద్యరంగంలో విశ్వసనీయత పెరిగేలా చూడాలని కోరారు. లాభాపేక్ష లేని ఆస్పత్రులను ప్రోత్సహించాలని, బిల్లు ద్వారా ప్రవాస భారతీయ డాక్టర్లు, విదేశీ వైద్యుల సేవలు కూడా దేశానికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌ఎంసీ బిల్లు ద్వారా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేకుండా చేయొద్దని, నియంత్రణ కేంద్రం చేతుల్లో ఉండకుండా, రాష్ట్రాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వెనకబడిన జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటుగా తెలంగాణలో కొత్త జిల్లాలకు మెడికల్ కాలేజీలు మంజూరు చేయాలని కోరారు.



జైపాల్ రెడ్డి భౌతికకాయంపై పార్టీ జెండాను కప్పుతున్న కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, పీసీ చాకో, ఉత్తమ్, పొన్నాల, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వీహెచ్, సంపత్, వంశీచంద్ తదితరులు



నివాళులర్పిస్తున్న గులాంనబీ ఆజాద్



పాడె మోస్తున్న కర్ణాటక మాజీ స్పీకర్ రమేశ్ కుమార్, మాజీ సీఎం సిద్దరామయ్య

# ఇక సెలవ్!

- జైపాల్ రెడ్డికి అభిమానులు, కార్యకర్తలు, నేతల కన్నీటి వీడ్కోలు
- నెక్లెస్‌రోడ్డు పీవీ ఘాట్‌లో జైపాల్‌రెడ్డి అంత్యక్రియలు
- చితికి నిప్పంటించిన కుమారుడు అరవింద్ రెడ్డి
- శోకసంద్రమైన సాగర తీరం.. కిక్కిరిసిన పీవీ ఘాట్
- తరలివచ్చిన వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు
- ఇంటి వద్దనుంచి గాంధీభవన్‌కు.. అక్కడి నుంచి నెక్లెస్‌రోడ్డుకు అంతిమ యాత్ర

**సాక్షి, హైదరాబాద్:** సాగర తీరం శోకసంద్రమైంది. తమ ప్రియతమ నేతకు కడసారి వీడ్కోలు పలికేందుకు అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు తరలివచ్చారు. వీరందరి అశ్రు నయనాల సమక్షంలో.. నెక్లెస్‌రోడ్డులోని పీవీ ఘాట్‌లో సోమవారం మధ్యాహ్నం కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సూదిని జైపాల్‌రెడ్డి పార్థివదేహానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తయ్యాయి. మధ్యాహ్నం 3.10 గంటలకు జైపాల్‌రెడ్డి పెద్ద కొడుకు అరవింద్‌రెడ్డి చితికి నిప్పంటించారు. సోమవారం ఉదయం నుంచే నెక్లెస్‌రోడ్డులో విషాదం అలుముకుంది. పలువురు ప్రముఖులు జైపాల్‌రెడ్డితో తమ అనుబంధాన్ని, ఆయనతో ఆత్మీయంగా గడిపిన క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఆయా పార్టీలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, బంధువులు, స్నేహితులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో నెక్లెస్ రోడ్ మొత్తం వాహనాలతో నిండిపోయింది. ఆయనను చివరిసారి చూసేందుకు వచ్చిన సందర్శకులతో పీవీఘాట్ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం 2 గంటలకు అంతిమ యాత్ర ర్యాలీ నెక్లెస్‌రోడ్‌లోని పీవీఘాట్‌కు చేరుకుంది. అనంతరం మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీనియర్ నేతలు మల్లిఖార్జున ఖర్గే, కర్ణాటక మాజీ సీఎం సిద్ధ రామయ్య, మాజీ స్పీకర్ రమేశ్‌లు అక్కడికి చేరుకున్నారు. 2.35 గంటలకు పార్థివదేహాన్ని చితి పైకి చేర్చారు. ఆ తరువాత అధికార లాంఛనాలు ప్రారంభించారు. పోలీసులు 3రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపిన అనంతరం ప్రముఖులు మరోసారి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కర్ణాటక తాజా మాజీ స్పీకర్ రమేశ్ కుమార్.. జైపాల్ రెడ్డి భౌతికకాయాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. అంత్యక్రియలు పూర్తయ్యేంత వరకు ప్రముఖులందరూ అక్కడే ఉన్నారు.

### భారీ ర్యాలీగా అంతిమ యాత్ర

అంతకుముందు ఉదయం అధికార లాంఛనాలతో జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్–10లోని ఆయన నివాసం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, వివిధ పార్టీల నేతలు, అభిమానుల అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర ప్రారంభమైంది. ఉదయం 11 గంటలకు భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలోకి చేర్చారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, ఎల్వీప్రసాద్ ఆసుపత్రి, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి మీదుగా అంతిమ యాత్ర గాంధీభవన్‌కు చేరుకుంది. దారి పొడవునా 'జైపాల్‌రెడ్డి అమర్ రహే'అంటూ అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. హోంమంత్రి మహమూద్ అలీ, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు జగదీష్‌రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, మల్లు రవి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, మధుయాష్కీ గౌడ్, గండ్ర వెంకట రమణారెడ్డి, నేతి విద్యాసాగర్, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. జైపాల్‌రెడ్డితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



### నివాళులు అర్పించిన ప్రముఖులు

కర్ణాటక మాజీ సీఎం సిద్ధ రామయ్య, మాజీ కేంద్ర మంత్రి గులాంనబీ ఆజాద్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎంపీ డీఎస్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నేతి విద్యాసాగర్‌రావు, కేశవరావు, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, గీతారెడ్డి, డీకే అరుణ, పొన్నాల లక్ష్మయ్య, మధుయాష్కి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, నన్నపనేని రాజకుమారి, ప్రజాగాయకుడు గద్దర్ సహా పలువురు కాంగ్రెస్ రాష్ట్ర నేతలు అంత్యక్రియలకు హాజరయ్యారు.

## 'కృష్ణా' పంపకాలపై ట్రిబ్యునల్ విచారణ

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపకాలకు సంబంధించి జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌లో విచారణ సోమవారం తిరిగి ప్రారంభమైంది. ఈ సందర్భంగా తెలంగాణ సాంకేతిక నిపుణులు ఘనశ్యాం ఝాను ఏపీ తరపున సీనియర్ న్యాయవాది ఆర్.వెంకటరమణి క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. సాంకేతిక అంశాలు, ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల లెక్కలపై వెంకటరమణి ప్రశ్నించారు. ప్రాజెక్టుల వారీ కేటాయింపుల్లో సాగు నీటి అవసరాల గణన శాస్త్రీయ పద్ధతిలో చేయడం అంతర్భాగమే అని ఘన శ్యాం పలు ప్రశ్నలకు బదులిచ్చారు. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాదులు వైద్యనాథన్, రవీందర్ రావు, కృష్ణమూర్తి స్వామి, చీఫ్ ఇంజనీర్ నరసింహా రావు తదితరులు విచారణ సందర్భంగా హాజరయ్యారు. విచారణ మంగళవారం కూడా కొనసాగనుంది.

## కాలపరిమితి ముగిసినా విచారిస్తాం

**కాళేశ్వరం పర్యావరణ అనుమతుల సవాల్ పిటిషన్‌పై ఎన్జీటీ స్పష్టీకరణ**

**సాక్షి, న్యూఢిల్లీ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి కేంద్ర పర్యావరణ శాఖ ఇచ్చిన అనుమతులను సవాల్ చేసేందుకు నిర్ణీత కాలపరిమితి ముగిసినా కూడా కేసు విచారణ జరుపుతామని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) స్పష్టం చేసింది. ప్రాజెక్టుకు మంజూరు చేసిన అనుమతులను సవాల్ చేస్తూ పిటిషనర్ హయాతుద్దీన్ ఎన్జీటీని ఆశ్రయించారు. ఈ కేసును జస్టిస్ రఘువేంద్ర రాథోర్ బెంచ్ సోమవారం విచారించింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది పినాకి మిశ్రా వాదనలు వినిపిస్తూ.. సవాల్ చేసే గడువు ముగిసిన తర్వాత దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై విచారణ ముగించాలని కోరారు. ప్రాజెక్టు అనుమతులను పర్యావరణ శాఖ ఆలస్యంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిందన్న పిటిషనర్ వాదనతో బెంచ్ ఏకీభవించింది. తదుపరి విచారణను వచ్చే నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

# చినుకు తడి.. మురిసిన మడి

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ శాఖ నివేదిక చెబుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎంతో ఉపయోగకరంగా మారాయి. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇప్పటి వరకు 4.02 లక్షల ఎకరాల్లో సాగు చేసిన సోయాబీన్ ప్రస్తుత వర్షాలతో గట్టెక్కుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే పత్తి పంట దాదాపు అన్ని జిల్లాల్లో సాగు చేస్తున్నారు. రైతులు ఇప్పటి వరకు దాదాపు 40 లక్షల ఎకరాలలో సాగు చేశారు. ఈ పంట కాస్త ఎదిగి, వానలు లేకపోవడంతో వాడిపోయింది. మరో వారం, పది రోజుల్లో పూత దశ రావాల్సి ఉంది. ఈ సమయంలో చినుకుల సవ్వడితో అన్నదాతలో ఆశలు రేగాయి. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో మొక్కజొన్న కూడా అధికంగా 7 లక్షల ఎకరాల్లో సాగవుతుంది. దీంతో పాటు పప్పు దినుసుల పంటలు కూడా పర్వాలేదన్నట్లుగానే ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు ఆయా పంటలన్నింటికీ ఊపిరిలూదాయి. వాడిపోయే దశలో ఉన్న పత్తి, వరి, మొక్కజొన్న వంటి పంటలు ప్రస్తుత వర్షాలతో గట్టెక్కనున్నాయి. మరిన్ని రోజుల పాటు స్థిరంగా వర్షాలు పడతాయన్న వాతావరణ కేంద్రం ప్రకటన రైతన్నల్లో ఆనందాన్ని నింపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. దీంతో వ్యవసాయ అనుబంధ వ్యాపారాలు కూడా పుంజుకున్నాయి.

### సాధారణ స్థితికి రుతుపవన ద్రోణి

రాజస్తాన్‌లోని గంగానగర్ నుంచి అలహాబాద్ మీదుగా ఉత్తర బంగాళాఖాతం వరకు దక్షిణాది వైపు రావాల్సిన రుతుపవన ద్రోణి హిమాలయాల వైపు వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో మొన్నటివరకు వర్షాల జాడలేదు. ఇప్పుడా రుతుపవన ద్రోణి హిమాలయాల నుంచి సాధారణ స్థితికి చేరింది. దాని ప్రభావం మూలంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర ఒడిశా దాన్ని ఆనుకుని ఉన్న జార్ఖండ్, పశ్చిమబెంగాల్, గాంగ్‌టక్ ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది ఎత్తుకి వెళ్ళేకొద్దీ నైరుతి దిశ వైపుకి వంపు తిరిగి ఉంది. అలాగే దక్షిణ రాజస్తాన్ నుంచి ఒరిస్సా వరకు మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడింది. దీంతో రాష్ట్రంలో అనేకచోట్ల రాగల 3 రోజులపాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం ఒకట్రెండు చోట్ల భారీ నుండి అతిభారీ వర్షాలు, బుధవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇదిలావుండగా గత 24 గంటల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక, ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్‌లో 7 సెంటీమీటర్ల చొప్పున భారీ వర్షం కురిసింది. జైనూరు, కొత్తగూడ, సారంగాపూర్, మణుగూరుల్లో 6 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

# ముఖేశ్ గౌడ్ కన్నుమూత

▶ మొదటి పేజీ తరువాయి

మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఒకవైపు కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి అంత్యక్రియలు జరుగుతుండగానే.. మరో వైపు ముఖేశ్ గౌడ్ కన్నుమూశారనే వార్త పార్టీలో విషాదం నింపింది. రెండ్రోజుల వ్యవధిలోనే ఇద్దరు సీనియర్ నేతలను పార్టీ కోల్పోయినట్లయింది. గత కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ముఖేశ్ గౌడ్ ఆరోగ్యం.. 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మరింత క్షీణించింది. దీంతో అప్పటినుంచి అపోలో ఆస్పత్రి వైద్యుల సంరక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు 7 శస్త్రచికిత్సలు జరిగాయి. చివరకు చికిత్సకు శరీరం సహకరించకపోవడంతో ఆయన మృతి చెందారు. ముఖేశ్ గౌడ్ 1959 జూలై ఒకటిన జన్మించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు విక్రమ్ గౌడ్, విశాల్ గౌడ్, కుమార్తె శిల్పా ఉన్నారు. అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముఖేశ్ కన్నుమూసినట్టు సమాచారం తెలియగానే కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు జానారెడ్డి, షబ్బీర్ అలీ, పొన్నాల లక్ష్మయ్య భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు.. హుటాహుటిన జూబ్లీహిల్స్‌లోని ఆసుపత్రికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం ముఖేశ్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్–10లోని ఎంపీ, ఎమ్మెల్యేల కాలనీలోని స్వగృహానికి తరలించారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు ఆయన నివాసానికి చేరుకొని నివాళులు అర్పించారు.

### నేడు అధికారికంగా అంత్యక్రియలు


ముఖేశ్ గౌడ్ భౌతికకాయానికి మంగళవారం ఉదయం అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని నగరంలోని జాంబాగ్ మార్కెట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉంచుతారు. అనంతరం అంతిమ యాత్ర బయల్దేరుతుంది. ఫిల్మ్‌నగర్‌లో జేఆర్‌సీ ఫంక్షన్ హాల్ సమీపంలోని గౌడ్ శ్మశాన వాటికలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఆయన భౌతిక కాయానికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

### మాస్‌లీడర్ ముఖేశ్ గౌడ్

గ్రేటర్ హైదరాబాద్‌లో ముఖేశ్ గౌడ్ మాస్‌లీడర్‌గా గుర్తింపు పొందారు. జన హృదయాలను గెలిచిన ప్రజానాయకుడు ముఖేశ్.. నగరంలో వేళ్ళ మీద లెక్కించ దగ్గ కాంగ్రెస్ నాయకుల్లో ఆయన ఒకరు. యూత్ కాంగ్రెస్ నేతగా రాజకీయ అరంగేట్రం చేసి కార్పొరేటర్‌గా, ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఎదిగి వైఎస్ రాజశేఖర రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్లో మంత్రిగా పనిచేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.

### కార్పొరేటర్ నుంచి..

ముఖేశ్ గౌడ్ 3 దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో తన ప్రస్థానం కొనసాగిస్తూ వచ్చారు. ఆదినుంచీ కాంగ్రెస్ భావజాలానికి ఆకర్షితులైన ఆయన విద్యార్థి దశలో ఎన్‌ఎస్‌యూఐలో పనిచేశారు. యువజన కాంగ్రెస్‌లో కీలక నేతగా వ్యవహరించారు. 1986లో తొలిసారి రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన జాంబాగ్ నుంచి కార్పొరేటర్‌గా విజయం సాధించారు. 1989లో మహారాజ్‌గంజ్ నుంచి తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మజ్లిస్ కంచుకోట అయిన ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపి మాస్‌లీడర్‌గా గుర్తింపు పొందారు. అయితే.. 1994,1999లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. అనంతరం 2004లో అక్కడినుంచే మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009లో గోషామహల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2007లో నాటి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ముఖేశ్ గౌడ్ తొలిసారి మంత్రి పదవి చేపట్టారు. 2009లో కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఐదేళ్ల పూర్తి కాలం పనిచేశారు. హైదరాబాద్ బ్రదర్స్‌లో ఒకడిగా గుర్తింపు పొందిన ముఖేశ్ హైదరాబాద్ నగర రాజకీయాల్లోనూ, రాష్ట్ర రాజకీయాల్లోనూ తనదైన శైలిలో రాణించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014, 2018 ఎన్నికల్లో గోషామహల్ నుంచి పోటీచేసి, బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ చేతిలో ఓటమి చవిచూశారు. తెలంగాణ అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించకుండానే కన్నుమూశారు.



ముఖేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

### సీఎం కేసీఆర్ సంతాపం

**సాక్షి, హైదరాబాద్:** మాజీ మంత్రి ముఖేశ్ గౌడ్ మరణంపై సీఎం కేసీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థించారు. ముఖేశ్ మృతి పట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

#### ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రభుత్వ లాంఛనాలతో ముఖేశ్‌గౌడ్ అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ మేరకు అధికారిక అంత్యక్రియల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషికి సీఎం ఆదేశించారు.

### కాంగ్రెస్ ప్రముఖుల సంతాపం

మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు పొన్నం ప్రభాకర్, రేవంత్‌రెడ్డి, కుసుమకుమార్, తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియాలతోపాటు టీపీసీసీ ముఖ్య నేతలు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

## మెడికల్ సీట్లు పొందినట్లు తప్పుడు పత్రాలు

**అప్రమత్తంగా ఉండాలన్న కేంద్రం**

**సాక్షి, హైదరాబాద్:** ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉన్న జాతీయ కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లకు ఎంపికైనట్లు కొంత మంది తప్పుడు పత్రాలు, అందుకు సంబంధించి సీటు కేటాయించినట్లు పత్రాలు సృష్టిస్తున్నారని, ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నేషనల్ కోటా సీట్లలో చేరేందుకు వచ్చిన విద్యార్థుల వద్ద కేంద్ర ఆరోగ్య శాఖ జారీ చేసిన నామినేషన్ పత్రాలు ఉన్నాయో లేదో ముందే సరిచూసుకోవాలని కాలేజీలకు సూచించింది. www.mcc.nic.in మాత్రమే మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ అధికారిక వెబ్‌సైట్ అని, మరే వెబ్‌సైట్‌ను ఎంసీసీ ఉపయోగించట్లేదని ఎంసీఐ స్పష్టం చేసింది.

### ఇదండీ సంగతి



సముచిత స్థానం లేకనే వెళ్లారుగా సార్! మళ్లీ..

## రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయం!

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో క్రీడల కోసం ప్రత్యేకంగా ఓ విశ్వవిద్యాలయం రాబోతోంది. రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామంటూ ఓ ప్రైవేటు సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డిని ఇటీవల కలసి సంస్థ తమ సమ్మతిని తెలియజేసింది. దీంతోపాటుగా రాష్ట్రంలో ఇతర ప్రత్యేక విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు పలు విద్యాసంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని సోమవారం ఆయన మీడియాకు తెలిపారు. త్వరలోనే ఈ విశ్వవిద్యాయాల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేస్తామని వివరించారు. మరోవైపు రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను (వీసీ) ఎంపిక చేసే సెర్చ్ కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## ఆసిఫాబాద్ జిల్లాలో కుండపోత వాన

### రవీంద్రానగర్‌లో 20.. బెజ్జూరులో 17 సెం.మీ.

**సాక్షి, హైదరాబాద్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం కుండపోత వాన కురిసింది. ఇక్కడి చింతలమానేపల్లి మండలం రవీంద్రానగర్‌లో ఏకంగా 20 సెంటీమీటర్ల వర్షం కురవగా, ఈ సీజన్‌లో ఇంతటి వర్షపాతం నమోదు కావడం ఇదే మొదటిసారని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే ఆసిఫాబాద్‌లోని బెజ్జూరు మండల కేంద్రంలో 17 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. సిర్పూరులో 9 సెం.మీ., మంచిర్యాల జిల్లా భీమినిలో 8 సెం.మీ., నమోదైందని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు వెల్లడించారు.

# కదంబా కష్టాలు

- జతకట్టిన కే4, కే6 పులులు
- గర్భం దాల్చితే కే4కు ప్రాణాపాయమే!
- ఇప్పటికే ఉచ్చు గాయంతో విలవిల
- పట్టుకునేందుకు విఫలయత్నం
- అటవీశాఖలో కలవరం

**వేమనపల్లి (బెల్లంపల్లి):** నడుముకు గాయంతో ఇబ్బంది పడుతున్న కదంబా4 (కే4) ఆడపులికి మరో ప్రమాదం ముంచుకొస్తోంది. యుక్త వయసులో ఉన్న అది ఇరవై రోజుల క్రితం మగపులి కదంబా6తో జత కట్టింది. దీంతో గాయంతో ఉన్న కే4 ఒకవేళ గర్భం దాల్చితే ఎలా..? అనే విషయంలో అటవీశాఖకు తలనొప్పిగా మారింది. రెండు రోజుల క్రితం నాగారం నీలగిరి తోట మీదుగా ప్రధాన రహదారి దాటి కే6 జాడలో వెళ్లి నీల్వాయి రేంజ్ బమ్మెన అడవిలోకి తిరిగి వచ్చింది. పశువుల కాపరులు కే4 పులిని చూసి భయంతో పొదల్లోకి పరుగెత్తినట్లు చెబుతున్నారు. నాలుగేళ్ల క్రితం మహారాష్ట్రలోని తాడోబా అభయారణ్యం నుంచి వచ్చిన ఫాల్గుణ పులి మొదటి ఈతలోని నాలుగో పిల్ల కదంబా4గా అటవీశాఖ గుర్తిస్తూ వస్తోంది. రెండేళ్ల నుంచి ఈ పులి.. పుట్టిన కాగజ్‌నగర్ అడవుల నుంచి వచ్చే సమయంలో వేటగాళ్లు అమర్చిన క్లచ్ వైరుకు చిక్కుకుంది. ఎలాగోలా తప్పించుకుని వచ్చింది. యుక్త వయసులో ఉన్నప్పుడే చెన్నూర్ అటవీ డివిజన్ పరిధిలోని టైగర్ కారిడార్‌గా గుర్తించిన నీల్వాయి రేంజ్‌లోకి అడుగుపెట్టింది. చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి రేంజ్‌తోపాటు బెల్లంపల్లి అటవీ డివిజన్ కుశ్నపల్లి రేంజ్‌లో కలియ తిరుగుతున్నా.. గత వర్షకాలం నుంచి తీవ్రమైన గాయంతో బాధపడుతోంది.


ఇటీవల సీసీ కెమెరాకు చిక్కిన కే6 మగ పులి

**గర్భం దాల్చితే ప్రాణాపాయమే**

కే4 పులి గర్భం దాల్చితే నడుముకు ఉన్న ఉచ్చు గాయంతో ప్రాణాపాయమే ఉంటుందని అటవీశాఖ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. పొట్ట పెరిగిన కొద్దీ నడుముకున్న క్లచ్ వైర్ బిగుసుకునే ప్రమాదం ఉంది. వర్షాల కారణంగా గాయం ఎక్కువయ్యే ప్రమాదం లేకపోలేదు.

### పట్టుకునేందుకు పాట్లు

పులిని సురక్షితంగా పట్టుకుని.. ఉచ్చును తొలగించి వైద్యం అందించేందుకు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అటవీశాఖ సిబ్బంది పడరాని పాట్లు పడ్డారు. కాటేపల్లి, సంకారం, పంకిడి సోమారం అడవుల్లో బోనులు ఏర్పాటు చేసి.. అందులో లేగదూడల్ని ఎరగా పెట్టి బంధించే ప్రయత్నం చేశారు. ఈ ప్రాంతాల్లో మచాన్ (మంచె)లు ఏర్పాటు చేసి కదలికలు గుర్తిస్తున్నారు. సిబ్బంది సంచారాన్ని పసిగట్టిన పులి ఆవాసాన్ని మారుస్తూ.. వివిధ ప్రాంతాలకు తరలివెళ్తోంది. నీల్వాయి, కోటపల్లి, కుశ్నపల్లి రేంజ్‌లలో ఇప్పటి వరకు 60 వరకు సీసీ కెమెరాలు అమర్చి పులి కదలికలను పసిగడుతూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లా కన్‌జర్వేటర్ వినోద్‌కుమార్ ఎప్పటికప్పుడు కదలికలను పర్యవేక్షిస్తూనే ఉన్నారు. పలుమార్లు కే4 సంచరించిన ప్రాంతాలకు వచ్చి దాని బాగోగుల గురించి వాకబు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక వైద్యులను రప్పించి మత్తు మందు (కెల్విన్, కెనిన్) వంటివి ప్రయోగించి ప్రాణాలతో బంధించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. చెన్నూర్ డివిజన్ పరిధిలో రాజేశ్, బెల్లంపల్లి డివిజన్‌లో గౌరీశంకర్, కాగజ్‌నగర్ డివిజన్‌లో రమాదేవి అటవీసెక్షన్ అధికారులు టైగర్ మానిటరింగ్ అధికారులుగా అప్రమత్తతో పనిచేస్తున్నారు. యుక్త వయస్సులో ఉన్న కే4, మరోపులి కదంబా 6 సహజ సిద్ధమైన ఎద లక్షణాలతో తోడు కోసం తపిస్తున్నట్లు అటవీశాఖ పర్యవేక్షణలో తేలింది. ఫాల్గుణ పెద్ద పులి రెండో ఈతలోని నాలుగు కూనల్లో మొదటిది కే6 పులి. 20 రోజుల క్రితమే కే4 కే6తో జత కట్టినట్లు గుర్తించారు. రెండు పులులు కలసి సుమారు వారం పాటు ఆసిఫాబాద్ అడవుల్లో కలసి తిరిగినట్లు అటవీశాఖ గుర్తించింది. ఖర్జి సమీపంలోని రామలక్ష్మణుల చెరువు సమీపంలో రెండు పులులు జతకట్టాయి. వర్షాకాలం కావడంతో రెండు పులులు కలుసుకున్నట్లు అక్కడి బురద ఆనవాళ్లు, పాదముద్రలను అధికారులు నమోదు చేశారు. వీడియో, ఫొటోలను సైతం ఉన్నతాధికారులకు చేరవేశారు.


నడుముకు ఉచ్చుతో సీసీ కెమెరాకు చిక్కిన కే4 ఆడపులి

## ‘పెళ్లి’ ఖర్చులకు

# లెక్కల్లేవు!

- కల్యాణలక్ష్మి నిధుల వినియోగంపై గందరగోళం
- 2,253.81 కోట్లకు యూసీలివ్వని రెవెన్యూ శాఖ
- అభ్యంతరాలు వ్యక్తం చేసిన రాష్ట్ర ఆడిట్ విభాగం

**సాక్షి, హైదరాబాద్:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధుల ఖర్చుపై గందరగోళం నెలకొంది. ప్రభుత్వం ఒక శాఖకు నిధులు విడుదల చేస్తుండగా.. మరో శాఖ ద్వారా పంపిణీ జరుగుతుండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. పేదింటి ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ పథకాలను తొలుత సంక్షేమ శాఖల ద్వారా అమలు చేసిన ప్రభుత్వం.. మరింత పారదర్శకత పాటించే క్రమంలో లబ్ధిదారుల ఎంపిక, నిధుల పంపిణీ బాధ్యతలను రెవెన్యూ శాఖకు అప్పగించింది. దాదాపు రెండున్నరేళ్లుగా ఈ పథకాలను రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయి. దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల అర్హత నిర్ధారణ అంతా రెవెన్యూ అధికారులే చూస్తున్నారు. అర్హుల నిర్ధారణ తర్వాత వాటిని సంబంధిత శాసనసభ్యులకు జాబితాను పంపడం.. వారి అనుమతితో నిధులు విడుదల చేయడం జరుగుతోంది.

**రూ.2,253.81 కోట్లకు అందని యూసీలు..**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ప్రభుత్వం ఏటా దాదాపు రూ.1,000 కోట్లు విడుదల చేస్తోంది. ఈ నిధులు నేరుగా సంక్షేమ శాఖలకు ఇస్తోంది. క్షేత్రస్థాయిలో డిమాండ్‌ను బట్టి ఆయా శాఖలు రెవెన్యూ డివిజనల్ అధికారులకు (ఆర్డీఓ) నిధులిస్తారు. ప్రతి త్రైమాసికంలో ఈ పద్ధతిలో నిధులు ఇస్తున్న సంక్షేమ శాఖలు.. వాటి వినియోగానికి సంబంధించిన యూసీలను (యుటిలైజేషన్ సర్టిఫికెట్లు) ఆర్డీఓల నుంచి తీసుకోవడం లేదు. ఇటీవల రాష్ట్ర ఆడిట్ అధికారులు ఆయా శాఖల రికార్డులను పరిశీలిస్తే ఈ నిధుల వినియోగంపై ఉన్న గందరగోళాన్ని గుర్తించారు. ఈ మేరకు ఆయా సంక్షేమ శాఖలకు నోటీసులిచ్చారు. రెండున్నరేళ్లలో రూ.2,253.81 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సంక్షేమ శాఖలు విడుదల చేసిన మొత్తం, అందులో వినియోగం చేసిన నిధులు, మిగులు తదితరాలకు సంబంధించి పూర్తిస్థాయి లెక్కలను చూపాలని అందులో పేర్కొన్నారు.

**సీసీఎల్ఏకు యూసీలు..**

నిధుల వినియోగానికి సంబంధించిన యూసీలివ్వాలని ఆర్డీఓలకు సంక్షేమ శాఖలు సూచించగా.. తమ శాఖాధిపతికి ఇస్తామని ఆర్డీఓలు స్పష్టం చేశాయి. దీనిలో భాగంగా కొందరు ఆర్డీఓలు యూసీలను భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్‌కు (సీసీఎల్ఏ) సమర్పించారు. అయితే వీటిపై సీసీఎల్ఏ సైతం ఆర్డీఓలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో మెజార్టీ ఆర్డీఓలు యూసీలు ఇవ్వలేదు.

# ఫ్చ్.. ఎంబీబీఎస్ ఎన్నారై సీట్లొద్దు!

### ఎక్కువ ఫీజుల కారణంగా విద్యార్థుల విముఖత

- బీ–కేటగిరీ సీట్లన్నీ భర్తీ అయినా.. ఎన్నారై కేటగిరీలో 141 సీట్లు మిగులు
- డీమ్డ్ వర్సిటీల్లో ఫీజులు తక్కువుండటంతో అక్కడకే విద్యార్థుల పరుగులు
- మన ఎన్నారై ఫీజు 23 లక్షలైతే.. డీమ్డ్ ఫీజు 10–12 లక్షల మధ్యే
- అంటే ఐదేళ్లకు ఎన్నారై ఫీజు 1.15 కోట్లయితే, డీమ్డ్ ఫీజు 60 లక్షల్లోపే

**సాక్షి, హైదరాబాద్:** ఎన్నారై కోటా ఎంబీబీఎస్ సీట్లపై విద్యార్థుల్లో రానురానూ ఆసక్తి తగ్గుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ఎన్నారై కోటా ఎంబీబీఎస్ ఫీజులు అధికంగా ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గాలపై విద్యార్థుల అన్వేషణ కొనసాగుతోంది. సాధారణ ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో అంతంత ఫీజులు చెల్లించి ఎంబీబీఎస్ చదవడం కంటే, ఇతర రాష్ట్రాల్లో అంతకంటే నాణ్యమైన కాలేజీల్లో తక్కువ ఫీజుతో చదవడమే మంచిదన్న అభిప్రాయానికి వస్తున్నారు. దీంతో రాష్ట్రంలో వివిధ ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎన్నారై కోటా సీట్లు గణనీయంగా మిగిలిపోయాయి. ఆయా కాలేజీల్లో బీ, సీ (ఎన్ఆర్ఐ) కోటా సీట్లకు మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. బీ–కేటగిరీ ఎంబీబీఎస్ ఫీజు ఏడాదికి రూ.11.55 లక్షలుంది. దీంతో కౌన్సెలింగ్ నిర్వహించిన 1,005 బీ–కేటగిరీ సీట్లన్నీ నిండిపోయాయి. కానీ ఎన్నారై కోటా సీట్ల ఫీజు ఏడాదికి రూ.23.10లక్షలు ఉండటంతో వాటిలో చాలా సీట్లు మిగిలిపోయాయి. ఎన్నారై కోటాలో 469 ఎంబీబీఎస్ సీట్లుండగా, 328 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 141 సీట్లు మిగిలిపోయాయని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. దీంతో ప్రైవేటు మెడికల్ కాలేజీ యాజమాన్యాలు ఏం చేయాలో అర్థంగాక లబోదిబోమంటున్నాయి.

**దేశవ్యాప్తంగా పెరిగిన అవకాశాలు**

తెలంగాణ ప్రభుత్వం మొదటిసారిగా 2018–19 వైద్య విద్యా సంవత్సరం నుంచి నేషనల్ పూల్‌లో చేరింది. దీంతో ఒక్కసారిగా అవకాశాలు పెరిగాయి. నీట్ ర్యాంకుల ఆధారంగానే వీటన్నింటినీ భర్తీ చేస్తుండటంతో అఖిల భారత కోటా సీట్లకు, డీమ్డ్ వర్సిటీల్లోని వైద్య సీట్లకు ఒకే దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఏ కాలేజీకి ఆ కాలేజీ ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. అంటే 40 డీమ్డ్ కాలేజీలుంటే అన్నింటికీ దరఖాస్తు చేసుకోవడం కష్టమయ్యేది. ‘నీట్’పుణ్యమా అని అన్నింటికీ ఒకే దరఖాస్తు, ఒకే కౌన్సెలింగ్ వచ్చింది. పైగా డీమ్డ్ వర్సిటీ హోదా కలిగిన మెడికల్ కాలేజీలు మన రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీలతో సమానమైనవని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు చెబుతున్నారు. పైగా డీమ్డ్ వైద్య కాలేజీలకు కూడా దేశంలో మంచి రేటింగ్స్ ఉన్నాయి. మన ప్రైవేటు మెడికల్ కాలేజీలు.. ఆ డీమ్డ్ వర్సిటీ కాలేజీలకు ఏమాత్రం నాణ్యతలో సరితూగవని అంటున్నారు. పైగా డీమ్డ్ మెడికల్ కాలేజీలు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లోనే ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి అక్కడకు వెళ్లడానికి తెలంగాణ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.




### డీమ్డ్ ఫీజు కూడా సగమే!

డీమ్డ్ మెడికల్ కాలేజీల్లో సీట్లను ఎలాంటి కేటగిరీలుగా విభజించలేదు. అన్నింటికీ ఒకే ఫీజు. అంటే మన ప్రైవేటు కాలేజీల్లో ఉన్న బీ–కేటగిరీ సీట్ల ఫీజుకు అటుఇటుగా డీమ్డ్ వర్సిటీ మెడికల్ ఫీజులుంటాయి. కొన్ని కాలేజీల్లోనైతే ఇక్కడి బీ–కేటగిరీ ఫీజు కంటే కూడా తక్కువగా ఉన్నాయి. కాళోజీ నారాయణరావు ఆరోగ్య వర్సిటీ వర్గాల సమాచారం ప్రకారం డీమ్డ్ వర్సిటీలకు చెందిన మెడికల్ కాలేజీల్లో రూ.10లక్షల నుంచి రూ.12లక్షల మధ్యే ఫీజులున్నాయి. ఉదాహరణకు కర్ణాటక రాష్ట్రం మణిపాల్‌లోని డీమ్డ్ వర్సిటీ హోదా కలిగిన కస్తుర్బా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫీజు ఏడాదికి రూ.11.24 లక్షలు, అదే రాష్ట్రం కొలార్‌లోని డీమ్డ్ వర్సిటీ హోదా కలిగిన శ్రీదేవరాజ్ యూఆర్ఎస్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫీజు రూ.9లక్షలుగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో మన రాష్ట్రంలో ఎన్నారై కోటా ఎంబీబీఎస్ సీటుకు రూ.23.10 లక్షలు చెల్లించడం అవసరమా అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావిస్తున్నారు. మన రాష్ట్రంలో ఎన్నారై కోటాలో చేరితే ఐదేళ్లకు కలిపి రూ.1.15 కోట్లు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదే డీమ్డ్ వర్సిటీల్లో ఐదేళ్లకు కలిపి రూ.45 లక్షల నుంచి గరిష్టంగా రూ.60 లక్షల మధ్యే ఉంటుంది. దీంతో ఇక్కడి ఎన్ఆర్ఐ సీట్లపై నీలినీడలు అలుముకున్నాయి. దీంతో రాష్ట్రంలో కొన్ని మెడికల్ కాలేజీలు ఎన్నారై ఫీజును రూ.12 లక్షలకు తగ్గించాలని యోచిస్తున్నట్లు కాళోజీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే జరిగితే అన్ని చోట్లా సీట్లు అయిపోయినప్పుడు ఇక్కడి ఎన్నారై కోటా సీట్లల్లో చేరే అవకాశముందని భావిస్తున్నారు.

# ‘అసెంబ్లీ’ ఓటర్ల లిస్ట్‌తో మున్సి‘పోల్స్’

- ప్రభుత్వం ప్రక్రియ పూర్తిచేస్తే 20 రోజుల్లోనే ఎన్నికలు
- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి
- పిల్ కొట్టేయాలని కౌంటర్ పిటిషన్ దాఖలు



**సాక్షి, హైదరాబాద్:** ‘మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ముందస్తు ప్రక్రియను పూర్తి చేసిన ఇరవై రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సిద్ధంగా ఉంది. అయితే కొత్త మున్సిపల్ చట్టం రూపొందించిన నేపథ్యంలో సమయం కావాలని ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ నిమిత్తం పది రోజులు గడువు నిర్ణయిస్తూ ఈ నెల 16న నోటిఫికేషన్ వెలువడింది. అయితే హైకోర్టు కేసుల కారణంగా అందుకు మరో ఏడు రోజులు సమయం అవసరమైంది’అని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓటర్ల జాబితా, వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ వంటివి ప్రభుత్వమే చేయాలని, వార్డుల హద్దుల విషయంలో అభ్యంతరాలు వ్యక్తం అయితే సమస్యలు వస్తాయని, 2016లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలప్పుడు డివిజన్ హద్దుల విషయంలో సమస్యలు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల అసెంబ్లీ, లోక్‌సభలకు జరిగిన ఎన్నికల నాటి ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తామని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరుగుతూనే ఉంటుంది కాబట్టి ఆ జాబితాకు గడువు తగ్గించినా ఫర్వాలేదన్నారు. ప్రభుత్వం హడావుడిగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించడాన్ని తప్పుపడుతూ నిర్మల్ జిల్లా నుంచి కె.అంజుకుమార్‌రెడ్డి వేసిన ప్రజాహిత వ్యాజ్యంలో ఎస్ఈసీ తరపున ఆయన హైకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటివరకూ జరిగిన పరిణామాలను, ప్రభుత్వం రాసిన లేఖలు, దానికి ఇచ్చిన జవాబుల గురించి సమగ్రంగా హైకోర్టుకు ఎస్ఈసీ వివరించింది. పిల్‌ను కొట్టేసి ఎన్నికల నిర్వహణకు వీలుగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. రాజ్యాంగంలోని 243–జెడ్ఏ అధికరణ ప్రకారం ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియ ప్రభుత్వం చేయాలి. 2018 డిసెంబర్ 31 నాటికి వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తి చేయాలని అదే ఏడాది సెప్టెంబర్ 15న ప్రభుత్వానికి లేఖ రాశాం. ఈ ఏడాది మార్చి 28 నాటికి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని కోరాం. అయితే ప్రభుత్వం మార్చి 12న రాసిన లేఖలో తెలంగాణ మున్సిపల్ చట్టం–1965 స్థానంలో కొత్త చట్టాన్ని తేబోతున్నామని, అందుకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రచురణ గడువును పొడిగించాలని కోరింది. దాంతో మార్చి 14 వరకూ ఆ ప్రక్రియను నిలిపివేశాం. మే 10వ తేదీ నాటికి ఎన్నికల ముందస్తు ప్రక్రియ, రిజర్వేషన్ల ఖరారు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఏప్రిల్ 3న రాష్ట్రం రాసిన లేఖలో.. ‘కొత్త మున్సిపల్ చట్టం తుది దశకు చేరింది. ఏప్రిల్ మూడో వారానికి వార్డుల పునర్విభజన పూర్తి అవుతుంది’అని తెలిపింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని ఆయన కౌంటర్‌లో వివరించారు. ఈనెల 7వ తేదీ నాటికి పునర్విభజన ప్రక్రియ, 14వ తేదీ నాటికి రిజర్వేషన్లు ఖరారు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఓటర్ల జాబితా సవరణ కోసం పది రోజులు గడువు నిర్ణయిస్తూ జూలై 16న నోటిఫికేషన్ వెలువడినా..హైకోర్టులో రిట్లు దాఖలుతో మరో ఏడు రోజులు అవసరమైంది. ప్రభుత్వం వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి, తమకు నివేదించిన 20 రోజుల్లోగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.. అని రాష్ట్ర ఎన్నికల సంఘం హైకోర్టు తెలిపింది.

## నౌహీరాకు ఐదు రోజుల పోలీసు కస్టడీ



**శివమొగ్గ (కర్ణాటక):** హీరాగోల్డ్ డిపాజిట్ల అక్రమాలకు సంబంధించి ఆ సంస్థ యజమాని, వుమెన్ ఎంపవర్‌మెంట్ పార్టీ స్థాపకురాలు నౌహీరా షేక్‌ను సోమవారం పోలీసులు శివమొగ్గ నగర ప్రధాన కోర్టులో హాజరుపరిచారు. హీరాగోల్డ్ అక్రమాల విచారణ కోసం నౌహీరాను ఏడు రోజలపాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ పోలీసులు విన్నవించగా ఐదు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. హీరాగోల్డ్ సంస్థలో శివమొగ్గ నగరానికి చెందిన షేక్ అతీక్ అనే వ్యక్తి రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఏడాదిగా పెట్టుబడికి వడ్డీ చెల్లించకపోవడంతో ఆమెను సంప్రదించడానికి ప్రయత్నించగా సమాధానం ఇవ్వడం లేదు. దీంతో నగరంలోని సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నౌహీరాను సోమవారం కోర్టులో ప్రవేశపెట్టారు. కర్ణాటకలో కూడా హీరాగోల్డ్ రూ. వేల కోట్ల డిపాజిట్లను వసూలు చేసినట్లు తెలుస్తోంది.

## కన్వీనర్ కోటాలో

# 19,866 సీట్లు మిగులు

- తుది దశ కౌన్సెలింగ్‌లో 12,726 మందికి సీట్లు
- మొత్తంగా ఇంజనీరింగ్‌లో చేరింది 49,544 మందే

**సాక్షి, హైదరాబాద్:** ఇంజనీరింగ్ కన్వీనర్ కోటా చివరి దశ సీట్ల కేటాయింపును ఎంసెట్ ప్రవేశాల కమిటీ సోమవారం రాత్రి ప్రకటించింది. ఇందులో చివరి దశ కన్వీనర్ కోటాలో 12,726 మందికి సీట్లు లభించాయి. మొత్తంగా ఇంజనీరింగ్ సంబంధిత ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా కన్వీనర్ కోటాలో 69,410 సీట్లు అందుబాటులో ఉండగా, మొదటి దశ కౌన్సెలింగ్‌లో 36,818 మందికి సీట్లు లభించాయి. చివరి దశ కౌన్సెలింగ్ పూర్తయ్యే నాటికి మొత్తంగా ఇప్పటివరకు 49,544 మందికి సీట్లు లభించినట్లయింది. ఇంకా కన్వీనర్ కోటాలో 19,866 సీట్లు మిగిలిపోవడం గమనార్హం. మొత్తం 44 ఇంజనీరింగ్ కాలేజీల్లో నూటికి నూరు శాతం అడ్మిషన్లు జరగ్గా, మూడు కాలేజీల్లో ఒక్క సీటుకు కూడా అడ్మిషన్ తీసుకోకపోవడం (జీరో అడ్మిషన్స్) గమనార్హం. చివరి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 31 తేదీ నాటికి ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని టీఎస్ ఎంసెట్ కన్వీనర్ నవీన్ మిట్టల్ విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆ తేదీ నాటికి సంబంధిత కాలేజీకి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకపోతే ఆ సీటు రద్దయినట్లేనని ఆయన తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికేట్లు, జిరాక్స్ కాపీలతో రిపోర్టింగ్‌కు రావాలని ఆయన సూచించారు.

## దేశాభివృద్ధిలో తెలంగాణ కీలకం

### స్కూళ్లలో హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు: బి.జనార్దన్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో మానవ వనరులు మెండుగా ఉన్నాయని, దేశాభివృద్ధిలో తెలంగాణ కీలకం అవుతుందని అమెరికా ఎమోరి యూనివర్సిటీ ప్రొఫెసర్ జగదీశ్ ఎన్.సేథ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ‘ఇండియా ఇన్ ది న్యూ వరల్డ్ ఆర్డర్, ఆపర్చునిటీస్ ఫర్ తెలంగాణ’నే అంశంపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సేథ్ మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలను భారత్‌లో ఏర్పాటు చేసుకోవడం అవసరమన్నారు. ప్రపంచీకరణలో భాగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా మన దగ్గర ఉన్న ప్రాంతీయ వనరులను ఉపయోగించి అభివృద్ధి సాధించాలన్నారు. దేశంలో తెలంగాణ చిన్న రాష్ట్రం అయినప్పటికీ అభివృద్ధి చెందడానికి అన్ని అవకాశాలు, రకరకాల పరిశ్రమలు హైదరాబాద్‌లో ఉన్నాయన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందించేలా ఆన్‌లైన్ విద్యను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పేదవర్గాలు ఉన్నత స్థితికి ఎదిగేందుకు స్వచ్ఛంద సంస్థలను వినియోగించుకోవాలని, వాటిని ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. త్వరలో హైదరాబాద్ ఫార్మా, లైఫ్ సైన్స్, ఐటీ సెక్టార్లలో బెంగళూరును దాటేస్తుందని అభిప్రాయపడ్డారు. మల్టీ నేషనల్ కంపెనీలు రీసెర్చ్, డెవలప్‌మెంట్ సెంటర్ల కోసం పెట్టుబడులు పెడుతున్నాయని, త్వరలోనే హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా మారుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు సంబంధించి పెద్దఎత్తున చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో విద్యలో నాణ్యతను పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఆగస్టులో హాజరు మహోత్సవం అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ టి.పాపిరెడ్డి, వైస్ చైర్మన్లు లింబాద్రి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**ANDHRA PRADESH STATE SKILL DEVELOPMENT CORPORATION (APSSDC)**

Andhra Pradesh State Skill Development Corporation (APSSDC) invites RFP for Selection of vendor to supply and installation of various Tools, Instruments, and electronics and networking equipments for SIEMENS Training Centers of APSSDC and ITI colleges across Andhra Pradesh.

For Further details please look into : apeprocurement.gov.in and apssdc.in website. Any Furthre updates will be posted in www.apssdc.in

MD & CEO, APSSDC,Vijayawada.

DIPR Ro No.70 PP/CL/ADVT/1/1/2019-20, Dt : 29-7-2019

సాక్షి ఉద్యోగ అవకాశాలు

**ఇండియన్ రైల్వే కేటరింగ్ & టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వరంగ సంస్థ – మినీ రత్న కేటగిరి-I)
**సౌత్ సెంట్రల్ జోన్**
# 9-1-129/1/302, 3వ అంతస్తు, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా, SD రోడ్, సికింద్రాబాద్ – 500003

**హోటల్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్స్ కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూ**

సౌత్ సెంట్రల్ జోన్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిషా & చత్తీస్‌గఢ్)లో కాంటాక్ట్యువల్ నియామకంపై **F&B** ఇండస్ట్రీ (ప్రొడక్షన్/ సర్వీస్/ ఆపరేషన్స్ మొ॥)లో కనీసం ఒక సంవత్సరం అనుభవంగల హోటల్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్స్ కోసం **IRCTC** చూస్తోంది. వివరాల కోసం వెబ్‌సైట్ **www.irctc.com** ను దర్శించండి.

XCEL :: Right Path :: Right Life ::
www.xcelgroupindia.com
**Walk in Interview**
**Freelance Sales Professionals Required**

We are seeking dynamic and enthusiastic Freelance Sales Professionals to promote our Industry-Leading Jobs-Matching & Recruitment Services in Telangana. Graduates with or without experience can apply. No age limit. M/F. Good communication skills are a must.

Graduates (MBA) with 2-3 years experience (preferably Education and Insurance Sectors) or those with previous experience in the Recruitment Industry are highly preferred.

We Offer: Full Training & Support, Attractive incentives - Best in the Industry.
The opportunity to work alongside some of the best-known companies in India Be a part of the Jobs Revolution!
Walk-in or send your resume.

TERREXO OFFICIAL BRANDING PARTNER

**XCEL Institute of Management & Career Counceling**
Corp. off: # 118, Maheswari Chambers (1st floor)
Somajiguda, Hyd. Ph: 040 - 48557557 / 40112444.
Email: info@xcelgroupindia.com

ITM UNIVERSITY GWALIOR • MP • INDIA "CELEBRATING DREAMS"
STATE RANK 1ST AMONGST TOP 20 IN INDIA FOR LAST 5 YEARS
Approved by UGC, NAAC, AICTE, COA, INC, PCI, NCTE, BCI, AIU, NAAC
Join Updated Industry Ready
B.Tech (H)*
B. Arch
B.Sc. Ag.
MBA/BBA
OVER 300+STUDENTS FROM SOUTH INDIA IN CAMPUS

B.Tech.(H)*
Computer Science (Data Science and Machine Learning/Cyber Forensics/Cloud Computing/)
Electronics & Communication Engineering (Specialization in IOT & Sensors/Microelectronics & VLSI Design)
Civil Engineering (Specialization in Infrastructure Development & Management)
Mechanical Engineering (Specialization in Manufacturing)

Agriculture
B.Sc. Agriculture/ M.Sc. Agronomy/Horticulture/ Genetic Plant Breeding
Optometry
B. Optometry
Architecture
B. Arch.
Sciences
B.Sc./B.Sc.(H) Biotech./Biomedical/ Food Tech./Microbiology/PCM/CS/ M.Sc. Medical Biotech./Biotech./ Food Tech./Microbiology

65,726* placement opportunities provided to students
82% of total eligible students placed so far
Minimum 5 placement opportunities to all eligible students
412* major industries & mnc corporate recruiters

Applicants may apply online at http://onlineapply.itmuniversity.ac.in
Hyderabad Office : Plot No 530, Vivekanand Nagar, Near Reliance Fresh, Kukatpally.
Mob.: 8125822251, 9826297006, 9131033596
Scholarships upto 100%*
CAMPUS: AH-43 Bypass Turari, Jhansi Road, Gwalior (M.P.) - 474001
www.itmuniversity.ac.in

# ఆన్‌లైన్ గేమ్స్‌తో జాగ్రత్త: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో వీడియో గేములు ఆడేటప్పుడు ఎలాంటి వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ విషయంలో పిల్లలు, పెద్దలు అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డుల వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకుల ద్వారా వచ్చే గేములను డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడేటప్పుడు అపరిచితుల రిక్వెస్టులను పట్టించుకోకపోవడమే మంచిదన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ట్వీట్ ద్వారా ఆన్‌లైన్ గేమర్స్‌ను హెచ్చరించారు.

# టీఆర్‌ఎస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారు


## కరీంనగర్ పోలీసు కమిషనర్ కమలాసన్‌రెడ్డిపై బీజేపీ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ పోలీసు కమిషనర్ కమలాసన్‌రెడ్డి ఐపీఎస్ అధికారిలా కాకుండా టీఆర్‌ఎస్ కార్యకర్తలా పని చేస్తున్నారని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు ఆరోపించారు. బీజేపీ కార్యాలయంలో పార్టీ మీడియా కన్వీనర్ సుధాకరశర్మతో కలసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ వ్యాఖ్యల విషయంలో కేసు నమోదు చేయకుండా కమలాసన్‌రెడ్డి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తన పరిధి దాటి అధికార ఉల్లంఘన చేస్తోన్న అధికారులపై ప్రధాని కార్యాలయం దృష్టికి తీసుకెళ్తామన్నారు. డీవోపీటీకి ఫిర్యాదు చేస్తామన్నారు. అక్బరుద్దీన్ విద్వేషాన్ని రెచ్చ గొట్టే స్పీచ్‌లు ఇవ్వడంలో దిట్టని, ఆయన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు కించపరిచేలా ఉన్నాయన్నారు. ఎంఐఎంకు పెద్దన్నగా సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని, అందుకే అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై టీఆర్‌ఎస్ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కమలాసన్‌రెడ్డి బాగా పెద్ద మనిషి కాబట్టే అక్బరుద్దీన్ ఒవైసీకి క్లీన్‌చిట్ ఇచ్చారన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన విద్యార్థులను, ఉద్యోగులను కమలాసన్‌రెడ్డి ఇబ్బంది పెడుతున్నారన్నారు. చిన్న పిల్లలపై రౌడీషీట్లను ఓపెన్ చేస్తున్నారని ఇలాంటి అధికారులకు బీజేపీ రాష్ట్రశాఖ తరపున హెచ్చరిక జారీ చేస్తున్నామన్నారు.

# అందుకు కర్ణాటక రాజకీయాలే నిదర్శనం

## మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎవరైనా అడ్డదారిలో అందలం ఎక్కితే అధికారం కూడా అర్ధంతరంగా పోతుందని చెప్పడానికి కర్ణాటక రాజకీయ పరిణామాలను చూస్తే అర్థం అవుతుందని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14 నెలల కిందట యడియూరప్పకు పూర్తి మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా.. సీఎం పదవిని చేపట్టలేదన్నారు. కాంగ్రెస్, జేడీఎస్‌లు చేసిన కుట్రలను ఛేదించి మళ్లీ రాజమార్గంలో సీఎం పీఠాన్ని అధిరోహించిన యడియూరప్ప పోరాటాన్ని ప్రతి బీజేపీ కార్యకర్త అభినందిస్తున్నారని తెలిపారు. మోదీ, అమిత్ షా నేతృత్వంలో కర్ణాటకను యడియూరప్ప అభివృద్ధి పథకంలో నడపాలని ఆకాంక్షిస్తూ ఆయనకు పొంగులేటి శుభాకాంక్షలు తెలిపారు.

# 'వైద్య విద్య'లో రిజర్వేషన్లకు పాతర

## బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్ల స్ఫూర్తికి విరుద్ధంగా వైద్య విద్య ప్రవేశాల కౌన్సెలింగ్ జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు చేస్తే స్పందించిన ప్రభుత్వం జీఓ 550 తీసుకువచ్చిందని, 18 ఏళ్ల కిందట ఈ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. వైద్య విద్య ప్రవేశాల కౌన్సెలింగ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కాలేజీ మార్చుకుంటే అక్కడున్న సీటును అదే వర్గానికి చెందిన అభ్యర్థికి ఇవ్వాలనేది జీఓ 550 ఉద్దేశమన్నారు. కానీ తాజాగా ఈ పరిస్థితి పూర్తిగా గాడి తప్పిందని, రిజర్వేషన్ ఉన్న అభ్యర్థిసీటు మార్చుకుంటే ఆ సీటును జనరల్ కేటగిరీ అభ్యర్థులతో నింపుతున్నారని, దీంతో రిజర్వేషన్లున్న అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. జీఓ 550 స్ఫూర్తికి విరుద్ధంగా నిర్వహిస్తున్న ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేయాలని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పొరపాట్లను సరిదిద్దాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు ఆయన లేఖ రాశారు.

# సాహిత్యానికి వన్నె తెచ్చిన కవి సినారె

## టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ సి.నారాయణరెడ్డి తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన తెలంగాణ సాహితీ సౌరభమని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తి చేసిన కవి, రచయిత సినారె అని, ఆయన తన రచనలతో సాహిత్య లోకానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. సినారె జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని సోమవారం కేటీఆర్ ట్వీట్ చేశారు.

# థింక్ ట్యాంక్ కమిటీ సభ్యుడిగా రమణారావు

## ఎంహెచ్‌ఆర్‌డీ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో (ఎన్‌ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ సైన్స్‌ల్లో (ఐఐఈఎస్‌టీ) నాణ్యతా ప్రమాణాల పెంపునకు, జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లో ముందుండేలా అవసరమైన చర్యలు చేపట్టేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఎన్‌ఐటీ థింక్ ట్యాంక్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కమిటీకి కోల్‌కతా ఎన్‌ఐటీ డైరెక్టర్ శివాజీ చక్రవర్తిని చైర్మన్‌గా నియమించింది. ఈ కమిటీలో సభ్యుడిగా వరంగల్ ఎన్‌ఐటీ డైరెక్టర్ రమణారావుకు స్థానం కల్పించింది. ఈ మేరకు ఎంహెచ్‌ఆర్‌డీ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో (ఎన్‌ఐఆర్‌ఎఫ్) ఎన్‌ఐటీలు ఉత్తమ ర్యాంకులను సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను ఈ కమిటీ సిద్ధం చేసి తమకు అందజేయాలని ఎంహెచ్‌ఆర్‌డీ స్పష్టం చేసింది. ఈ కమిటీలో తిరుచురాలపల్లి, మేఘాలయ, రూర్కీ ఎన్‌ఐటీలు, ఐఐఈఎస్‌టీలకు చెందిన డైరెక్టర్లు మినిషాజీ థామస్, గౌతం సూత్రదార్, అనిమేష్ బిస్వాస్, పార్థసారథి చక్రవర్తిని సభ్యులుగా నియమించింది. మెంబర్ కన్వీనర్‌గా ఎన్‌ఐటీకే డైరెక్టర్ కె.ఉమామహేశ్వర్‌రావును నియమించింది.

# పోలీసులను సన్మానించిన కేథరిన్ హడ్డా

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ కార్యాలయంలో ఇద్దరు పోలీసు అధికారులను యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా ఘనంగా సన్మానించారు. తాను హైదరాబాద్‌లో విధుల్లో చేరినప్పటి నుంచి కార్యాలయ భద్రతా విధుల్ని వీరెంతో సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. వారి సేవలకు గుర్తుగా సోమవారం వారికి జ్ఞాపికలను అందజేశారు. 2016 అక్టోబరులో హైదరాబాద్ కాన్సుల్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన కేథరిన్ హడ్డా త్వరలోనే విధుల నుంచి తప్పుకోనున్నారు.

# అల్లం నారాయణ కొనసాగింపు

## నేడు వెలువడనున్న ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా అల్లం నారాయణను కొనసాగించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. జూన్ 30తో ముగిసిన ఆయన పదవీ కాలాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మంగళవారం అందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈ సందర్భంగా ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రిని కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం నాలుగేళ్లుగా అమలుపరిచిన కార్యక్రమాలతో మీడియా అకాడమీ ప్రచురించిన పుస్తకాన్ని సీఎం కేసీఆర్‌కు అందజేశారు.

# రాష్ట్రంలో 26 పులులు

## 2014లో 20 పులులున్నట్లు వెల్లడి



సాక్షి, హైదరాబాద్

తెలంగాణలో 26 పులులు ఉన్నట్లు లెక్క తేలింది. గతంతో పోలిస్తే వీటి సంఖ్య పెరిగినట్లు తాజాగా కేంద్రం ప్రకటించిన నివేదికలో వెల్లడైంది. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో దేశవ్యాప్తంగా ఉన్న పులుల సంఖ్యపై ప్రధాని నరేంద్ర మోదీ నివేదిక విడుదల చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారిగా అధికారికంగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. కేంద్ర అటవీ శాఖ పరిధిలోని నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ప్రతి నాలుగేళ్ల కోసారి (2006 నుంచి) వివిధ రాష్ట్రాల్లోని పులుల గణన చేపట్టి అధికారికంగా ప్రకటిస్తోంది. వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, జాతీయ పార్కులు, టైగర్ రిజర్వ్‌లు ఇలా రాష్ట్రంలోని అటవీ ప్రాంతాలన్నింటిలో అఖిలభారత పులులు అంచనా వేసేందుకు 2018 జనవరిలో అధ్యయనం నిర్వహించారు.

**నాగర్ కర్నూల్, నల్లగొండ..**

నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల పరిధిలోని ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్, నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోకి వచ్చే కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లున్నాయి. ఈ ప్రాంతాలు కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ప్రాంతం తూర్పు కనుమల కిందకు వస్తాయి. ఈ రెండు అభయారణ్యాల్లోనూ మెరుగైన నిర్వహణ పద్ధతులను అవలంబిస్తున్నట్లు, గతంతో పోలిస్తే కవ్వాల్ రేటింగ్ 'ఫెయిర్'నుంచి 'గుడ్'స్థానానికి (స్కోర్ 60.16 శాతం) పెరగగా, ఆమ్రాబాద్ 'గుడ్'స్థానంలో (స్కోర్71.09 శాతం) కొనసాగుతున్నట్లు నివేదికలో స్పష్టమైంది. టైగర్ రిజర్వ్‌ల నిర్వహణలో మొత్తంగా రాష్ట్రం స్కోర్ 71.09 శాతం సాధించింది. రెండు రిజర్వ్‌లు కలిపి దాదాపు 5 వేల కి.మీ చదరపు కి.మీ విస్తీర్ణం ఉన్నందున, దాదాపు వంద దాకా పులుల సంరక్షణకు ఇక్కడ అవకాశాలున్నాయని వైల్డ్‌లైఫ్ ఓఎస్డీ శంకరన్ 'సాక్షి'కి తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రంలోని పులుల సంఖ్య 36కు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఎన్‌సీటీఏ ప్రకటించిన వివరాలు మనకు బేస్‌లైన్ డేటాగా ఉపయోగపడుతుందని, 26 పులులు ఉన్నట్లు తేలడం అటవీ శాఖకు, రాష్ట్రానికి ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం పులిపిల్లలు ఆరు దాకా ఉన్నందున అవి పెరిగి పెద్దయ్యేందుకు పటిష్టమైన సంరక్షణ, నిర్వహణ చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. కాగా, ఉమ్మడి ఏపీలో 2006లో 95, 2010లో 72, 2014లో 68 (తెలంగాణలో 20), 2018 తాజా లెక్కల్లో తెలంగాణలో 26 పులులున్నట్లు తేలింది.

**అటవీ రక్షణ చర్యలతో పులుల వృద్ధి: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం, అటవీ శాఖ చేపట్టిన అటవీ రక్షణ చర్యలతో పులుల సంఖ్య 26కు పెరిగిందని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వన్యప్రాణుల రక్షణ, అటవీ సంరక్షణ కోసం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. వన్యప్రాణులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వాటిని కాపాడుకోవడానికి అందరూ మరింత బాధ్యతాయుతంగా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

### ఆమ్రాబాద్‌లో 14..

2014లో ఉమ్మడి ఏపీలో పులుల సంఖ్య 68 ఉన్నాయని, వాటిలో తెలంగాణలో 20 (ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో 17, కవ్వాల్ పులుల అభయారణ్యంలో 3)ఉన్నాయని అంచనా వేశారు. ప్రస్తుతం ఆమ్రాబాద్‌లో 14, కవ్వాల్‌లో 12 ఉండొచ్చని ఆయా డివిజన్లలోని అటవీ అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

# మాట్లాడుకుందాం... రండి

- విభజన సమస్యలపై చర్చలకు రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ఆహ్వానం
- ఢిల్లీలోని హోంశాఖ కార్యాలయంలో వచ్చే నెల 8న భేటీ
- 8 అంశాలతో కూడిన ఎజెండా రూపకల్పన
- ఏపీ భవన్, ఆప్మెల్ సంస్థ విభజన లాంటి అంశాలపై చర్చ
- 9, 10 షెడ్యూళ్లలోని సంస్థలపై మరోసారి దృష్టి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న అంశాలపై మాట్లాడుకునేందుకు రావాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలను కేంద్రం ఆహ్వానించింది. వచ్చే నెల 8న ఢిల్లీలోని నార్త్‌బ్లాక్‌లో ఉన్న కేంద్ర హోం శాఖ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి రావాలని ఇరు రాష్ట్రాలకు ఇటీవల సమాచారం పంపింది. మొత్తం 8 అంశాలతో కూడిన ఎజెండాపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలంగాణ అధికారులు చెబుతున్నారు. ఈ సమావేశానికి కేంద్ర హోం శాఖ కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఇందులో ఏపీ భవన్, ఆప్మెల్ సంస్థ విభజన, డిస్కంల బకాయిలు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ విభజన, తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం, ఏపీలో గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు, 9,10 షెడ్యూళ్లలోని సంస్థల విభజన తదితర అంశాలున్నాయి.

**ఏపీ భవన్ విభజన**

రాష్ట్రం విడిపోయి ఇన్నేళ్లయినా కొలిక్కిరాని ఏపీ భవన్ విభజన అంశం ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానుందని తెలంగాణ అధికార వర్గాలంటున్నాయి. ఈ భవన్ విభజన అంశంలో ఆంధ్రప్రదేశ్ చేసిన రెండు ప్రతిపాదనల పట్ల పెద్దగా ఆసక్తి చూపని తెలంగాణ ప్రభుత్వం నిజాం వారసత్వంగా సంక్రమించిన ఆ ఆస్తిని తమకే ఇవ్వాలని, ఏపీకి పరిహారం కింద కొంత మొత్తం కేటాయిస్తామంటోంది. ఈ మేరకు సీఎం కేసీఆర్ కూడా ఇప్పటికే కేంద్రానికి లేఖలు రాశారు. దీనిపై ఈ సమావేశంలో చర్చించి మరోసారి రెండు రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్రం తీసుకోనుంది. ఆప్మెల్ సంస్థ విషయంలో కూడా సాంకేతిక సమస్య వస్తోంది. విభజన చట్టంలో ఆస్తుల పంపకాలను 58:42 నిష్పత్తిలో పంచినందున ఆప్మెల్ సంస్థను కూడా అలాగే పంచాలని ఏపీ వాదిస్తోంది. అయితే ఆప్మెల్ మాతృ సంస్థ సింగరేణి అయినందున, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి వాటా ఆ సంస్థలో 85 శాతం ఉన్నందున ఆప్మెల్‌ను అలా విభజించడం కుదరదని తెలంగాణ ప్రతివాదన చేస్తోంది. దీనిపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు.

**తేలనున్న డిస్కం బకాయిల అంశం**

తాము సరఫరా చేసిన విద్యుత్‌కు రూ.5,732 కోట్ల బకాయిలను తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఏపీ ప్రభుత్వం అంటోంది. ఈ విషయంలో నిపుణుల కమిటీ ప్రమేయంతో పరిష్కారం జరగాలని ఇప్పటికే కేంద్ర హోం శాఖను కోరింది. కానీ, తెలంగాణకే రూ.2,405 కోట్లు వస్తాయంటూ స్టేట్ రీఆర్గనైజేషన్ విభాగం లెక్కలు వేసింది. ఈ అంశాన్ని ఆగస్టు 8న జరగనున్న సమావేశంలో తెలుస్తారని తెలంగాణ ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ విభజనపై ఏపీ ప్రభుత్వం ఇప్పటికే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ముందుంచిన ప్రతిపాదనపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు.

**ఆ సంస్థల విభజన కూడా**

9,10 షెడ్యూళ్లలోని సంస్థల విభజనపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఏపీ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వ్యవహారంతో పాటు సుప్రీం కోర్టు తీర్పును పేర్కొంటూ ఏపీ ప్రభుత్వం 10వ షెడ్యూల్‌లోని సంస్థల విభజన చేయాలని కోరుతోంది. తొమ్మిదో షెడ్యూల్‌లో అపరిష్కృతంగా ఉన్న 91 సంస్థల వ్యవహారం కూడా సమావేశంలో చర్చకు రానుంది. ఈ సంస్థల హెడ్‌క్వార్టర్స్ నిర్వచనంపై రెండు రాష్ట్రాల మధ్య ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతోపాటు ఈ సంస్థల వివాదాల పరిష్కారానికి కేంద్రం నియమించిన షీలాభిడే కమిటీ సిఫారసులపై తెలంగాణ ప్రభుత్వం సంతృప్తిగా లేదు. కమిటీ మార్గదర్శకాలు 50 సంస్థలకే పరిష్కారం చూపుతాయంటోంది. మొత్తం మీద ఈ అంశాలన్నింటిపై ఆగస్టు 8న సానుకూల చర్చలు జరుగుతాయని రెండు రాష్ట్రాలు భావిస్తున్నాయి.

### ఆ రెండింటి ఏర్పాటు కోసం..

తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్‌లో గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు. తెలంగాణలో ఏర్పాటు చేయాల్సిన గిరిజన విశ్వవిద్యాలయం పనులను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఈ సమావేశంలో కేంద్రాన్ని కోరనున్నాయి. ఏపీలో గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన స్థల గుర్తింపు ప్రక్రియపై కేంద్రానికి ఏపీ ప్రభుత్వం వివరించాల్సి ఉంటుంది.

# ఆధార్ వివరాలు ఇవ్వలేం!

- మృతదేహాల వివరాలివ్వాలని యూఐడీఏఐను ఆదేశాలించాలంటూ హైకోర్టుకు వెళ్తున్న పోలీసులు
- వేలిముద్రల ఆధారంగా వివరాలివ్వడం కుదరదు.. అది గోప్యతా చట్టానికి విరుద్ధం
- మీ సిబ్బందికి తెలియజేయాలని డీజీపీకి యూఐడీఏఐ లేఖ

సాక్షి, హైదరాబాద్: గుర్తుతెలియని వ్యక్తుల వివరాలు కనిపెట్టడం పోలీసులకు కఠినమైన పనే. సమస్యాత్మక కేసుల్లో మృతదేహం ఆచూకీ పట్టుకోవడం సవాలుగా మారుతుండటంతో చాలా కేసులు ముందుకుసాగక మిస్టరీగానే మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు పోలీసులు ఫలానా మృతదేహం వేలిముద్రల ఆధారంగా వివరాలు వెల్లడించేలా ఆధార్ ప్రాధికారక సంస్థ (యూఐడీఏఐ)ని ఆదేశించాలంటూ కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఇటీవలి కాలంలో తెలంగాణలో ఈ తరహా కేసులు అధికం కావడంతో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ–ఆధార్ మంత్రిత్వ శాఖ స్పందించింది. ఇలాంటి వివరాలు వెల్లడించడం కుదరదని స్పష్టం చేస్తూ తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డికి మూడు పేజీల లేఖ రాసింది. ఈ విషయాన్ని రాష్ట్ర పోలీసులకు తెలియజేయాలని కూడా లేఖలో సూచించింది.

**ఆ లేఖలో ఏముందంటే..**

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ–ఆధార్ మంత్రిత్వశాఖ తరపున హైదరాబాద్‌లోని యూఐడీఏఐ రీజినల్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జి.వేణుగోపాల్‌రెడ్డి డీజీపీకి ఈ విషయమై ఓ లేఖ రాశారు. గుర్తు తెలియని మృతదేహాల విషయంలో వేలిముద్రల ఆధారంగా వివరాలు వెల్లడించాలంటూ పలువురు దర్యాప్తు అధికారులు హైకోర్టును ఆశ్రయించడం మా దృష్టికి వచ్చింది. ఈ విషయంలో వ్యక్తుల బయోమెట్రిక్ లేదా ఐరిష్ తదితర వివరాలను వెల్లడించడం సాధ్యం కాదు. చనిపోయిన వ్యక్తులకు సంబంధించినవైనా సరే ఇవ్వడం కుదరదు. అది గోప్యతా చట్టానికి పూర్తిగా విరుద్ధం. ఆధార్ డేటా బేస్ లోని ప్రతీ వ్యక్తి సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచేందుకు తాము తొలిప్రాధాన్యమిస్తామని, వాటిని వెల్లడించలేమని స్పష్టంచేశారు.

1. ఆధార్ సెక్షన్ 29 (1) 2016 చట్టం ప్రకారం.. ఒక వ్యక్తి బయోమెట్రిక్ (వేలిముద్రలు) లేదా ఐరిష్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించడం కుదరదు. అంతేకాకుండా ఆధార్ ప్రాధికారిక సంస్థ (యూఐడీఏఐ) చనిపోయిన వ్యక్తుల డేటాను ఫోరెన్సిక్ దర్యాప్తు కోసం కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించదు.
2. ఆధార్ సెక్షన్ 33(2) ప్రకారం..కేవలం జాతీయ భద్రతకు విఘాతం కలిగించే అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే వినతిని యూఐడీఏఐ పరిశీలిస్తుంది. దానికి కేంద్ర ప్రభుత్వం, సెక్రటరీ ర్యాంకుకు తగ్గని అధికారి ఆదేశాలు తప్పనిసరి. కేబినెట్ సెక్రటరీ, అన్ని శాఖల న్యాయ వ్యవహారాల కార్యదర్శులతో పాటు ఎలక్ట్రానిక్స్, -ఐటీ కార్యదర్శులతో కూడిన కమిటీ ఈ ఆదేశాలను సమీక్షిస్తుంది. ఆ తరువాతే నిర్ణయం వెలువరుస్తుంది.
3. ఆధార్ సెక్షన్ 33 (1) ప్రకారం.. డెమోగ్రాఫిక్ (సంఖ్యాపరమైన వివరాలు) వివరాలు మాత్రమే వెల్లడిస్తారు. అందులో వేలి ముద్రలు, ఐరిష్ తదితర వివరాలు ఉండవు. అది కూడా హైకోర్టు జడ్జి హోదా ఉన్న వ్యక్తి ఆదేశించినపుడు మాత్రమే.
4. 2018లో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పోలీసులు ఇలాగే వివరాల కోసం యూఐడీఏఐని ఆదేశించాలని కోర్టుకు వెళ్లారు. అయితే, ఆ కేసుపై హైకోర్టు స్టే విధించింది.

### కోర్టుకు వెళ్లింది వీరే..

రెండు కేసుల్లో గజ్వేల్ రూరల్ సీఐ, సంగారెడ్డికి చెందిన సీఐడీలోని ఫింగర్ ప్రింట్స్ యూనిట్ ఇన్‌స్పెక్టర్, సంగారెడ్డిలోని బీడీఎల్ భానూర్‌కి చెందిన ఇన్‌స్పెక్టర్, గజ్వేల్‌టౌన్ సీఐ, తొగుట సీఐలు గుర్తు తెలియని మృతదేహాల కేసుల్లో వివరాలు వెల్లడించేలా యూఐడీఏఐని ఆదేశించాలంటూ ఆరు కేసుల్లో హైకోర్టును ఆశ్రయించారు. వీరంతా ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం.



# ఐడియా.. అదిరింది

- అందరినీ ఆకర్షిస్తున్న మన 'ఎల్‌ఈడీ స్టాప్‌లైన్స్..
- సెలబ్రిటీల నుంచీ ప్రశంసలు

సాక్షి, హైదరాబాద్: నగరంలో కేబీఆర్ పార్క్ జంక్షన్ వద్ద ప్రయోగాత్మకంగా ఎల్‌ఈడీ స్టాప్ లైన్ ఏర్పాటు చేశారు. అంటే సిగ్నల్ లైట్లు మాత్రమే కాకుండా స్టాప్‌లైన్ కూడా ఏ రంగు సిగ్నల్ ఉందో దాన్ని చూపే విధంగా డిజైన్ చేశారు. ఫలితంగా రెడ్ సిగ్నల్ పడితే ఈలైన్ కూడా ఆరంగులో కనిపిస్తుందన్నమాట. వాహనాలు దీనిపై నుంచి వెళ్లినా ఇబ్బంది లేకుండా తయారుచేశారు. రాత్రి వేళల్లో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

**ఇంతకీ ఎందుకు పెట్టారు..**

సిటీలో ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద చాలా మంది ఓ ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అదేంటంటే.. ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నచోట్ల మినహాయిస్తే జంక్షన్లలో కుడివైపునే సిగ్నల్స్ ఉంటున్నాయి. దీంతో ఎడమ వైపుగా వెళ్ళే వారికి పక్కగా భారీ వాహనం ఉంటే.. సిగ్నల్ సరిగా కనిపించడం లేదు.. దీంతో రెడ్‌సిగ్నల్ పడిన విషయం గుర్తించలేక స్టాప్‌లైన్ క్రాసింగ్ జరుగుతోంది. ఫలితంగా జరిమానానే కాకుండా కొన్నిసార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అటు పాదచారులు రోడ్డు దాటే లైన్స్ పరిస్థితీ అంతే. పగటి వేళల్లోనే వీటిని గుర్తుపట్టడం కష్టసాధ్యంగా మారింది. రాత్రి పూట అయితే, రోడ్డు దాటే పాదచారులకు మరింత ఇబ్బందికరంగా మారుతోంది. వీటిని పరిగణలోకి తీసుకున్న నగర ట్రాఫిక్ విభాగం అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండే జంక్షన్ల వద్ద ప్రత్యామ్నాయాలను అన్వేషించారు. ఈ నేపథ్యంలోనే ఓ ప్రైవేట్ సంస్థ ట్రాఫిక్ పోలీసుల్ని సంప్రదించింది. ఎల్‌ఈడీ లైట్లతో కూడిన స్టాప్‌లైన్ల ఏర్పాటు ప్రతిపాదనలు చేసింది. ఈ ఎల్‌ఈడీ లైన్ ఏర్పాటు చేయడానికి మీటర్‌కు రూ.6500 వరకు ఖర్చు అవుతోంది.

# బీబీనగర్ ఎయిమ్స్ ఆగస్టులో షురూ!

- 50 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు బోధన
- బీబీనగర్ నిమ్స్ భవనంలోనే చకచకా ఏర్పాట్లు
- అవసరమైన బోధనా సిబ్బంది నియామకం

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎయిమ్స్ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో వైద్య విద్యను ప్రారంభించడానికి ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ఇక్కడి నిమ్స్ ప్రాంగణంలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేయడానికి గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం మంజూరు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆగస్టులో 50 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య విద్య తరగతులను ప్రారంభించడానికి పనులు చకచకా జరుగుతున్నాయి. మొత్తం 100 సీట్లతో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించాల్సి ఉన్నా.. పూర్తి వసతులు లేకపోవడంతో వాటి సంఖ్య సగానికి తగ్గించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిమ్స్ భవన సముదాయాన్ని ఎయిమ్స్ ఉపయోగించుకోనుంది. ఆగస్టు మొదటి వారంలో మరోసారి ఎయిమ్స్ ప్రతినిధుల బృందం ఢిల్లీ నుంచి ఇక్కడికి రానుంది. 2019–20 వైద్య విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా నిర్వహించిన వైద్య విద్య ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇక్కడ బోధన చేయనున్నారు. వైద్య విద్యను బోధించడానికి అవసరమైన డాక్టర్లు, సిబ్బందిని నియమించారు. సుమారు రూ.1,028 కోట్ల నిధులను కేంద్రం ఈ బడ్జెట్‌లో ఎయిమ్స్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. 750 పడకలతో ఆస్పత్రిని ఏర్పాటు చేస్తారు. రోజుకు సుమారు 1,500 మంది ఔట్‌పేషంట్‌లు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఎయిమ్స్‌కు అవసరమైన 221 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడంతో ఆస్పత్రి ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ముందుగా నిమ్స్ కోసం కేటాయించిన 161ఎకరాల భూమిలో నిర్మించిన నిమ్స్ భవన ప్రాంగణాన్ని ఎయిమ్స్ ఉపయోగించుకోనుంది. విద్యుత్ సబ్‌స్టేషన్, వాటర్ ప్లాంట్, నాలుగు లేన్ల రోడ్డుతో పాటు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి ఈ సంవత్సరం మే 31న ఎయిమ్స్‌ను ప్రారంభించాల్సి ఉండగా వరుస ఎన్నికలు రావడంతో ఆలస్యం జరిగింది. ఎయిమ్స్ పూర్తి స్థాయిలో ప్రారంభమైతే రోగులకు 15 నుంచి 20 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు లభిస్తాయి. సుశిక్షితులైన వైద్య ప్రొఫెసర్లు అందుబాటులో ఉంటారు. సుమారు 3వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని అంచనా వేస్తున్నారు.



ఏ బ్లాక్ ఆవరణలో కొనసాగుతున్న పనులు



సిద్ధమవుతున్న ల్యాబ్

**ముమ్మరంగా పనులు**

బీబీనగర్ పరిధిలోని రంగాపురంలో గల నిమ్స్ భవనంలో నిర్మించిన ఏ బ్లాక్‌లో ఎయిమ్స్ వైద్య యూనివర్సిటీ కళాశాల తరగతులను ఏర్పాటు చేయనున్నారు. తరగతి గదులతో పాటు వీఐపీ లాంజ్, డైరెక్టర్స్ చాంబర్, కాన్ఫరెన్స్ హాల్, వైద్యుల గదుల ఏర్పాటు, రికార్డు రూంలతో పాటు బ్లాక్‌లోని అన్ని ఫ్లోర్‌లకు అనుకూలంగా ఉండే విధంగా లిఫ్ట్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వివిధ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

**ఆగస్టులో విద్యాబోధన: రమేశ్‌రెడ్డి**

ఆగస్టులో ఎయిమ్స్‌లో 50 మంది మెడికల్ విద్యార్థులకు విద్యాబోధన ప్రారంభం అవుతుందని రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుడు (డీఎంఈ) రమేశ్‌రెడ్డి చెప్పారు. అన్ని వసతులు కల్పిస్తున్నామని, అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించామని వివరించారు.

### ముందుగా ప్రైవేట్ భవనాలు అనుకున్నా..

ఎయిమ్స్ మెడికల్ కళాశాలను ముందుగా ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేయాలనుకున్నారు. ఇందుకోసం భువనగిరి మండలం అనంతారంలో రెండు ఇంజనీరింగ్ కళాశాలలను పరిశీలించారు. అవి అంతగా అనుకూలంగా లేకపోవడంతో తాత్కాలికంగా నిమ్స్ కోసం నిర్మించిన భవనంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా అక్కడే తరగతులు నిర్వహించవచ్చని నిర్ణయించారు.



ఎయిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటు చేయనున్న నిమ్స్ ఆవరణలో ఏ బ్లాక్



# టైగర్ జిందా హై..!

## పులులకు భద్రమైన దేశంగా భారత్

- పులుల గణన నివేదిక విడుదల సందర్భంగా మోదీ వెల్లడి
- 2006తో పోలిస్తే దేశంలో రెట్టింపైన పులుల సంఖ్య
- అభివృద్ధి, పర్యావరణం మధ్య సమతుల్యం సాధ్యమన్న ప్రధాని

**దేశంలో పులులు 2,967**

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉన్న పులుల గణన నివేదికను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలో విడుదల చేశారు. పులులకు ప్రపంచంలోనే అత్యంత భద్రమైన నివాస స్థలంగా భారత్‌లోని అడవులు మారాయని ఆయన తెలిపారు. ప్రపంచ పులుల దినోత్సవమైన సోమవారమే మోదీ 'అఖిల భారత పులుల సంఖ్య అంచనా–2018' నివేదికను విడుదల చేస్తూ భారత్‌లో పులుల సంఖ్యను పెంచే ప్రక్రియలో పాలుపంచుకున్న వారందరినీ తాను ప్రశంసిస్తున్నానన్నారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ కింద పనిచేసే వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), జాతీయ పులుల సంరక్షణ సంస్థ (ఎన్‌టీసీఏ) కలిసి సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి. నివేదికలో వెల్లడించిన అంశాల ప్రకారం 2006లో దేశంలో 1,411 పులులు మాత్రమే ఉండగా, వాటి సంఖ్య 2014కు 2,226కు, 2018కి 2,967కు పెరిగింది. పులి పిల్లలను లెక్కలోకి తీసుకోకుండా కేవలం ఎదిగిన పులులను మాత్రమే లెక్కించారు. మోదీ మాట్లాడుతూ 'పులుల సంఖ్యను పెంచడంపై 9 ఏళ్ల క్రితం రష్యాలోని సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ స్థాయి సమావేశం జరిగింది. 2022 నాటికల్లా పులుల సంఖ్యను రెట్టింపు చేయాలని ఆ సమావేశంలో పాల్గొన్న దేశాలన్నీ లక్ష్యంగా పెట్టుకున్నాయి. గడువు పూర్తవ్వడానికి నాలుగేళ్ల ముందే భారత్‌లో పులుల సంఖ్యను మనం రెట్టింపు చేశాం. సంకల్పంతో మనం దేన్నయినా సాధించవచ్చు అనడానికి ఇదే ఉదాహరణ' అని వెల్లడించారు. 2006 నాటి లెక్కలను 2018 లెక్కలతో పోల్చుతూ మోదీ ఈ విషయం చెప్పారు. అదే 2014 లెక్కలను 2018 గణాంకాలతో పోలిస్తే పులుల సంఖ్య నాలుగేళ్లలో 33 శాతం పెరిగింది. దాదాపు మూడు వేల పులులను కలిగిన ఇండియా ఇప్పుడు ప్రపంచంలోనే పులులకు అత్యంత భద్రమైన, పెద్ద నివాస స్థలంగా మారిందని మోదీ పేర్కొన్నారు. కాగా, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి, ఎం–స్ట్రైప్స్ అనే మొబైల్ యాప్ సాయంతో పులుల సంఖ్యను సులభంగా లెక్కించగలిగామని డబ్ల్యూఐఐలో పనిచేసే శాస్త్రవేత్త వైవీ.ఝాలా చెప్పారు. సమాచారాన్ని సేకరించడం సులభమైందిగానీ, దానిని విశ్లేషించడం కష్టంగా మారిందని ఆయన తెలిపారు.

### 'ఏక్ థా టైగర్' నుంచి...

సల్మాన్ ఖాన్ నటించిన రెండు బాలీవుడ్ చిత్రాల పేర్లను మోదీ ప్రస్తావిస్తూ, పులుల సంఖ్య పెరుగుదలపై చమత్కారంగా మాట్లాడారు. భారత్‌లో పులుల సంరక్షణ ప్రక్రియ 'ఏక్ థా టైగర్' (గతంలో ఓ పులి ఉండేది)తో మొదలై, ఇప్పుడు 'టైగర్ జిందా హై' (పులి బతికే ఉంది) వరకు చేరుకుందని మోదీ వివరించారు. అయితే ఇది ఇక్కడితో ఆగకూడదనీ, పులుల సంరక్షణను మరింత వేగవంతం, విస్తృతం చేయాలని ఆయన సూచించారు. పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి మధ్యన ఆరోగ్యకరమైన సమతుల్యం తీసుకురావడం సాధ్యమేనని మోదీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం మౌలిక వసతుల నిర్మాణంతోపాటు అడవుల విస్తీర్ణాన్ని కూడా పెంచగలిగిందని మోదీ తెలిపారు. 2014లో దేశంలో సంరక్షణ ప్రాంతాలు 692 ఉండగా, ప్రస్తుతం 860కి పెరిగిందని వెల్లడించారు. ప్రభుత్వం జంతువుల కోసం కూడా మరిన్ని ఆవాసాలను ఏర్పాటు చేస్తుందన్నారు.

### మధ్యప్రదేశ్‌లో అధికం

దేశంలోనే అత్యధిక సంఖ్యలో పులులు మధ్యప్రదేశ్‌లో ఉన్నాయి. ఆ రాష్ట్రంలో 2014లో 308గా ఉన్న పులుల సంఖ్య 2018కి ఏకంగా 526కి పెరిగింది. అలాగే మహారాష్ట్రలోనూ 2014లో 190 పులులు ఉండగా, 2018లో 312 ఉన్నాయి. 2018 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 48 పులులు ఉన్నాయి. తెలంగాణలో గత నాలుగేళ్లలో పులుల సంఖ్య చెప్పుకోదగ్గ స్థాయిలోనే పెరిగింది. తెలంగాణలో ఆమ్రాబాద్, కవ్వాల్‌ల్లో పులుల సంరక్షణ కేంద్రాలుండగా, ఈ రెండింటిలో కలిపి 2014లో 20 పులులు ఉండేవి. 2018 నాటికి ఆ సంఖ్య 26కు పెరిగింది. ఇవే కాకుండా, మరో ఆరు పులి పిల్లలు కూడా ఆమ్రాబాద్, కవ్వాల్‌ల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పులుల సంఖ్య దేశవ్యాప్తంగా పెరిగినప్పటికీ ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం తగ్గింది. ఛత్తీస్‌గఢ్‌లో 2014లో 46 పులులు ఉండగా, 2018కి వాటి సంఖ్య 19కి పడిపోయింది.

| పులుల సంఖ్య సంవత్సరాల వారీగా | 2006 | 2010 | 2014 | 2018 |
|---|---|---|---|---|
| | 1,411 | 1,706 | 2,226 | 2,967 |





నివేదికను విడుదల చేస్తున్న ప్రధాని మోదీ

### సర్వే సాగిందిలా...

- సర్వే చేసిన అటవీ విస్తీర్ణం – 3,81,400 చదరపు కిలో మీటర్లు.
- ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్‌లు – 27,000
- తీసిన ఫొటోలు – 3.48 కోట్లు
- పులులు కనిపించిన ఫొటోలు – 77,000
- పులుల జాడలను గుర్తించేందుకు సిబ్బంది నడిచిన దూరం – 5,22,996 కిలో మీటర్లు
- సమాచారం సేకరించిన అటవీ డివిజన్లు – 491
- పులుల గణనలో పాల్గొన్న సిబ్బంది సంఖ్య – 44,000

### పులులు అధికంగా ఉన్న రాష్ట్రాలు

| | |
|---|---|
| 1. మధ్యప్రదేశ్ | 526 |
| 2. కర్ణాటక | 524 |
| 3. ఉత్తరాఖండ్ | 442 |
| 4. మహారాష్ట్ర | 312 |
| 5. తమిళనాడు | 264 |

## మా ఉద్యోగాలు.. మా పౌరులకే!

### ఆతిథ్య రంగంపై సౌదీ అరేబియా కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ:** ధనికదేశమైన సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని ఆతిథ్య పరిశ్రమలోని కీలక ఉద్యోగాలను సౌదీ పౌరులతోనే భర్తీచేయాలనీ, విదేశీయుల్ని తీసుకోకూడదని నిర్ణయించింది. ఈ మేరకు విదేశీయుల్ని తీసుకోవడంపై నిషేధం విధిస్తూ సౌదీ కార్మిక శాఖ ఆదేశాలు జారీచేసింది. త్రీస్టార్, అంతకుమించిన హోటళ్లు, రిసార్టులు, ఫోర్‌స్టార్, అంతకుమించిన హోటల్ అపార్ట్‌మెంట్‌లకు ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. ఆతిథ్య పరిశ్రమలో రిసెప్షన్ నుంచి, రెస్టారెంట్ హోస్ట్, మేనేజర్ స్థాయి ఉద్యోగాలన్నీ సౌదీ పౌరులతోనే భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే డ్రైవర్లు, డోర్‌మెన్, పోర్టర్ వంటి ఉద్యోగాలను విదేశీయులతో భర్తీ చేసుకోవచ్చని స్పష్టం చేసింది. సౌదీ అరేబియాలో ప్రస్తుతం నిరుద్యోగం ఎన్నడూ లేనంతగా 13 శాతానికి ఎగబాకింది. అలాగే చమురు ఆధారిత ఆర్థికవ్యవస్థ నుంచి ఆతిథ్యం, పర్యాటకం, ఇంధన రంగాలకు మళ్లేందుకు రూ.30.94 లక్షల కోట్లు వెచ్చిస్తామని యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ చెబుతున్నారు. దీనివల్ల దేశంలో కొత్తగా 15 లక్షల ఉద్యోగాల సృష్టి వీలవుతుందంటున్నారు. ఈ ఆదేశాలు 2019, డిసెంబర్ 29 నుంచి అమల్లోకి రానున్నాయి. 2017 గణాంకాల ప్రకారం సౌదీలో 41 లక్షలమంది భారతీయులు వేర్వేరు రంగాల్లో పనిచేస్తున్నారు. తాజా నిర్ణయంతో వీరిలో చాలామంది ఉద్యోగాలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సౌదీ పౌరులను విధుల్లోకి తీసుకుంటే, వ్యయాలు అమాంతం పెరుగుతాయనీ, ఉత్పాదకత తగ్గిపోతుందని కొన్ని సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## గుట్కా కేసులో రూ. 246 కోట్ల ఆస్తుల జప్తు

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** తమిళనాడులో గుట్కా, మత్తుపదార్థాల అక్రమ అమ్మకాల కేసులో రూ. 246 కోట్ల ఆస్తులను సీబీఐ, ఈడీ అధికారులు జప్తు చేశారు. వీటి తయారీ, అమ్మకాలు, నిల్వపై 2013లో అప్పటి ముఖ్యమంత్రి జయలలిత నిషేధం విధించారు. అయితే మార్కెట్‌లో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతుండడంతో 2016లో ఐటీ అధికారులు గుట్కా హోల్‌సేల్ వ్యాపారి మాధవరావుకు చెందిన గిడ్డంగి, ఇంట్లో సోదాలు చేశారు. గుట్కా అక్రమ అమ్మకాల కోసం ఉన్నతాధికారులకు రూ.39.91 కోట్ల లంచం ఇచ్చినట్లు వివరాలు నమోదు చేసిన డైరీ దొరికింది. దీంతో రూ. 243 కోట్ల విలువచేసే స్థిరాస్తులు, రూ. 2.29 కోట్లు విలువైన వాహనాలను జప్తు చేశారు.

## ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోల మృతి



**చర్ల/నాగ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళ సహా ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో సోమవారం ఉదయం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. కుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని కన్నాయిగూడ–బాలంతోగు గ్రామాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు.

**ఓ మహిళా మావో మృతి..**

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎలైట్ సీ–60 కమాండోలకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మహిళా మావో మృతిచెందింది. మరి కొందరు మావోలు కూడా మరణించి ఉండవచ్చని పోలీసులు అంటున్నారు.

## 'ఉన్నావ్' బాధితురాలి ప్రమాదంపై ఎఫ్ఐఆర్

### బీజేపీ ఎమ్మెల్యేతో పాటు 10 మందిపై కేసు



ఎమ్మెల్యే కుల్దీప్

**లక్నో:** 'ఉన్నావ్' రేప్ బాధితురాలు ట్రక్ ప్రమాదానికి గురికావడంపై బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ సహా 10 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఐపీసీ 302, 307, 506, 120బీ సెక్షన్ల కింద వీరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇది ఉద్దేశపూర్వకంగా హత్యచేయడానికి జరిగిన దాడి అని బాధితురాలి తల్లి ఆరోపించారు. బాధితురాలి తరఫున ఎవరైనా సీబీఐ విచారణ కోరితే, అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూపీ డీజీపీ ఓపీ సింగ్ అన్నారు. డ్రైవర్‌ను, క్లీనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న బాధితురాలి ఆస్పత్రి ఖర్చులన్నీ ప్రభుత్వం భరిస్తుందని జిల్లా మేజిస్ట్రేట్ తెలిపారు.

**బీజేపీ ఎమ్మెల్యే రేప్ చేస్తే అడగొద్దు: రాహుల్**

'ఉన్నావ్' ప్రమాదంపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, బీఎస్పీ చీఫ్ మాయావతి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పందించారు. బేటీ బచావో– బేటీ పడావో.. ఇది మహిళలకు కొత్త చదువు. బీజేపీ ఎమ్మెల్యే మిమ్మల్ని రేప్ చేస్తే అడగొద్దంటూ మీడియా నివేదికను జతచేసి రాహుల్ ట్వీట్ చేశారు.

## అమెరికాలో కాల్పులు.. ముగ్గురు మృతి

**లాస్ ఏంజిలెస్:** అమెరికాలోని కాలిఫోర్నియాలో కాల్పులు కలకలం రేపాయి. గిల్‌రాయ్‌లో జరుగుతోన్న 'గార్లిక్ ఫుడ్ ఫెస్టివల్'లో పాల్గొన్న జనాలపై ఆదివారం ఓ దుండగుడు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా.. 15 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో ఆరేళ్ల బాబు కూడా ఉన్నాడు. అప్రమత్తమైన పోలీసులు అనుమానితుడిని అక్కడికక్కడే కాల్చి చంపారు. క్షతగాత్రుల్లో కొంతమంది ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు గల కారణాలు తెలియరాలేదు.

## ఉరిశిక్షకు బదులు జీవిత ఖైదు

**ముంబై:** 2007లో విప్రో బీపీవో ఉద్యోగినిపై సామూహిక అత్యాచారం, హత్య కేసులో నిందితులకు బాంబే హైకోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో మరణశిక్ష అమలు చేయాల్సి ఉన్నప్పటికీ విచారణలో జాప్యం కారణంగా శిక్షను జీవిత ఖైదుగా మార్చాల్సి వచ్చిందని తెలిపింది. దోషులు పురుషోత్తం బోరాటే, ప్రదీప్ కోకాడేలను జూన్ 24 న ఉరితీయాల్సి ఉంది, అయితే తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఉరిశిక్ష నిలిపివేయాలని జూన్ 21న హైకోర్టు పేర్కొంది. డెత్ వారెంట్ అమలుపై స్టే ఇవ్వాలంటూ దోషులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ బి.పి.ధర్మాధికారి, స్వాప్నా జోషిల ధర్మాసనం సోమవారం అనుమతించింది. వారికి విధించిన ఉరి శిక్షను రద్దు చేశామని ప్రకటించింది.



జిమ్‌కార్బెట్ పార్కులో డిస్కవరీ సాహసికుడు బేర్ గ్రిల్స్‌తో ఉన్న ప్రధాని మోదీ

# 'డిస్కవరీ'లో మోదీ

**ముంబై:** డిస్కవరీ టీవీ చానల్ ప్రసారం చేసే 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' ప్రత్యేక ఎపిసోడ్‌లో నరేంద్ర మోదీ కనిపించనున్నారు. పర్యావరణ మార్పుల వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ డిస్కవరీ ఈ ఎపిసోడ్‌ను రూపొందించింది. ఈ కార్యక్రమంలో సాహసాలు చేస్తూ కనిపించే బేర్ గ్రిల్స్‌తో కలిసి మోదీ కూడా ప్రత్యేక ఎపిసోడ్‌లో నటించారు. ఇందుకు సంబంధించిన షూటింగ్ ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ జాతీయ పార్కులో జరిగింది. ఆగస్టు 12న 180 దేశాల్లో ఈ కార్యక్రమం ప్రసారం కానుంది. దీనిపై మోదీ ఓ ప్రకటన చేస్తూ 'చాలా సంవత్సరాలపాటు నేను ప్రకృతి ఒడిలో, పర్వతాల నడుమ, అడవుల్లో జీవించాను. ఆ అనుభవాలు నా జీవితంపై చెరగని ముద్ర వేశాయి. రాజకీయాలకు సంబంధం లేని, ప్రకృతితో ముడిపడిన ప్రత్యేక కార్యక్రమం కావడంతో ఇందులో నటించేందుకు నేను ఒప్పుకున్నాను' అని తెలిపారు. భారత పర్యావరణ సంపదను ప్రపంచానికి చూపేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన, ప్రకృతితో మమేకమై జీవించాల్సిన అవసరాన్ని చాటి చెప్పేందుకు తనకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని మోదీ చెప్పారు. ఈ ఎపిసోడ్ టీజర్‌ను బేర్ గ్రిల్స్ ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ, మోదీతో కలిసి నటించడం తనకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు.

**రేపు కంచికి రానున్న ప్రధాని**

**సాక్షి ప్రతినిధి, చెన్నై :** ప్రధాని మోదీ బుధవారం తమిళనాడులోని కాంచీపురానికి రానున్నారు. 40 ఏళ్లకోసారి దర్శనమిచ్చే అత్తివరద రాజస్వాముల వారిని ఆయన దర్శించుకోనున్నారు. ఈ నెల 1 నుంచి స్వామివారు శయనరూపంలో దర్శనమిస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 17వ తేదీ వరకు నిలుచున్న రీతిలో విశ్వరూప దర్శనం ఇవ్వనున్నారు. ఈ రెండు రీతుల్లో స్వామివారిని దర్శించుకునేలా ప్రధాని పర్యటన ఖరారైంది.

# ఎన్‌ఎంసీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- దేశవ్యాప్తంగా వైద్యవిద్యలో ఏకీకృత విధానాలకు శ్రీకారం
- 'పోంజీ' నేరాలపై బిల్లుకు రాజ్యసభ ఆమోదం
- పదేళ్ల జైలుశిక్ష, రూ.50 కోట్ల జరిమానా

**న్యూఢిల్లీ:** అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత వైద్య మండలి(ఎంసీఐ) స్థానంలో జాతీయ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)ను ఏర్పాటు చేసే బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. దీనివల్ల వైద్య విద్యారంగంలో పారదర్శకత ఏర్పడుతుందనీ, అనవసరమైన తనిఖీల ప్రహసనం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బిల్లు ద్వారా దేశవ్యాప్తంగా వైద్యవిద్యలో ఏకీకృత విధానాలను తీసుకురానున్నారు. ఇందులోభాగంగా ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పరీక్షను పీజీ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హత పరీక్షగా పరిగణిస్తారు. అలాగే విదేశాల్లో ఎంబీబీఎస్ చదివి భారత్‌లో పీజీ కోర్సుల్లో చేరే విద్యార్థుల కోసం ఓ స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించనున్నారు. ఈ స్క్రీనింగ్ పరీక్షకు నేషనల్ ఎగ్జిట్ టెస్ట్(నెక్స్ట్)గా నామకరణం చేశారు. ఎన్ఎంసీ చట్టం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాల్లో 50 శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) విద్యార్థులకు అందుతాయని ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందిన మూడేళ్ల లో నేషనల్ ఎగ్జిట్ టెస్ట్‌ను నిర్వహిస్తామన్నారు.

**పోంజి బిల్లుకు ఆమోదం..**

చిట్‌ఫండ్ పేరుతో జరుగుతున్న మోసాలను అరికట్టే 'అనియంత్రిత డిపాజిట్ స్కీంల నిషేధ' బిల్లును సోమవారం పార్లమెంట్ ఆమోదించింది. పేద డిపాజిటర్ల సొమ్ముకు రక్షణ కల్పించడం, వసూలు చేసిన డబ్బును తిరిగిచ్చేలా చూడటం ఈ బిల్లు ఉద్దేశం. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే చట్ట విరుద్ధంగా వసూళ్లకు పాల్పడిన వారికి జరిమానా, జైలుశిక్ష పడనున్నాయి. ఈ విషయమై ఆర్థిక మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ..' 'చట్టంలోని లొసుగుల ఆధారంగా కొందరు వ్యక్తులు నిరుపేదలకు భారీవడ్డీ ఆశ చూపి నగదును వసూలుచేస్తున్నారు. తాజా బిల్లులో పోంజి పథకంతో పాటు స్నేహితులు, పరిచయస్తులు, బంధువుల నుంచి వసూలు చేసే రియల్‌ఎస్టేట్ సంస్థలపైనా చర్యలు తీసుకునేలా నిబంధనలు చేర్చాం. సంబంధిత వ్యక్తులకు ఏడాది నుంచి పదేళ్ల వరకు జైలుశిక్షతో పాటు రూ.2 లక్షల నుంచి రూ.50 కోట్ల వరకు జరిమానా విధించవచ్చు. పోంజి స్కీమ్‌లకు సంబంధించి దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ 978 కేసులు నమోదు కాగా, వీటిలో 326 కేసులో పశ్చిమబెంగాల్‌లోనే నమోదయ్యాయి' అని తెలిపారు. ఈ బిల్లును లోక్‌సభ జూలై 24న ఆమోదించింది.

**'ఉన్నావ్' ప్రమాదంపై సభలో రగడ..**

ఉన్నావ్ రేప్ బాధితురాలి కారును ఓ లారీ అనుమానాస్పద రీతిలో ఢీకొట్టడంపై ప్రతిపక్షాల ఆందోళనలతో రాజ్యసభ దద్దరిల్లింది. ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్ మాట్లాడుతూ.. బాధితురాలిని చంపే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులు యాదవ్‌కు మద్దతుగా నినాదాలు చేయడంతో రాజ్యసభ మధ్యాహ్నానికి వాయిదాపడింది. కేంద్రం చాలా బిల్లుల్ని స్థాయీసంఘాలకు పంపకుండానే ఆమోదిస్తోందనీ, తమ గొంతును నొక్కేస్తున్నారంటూ చేసిన ఆరోపణను చైర్మన్ వెంకయ్యనాయుడు ఖండించారు.

# క్షమాపణ చెప్పిన ఆజంఖాన్



**న్యూఢిల్లీ:** లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ రమాదేవిపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఎంపీ ఆజంఖాన్ వెనక్కి తగ్గారు. సోమవారం ఆయన బీజేపీ ఎంపీ అయిన రమాదేవికి సభలో క్షమాపణలు చేశారు. మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే అలవాటు తనకుందని ఈ సందర్భంగా ఒప్పుకున్నారు. సోమవారం సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా.. రమాదేవికి క్షమాపణ చెప్పాలని ఎంపీ ఖాన్‌ను కోరారు. అందుకే వెంటనే ఖాన్ లేచి..'9 పర్యాయాలు ఎమ్మెల్యేగా, 4 సార్లు మంత్రిగాను, రాజ్యసభ సభ్యుడిగానూ పని చేశా. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా కూడా ఉన్నా. సభా మర్యాదలు నాకు తెలుసు. నా మాటల వల్ల ఎవరైనా నొచ్చుకుంటే, క్షమాపణ కోరుతున్నా' అని అన్నారు. అయితే, ఆయన మాటలు తమకు వినిపించక అర్థం కాదని, మళ్లీ చెప్పాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి కోరారు. ఖాన్ పక్కనే ఉన్న ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్ లేచి, ఆయన క్షమాపణ చెప్పారని, అందుకు తానే హామీ' అని తెలిపారు. అయితే, మళ్లీ క్షమాపణ చెప్పాలని ఖాన్‌ను స్పీకర్ కోరారు. దీంతో ఆయన.. రమాదేవి తనకు సోదరిలాంటి వారు. ఒక విషయాన్ని ఒకసారి చెప్పినా వెయ్యిసార్లు చెప్పినా ఒకే. స్పీకర్ మాట కాదని నేనేమీ మాట్లాడలేను. నా మాటలతో ఎవరికైనా బాధ కలిగితే క్షంతవ్యుణ్ని' అని అన్నారు. అనంతరం ఎంపీ రమాదేవి మాట్లాడుతూ.. 'ఆజంఖాన్ వ్యాఖ్యలతో యావద్దేశం బాధపడింది. అలాంటి మాటలను వినేందుకు నేను ఈ సభకు రాలేదు' అని ఆవేదనతో పేర్కొన్నారు. ఆజంఖాన్ సభలోను, వెలుపల కూడా గతంలో పలు మార్లు మహిళలపై అవమానకరంగా మాట్లాడారని, ఆయన పద్ధతులను మార్చుకోవాలని అన్నారు. గురువారం సభలో ట్రిపుల్‌తలాక్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆజంఖాన్ డిప్యూటీ స్పీకర్ స్థానంలో ఉన్న రమాదేవిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

## రైల్వే ఉద్యోగులకు ముందస్తు పదవీ విరమణ

**55ఏళ్లు పైబడినవారి జాబితా కోరిన రైల్వే శాఖ**

**న్యూఢిల్లీ:** రైల్వేల పనితీరు మెరుగుపరిచే దిశగా ఆ శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సరైన ప్రతిభ కనబరచని ఉద్యోగులను ముందస్తు పదవీ విరమణ ద్వారా తొలగించాలని నిర్ణయించింది. ఇందుకు 55 ఏళ్లు పైబడిన లేదా 2020 మొదటి త్రైమాసికాని కల్లా 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకునే ఉద్యోగుల జాబితాను సిద్ధం చేయాలని అన్ని జోనల్ కార్యాలయాలకు సూచించినట్లు మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. 'ఈనెల 27న రైల్వే శాఖ అన్ని జోనల్ కార్యాలయాలకు లేఖ పంపింది. ఉద్యోగుల వివరాలను సమర్పించడానికి ఆఖరు తేదీ ఆగస్టు 9 అని పేర్కొంది' అని జోనల్ కార్యాలయాలు తెలిపాయి. సరైన పనితీరు కనబరచని లేదా క్రమశిక్షణ పాటించని ఉద్యోగులను ముందస్తు పదవీ విరమణ ద్వారా తొలగించాలని రైల్వే శాఖ నిర్ణయించిందని, ఈ విషయంలో ప్రభుత్వం కచ్చితంగా వ్యవహరిస్తోందని వర్గాలు పేర్కొన్నాయి. ముందస్తు పదవీ విరమణ నిబంధనకు సంబంధించి ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 1.19 లక్షల మందికి పైగా గ్రూప్–ఏ, గ్రూప్–బీ ఉద్యోగుల పనితీరును 2014–19 మధ్య కాలంలో సమీక్షించినట్లు ఇటీవల లోక్‌సభకు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం రైల్వేలో 13 లక్షల మంది ఉద్యోగులున్నారని, వారిని 2020 కల్లా 10 లక్షల మందికి తగ్గించడమే మంత్రిత్వ శాఖ ఉద్దేశమని ఆయా వర్గాలు పేర్కొన్నాయి.

# విశ్వాసపరీక్షలో 'యెడ్డీ' విజయం

- మూజువాణి ఓటుతో విశ్వాస తీర్మానానికి ఆమోదం
- ప్రతీకార రాజకీయాలు చేయకుండా పనిచేస్తానన్న సీఎం యడియూరప్ప
- బలపరీక్ష పూర్తైన వెంటనే స్పీకర్ రమేశ్ కుమార్ రాజీనామా

**సాక్షి, బెంగళూరు/న్యూఢిల్లీ:** కర్ణాటకలో గత నెల రోజులుగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికి తెరపడింది. విధానసౌధలో సోమవారం జరిగిన విశ్వాసపరీక్షలో ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప విజయం సాధించారు. అసెంబ్లీ ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగానే సీఎం యడియూరప్ప 'నా నేతృత్వంలోని మంత్రివర్గంపై ఈ సభ విశ్వాసం ఉంచుతోంది' అనే ఏకవాక్య తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..'నేను ప్రతీకార రాజకీయాల జోలికిపోను. గతంలో జరిగినవాటిని క్షమించి, విభేదాలను పక్కనపెట్టి ముందుకెళ్లడాన్ని నేను నమ్ముతా. కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వ హయాంలో పాలనా యంత్రాంగం నిర్వీర్యమైంది. దీన్ని చక్కదిద్దడమే మా తొలి ప్రాధాన్యత. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రతిపక్షాల సహకారాన్ని కూడా కోరుతున్నా' అని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష కాంగ్రెస్–జేడీఎస్ సభ్యులు డివిజన్ కోరకపోవడంతో విశ్వాసతీర్మానం మూజువాణి ఓటుతో ఆమోదం పొందిందని స్పీకర్ రమేశ్ కుమార్ ప్రకటించారు. దీంతో బీజేపీ ఎమ్మెల్యేలు బల్లలుచరిచి హర్షం వ్యక్తంచేశారు. స్పీకర్ రమేశ్ కుమార్ ఆదివారం కాంగ్రెస్–జేడీఎస్‌లకు చెందిన 17 మంది ఎమ్మెల్యేలపై అనర్హతవేటు వేసిన విషయం తెలిసిందే.

**ఇది అనైతిక ప్రభుత్వం..**

విశ్వాసతీర్మానంపై చర్చ సందర్భంగా సీఎల్పీ నేత సిద్దరామయ్య ముఖ్యమంత్రి యడియూరప్పపై నిప్పులు చెరిగారు. 'యడియూరప్ప నేతృత్వంలో రాజ్యాంగానికి వ్యతిరేకంగా, అనైతిక పద్ధతుల్లో ప్రభుత్వం ఏర్పడింది. మీకు(యడియూరప్ప) ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ లేదు. కేవలం 105 మంది ఎమ్మెల్యేలతో మీరు ముఖ్యమంత్రి అయ్యారు. యడియూరప్ప ముఖ్యమంత్రిగా పదవీ కాలాన్ని పూర్తిచేసుకోవాలని నేను కోరుకుంటున్నా. కానీ మీరు అంతకాలం కొనసాగకపోవచ్చు. మీరెంతకాలం ముఖ్యమంత్రిగా ఉంటారో చూద్దాం!' అని సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం హెచ్.డి.కుమారస్వామి మాట్లాడుతూ..'మీరు(బీజేపీ) కుట్రలు పన్ని అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు చేసిన పనులు, ఈ రాజకీయాలు చరిత్రలో నిలిచిపోతాయి. రెబెల్స్ వీధినపడ్డారు. ప్రత్యేక విమానాల్లో తిరిగిన వీరంతా ఇప్పుడు సాధారణ విమానాల్లోనే వస్తున్నట్లు విన్నా' అని వ్యంగ్యంగా అన్నారు. విశ్వాసఘట్టం ముగిసిన నేపథ్యంలో మంత్రివర్గ ఏర్పాటుపై దృష్టిసారిస్తామని బీజేపీ నేత సురేశ్ కుమార్ తెలిపారు. కాగా, అనర్హత వేటును సవాల్‌చేస్తూ రెబెల్ నేతలు రమేశ్ జార్కిహోళి, మహేశ్ కుమటళ్లి సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న యడియూరప్ప



డిప్యూటీ స్పీకర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న రమేశ్ కుమార్

### స్పీకర్ పదవికి రమేశ్ రాజీనామా..

అసెంబ్లీలో విశ్వాసతీర్మానం ఆమోదం పొందినవెంటనే తాను స్పీకర్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు రమేశ్ కుమార్ ప్రకటించారు.'నేను స్పీకర్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. రాజ్యాంగాన్ని అనుసరించి మనస్సాక్షి ప్రకారం విధుల్ని నిర్వర్తించాను. స్పీకర్ కుర్చీ గౌరవాన్ని కాపాడేందుకు శాయశక్తులా కృషిచేశాను. ప్రజలు మీకు(యడియూరప్ప) రెండో అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలో సుపరిపాలనతో మీదైన ముద్ర వేయండి' అని తెలిపారు. అనంతరం తన రాజీనామా లేఖను డిప్యూటీ స్పీకర్ కృష్ణారెడ్డికి అందించి సభ నుంచి నిష్క్రమించారు. అంతకుముందు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులకు ఉద్దేశించిన ఆర్థికబిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది.

సాక్షి
మంగళవారం, జూలై, 30

# 'కర్ణాటకానికి' తెర!

అనుకున్నట్టే కర్ణాటకలో యడియూరప్ప నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం సోమవారం విశ్వాస పరీక్షలో విజయం సాధించింది. ఆ రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం మొదలైననాటి నుంచీ సంచలనాలకు కేంద్రంగా ఉన్న స్పీకర్ కేఆర్ రమేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకున్నారు. ఈ పరిణామాలన్నీ చూశాక అందరికీ ఒకటి మాత్రం అర్థమైంది– ప్రభుత్వం సంఖ్యాపరంగా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తీసుకొచ్చే విశ్వాస తీర్మానంపై చర్చ, ఓటింగ్ ఎడతెగని సీరియల్‌లా రోజుల తరబడి సాగుతాయి. తగినంత బలం ఉందనుకున్నప్పుడు పెట్టే తీర్మానం ఆగమేఘాల మీద పూర్తవుతుంది. రాజీనామాలిచ్చి మహారాష్ట్ర తరలిపోయి మకాం వేసిన కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు 17మంది విప్ విషయంలో తానిచ్చిన నోటీసులకు జవాబివ్వలేదన్న కారణం చూపి స్పీకర్ వారిపై అనర్హత వేటు వేసిన పర్యవసానంగా బల నిరూపణకు అవసరమైన కనీస సంఖ్యాబలం 104కు తగ్గింది. సొంత బలం 105కు తోడు అదనంగా స్వతంత్ర సభ్యుడి ఆసరా తీసుకుని యడియూరప్ప గట్టెక్కారు. ఎంతకాలం అధికారంలో కొనసాగుతారన్న అంశాన్ని పక్కనబెడితే త్రుటిలో చేజారిన సీఎం పదవిని చేజిక్కించుకు తీరాలన్న ఆయన పట్టుదల నెరవేరింది. కర్ణాటకలో నిరుడు మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత అతి పెద్ద పార్టీగా బీజేపీ అవతరించినా... గవర్నర్ వజూభాయ్ వాలా తొలి అవకాశమిచ్చినా ఆయన దాన్ని నిలబెట్టుకోలేకపోయారు. చివరకు కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. గత 14 నెలలుగా యడియూరప్ప అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. కూటమి ఎమ్మెల్యేల్లో కొందరిని సమీకరించుకోవడానికి కృషి చేస్తూనే ఉన్నారు. అందుకు సంబంధించి ఒకరిద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపణలు చేయడమే కాదు...సామాజిక మాధ్యమాల్లో కొన్ని ఫోన్ సంభాషణల ఫైళ్లు కూడా వెలుగుచూశాయి. కూటమి ప్రభుత్వం మాత్రం అంతర్గత కుమ్ములాటలతో కాలం గడిపింది. కుమారస్వామికి సక్రమంగా పాలించడానికి అవకాశమే చిక్కలేదు. 17మంది ఎమ్మెల్యేలు వలసపోవడానికి బీజేపీ ఏం చేసిందన్న సంగతలా ఉంచితే నిరంతర కలహాలతో మునిగితేలే కూటమి నుంచి నిష్క్రమించడానికి ఆ ఎమ్మెల్యేలకు సాకు దొరికిందన్నది వాస్తవం.

ఈ మొత్తం వ్యవహారంలో రమేశ్ కుమార్ పాత్ర గురించి చెప్పుకోవాలి. ఆ పదవి హుందాతనాన్ని నిలబెట్టడంలో, పార్టీలకు అతీతంగా పనిచేయడంలో అసెంబ్లీల మొదలుకొని పార్లమెంటు వరకూ సభాధ్యక్షులు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్న వర్తమానంలో ఆయన ప్రశంసనీయంగా వ్యవహరించారు. కూటమి తరఫున స్పీకర్ పదవిని అధిష్టించినా చాలా వరకూ తటస్థంగా ఉన్నారు. ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించే విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఒకపక్క, విశ్వాస తీర్మానంపై ఓటింగ్ ఫలానా సమయానికల్లా పూర్తికావాలన్న గవర్నర్ తాఖీదులు మరోపక్క వచ్చినా తన విధుల విషయంలో ఆయన స్పష్టంగానే, నిష్కర్షగానే ఉన్నారు. ఒత్తిళ్లకు లొంగడానికి సిద్ధపడలేదు. విశ్వాస తీర్మానంపై జరిగే చర్చను మరింత పొడిగించాలని అప్పటికి సీఎంగా ఉన్న కుమారస్వామి కోరినా నిరాకరించారు. ఓటింగ్‌ను ఎలాగైనా ఇంకోరోజుకు వాయిదా వేస్తే ఏదో ఒరుగుతుందన్న భ్రమలో ఉన్న కుమారస్వామికి చివరకు నిరాశే మిగిల్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత నేత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారం చేజిక్కించుకున్నప్పుడు ఆనాటి స్పీకర్ యనమల రామకృష్ణుడు, గత అయిదేళ్లలో కోడెల శివప్రసాదరావు ఎలా వ్యవహరించారో, ఆ పదవికే ఎలా కళంకం తెచ్చారో తెలుగు ప్రజలు మరిచిపోలేరు. పదవి నుంచి వైదొలగక తప్పనిస్థితి ఏర్పడిన ఒక ముఖ్యమంత్రి అందుకు గల కారణాలను చెప్పుకుందామంటే రామకృష్ణుడు ఆయనకు అవకాశమివ్వలేదు. ఏ పరిస్థితుల్లో తాను పదవి కోల్పోవలసి వచ్చిందో ఎన్టీఆర్ స్వయంగా చెప్పిన వీడియోలు సామాజిక మాధ్యమాల పుణ్యామా అని ఇప్పుడు అందరికీ అందుబాటులోకొచ్చాయి. కానీ యనమల అనుసరించిన వైఖరి కారణంగా అసెంబ్లీ రికార్డుల్లో మాత్రం ఆయన స్వరం లేదు. కోడెల తీరు కూడా ఎన్నో విమర్శలకు తావిచ్చింది. సభలో వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యుల సంఖ్య ఎంతో ఆయనకు తెలుసు. అందులో ఎందరు ఫిరాయించారో తెలుసు. ఎందరికి మంత్రి పదవులొచ్చాయో తెలుసు. కానీ స్పీకర్‌గా అలాంటి సభ్యులపై చర్య తీసుకోవడం తన బాధ్యతన్న సంగతిని మాత్రం మరిచారు. కానీ సభలోనూ, బయట వేదికలపైనా విలువల గురించి గంభీరోపన్యాసాలివ్వడం మానుకోలేదు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడమే కాదు... ఒక సందర్భంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడానికి కూడా ఆయన వెనకాడలేదు. ఈ బాపతు నేతలే స్పీకర్‌లుగా అధికారాలు చలాయిస్తున్న దేశంలో ఫిరాయింపుల నిషేధ చట్టంతోసహా అన్ని రకాల రాజ్యాంగ విలువలూ మంట కలవడంలో వింతేముంది? ఇలాంటి పరిస్థితుల్లో రమేశ్ కుమార్ సభా సంప్రదాయాలనూ, స్పీకర్‌గా తనకున్న అధికారాలను సవ్యంగా వినియోగించుకోలగడం ప్రశంసనీయం.


రాజకీయ వ్యూహప్రతివ్యూహాల దశ ముగిసింది కనుక కర్ణాటక ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి ఏం చేయాలన్న విషయంపై కొత్తగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం దృష్టి పెట్టాలి. సాగు సంక్షోభం, ఉపాధి లేమి గ్రామీణ ప్రాంతాలను ఊపిరాడనీయకుండా చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో కొత్త ప్రభుత్వం తక్షణ చర్యలకు నడుం బిగించాల్సిన అవసరం ఉంటుంది. అయితే యడియూరప్ప అధికారంలో ఎన్నాళ్లు నెట్టుకు రాగలరన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. పదవి కోసం కూటమి సర్కారును కూల్చిన ఎమ్మెల్యేల వైనం కళ్ల ముందు కనబడుతుండగా, బీజేపీలో పదవులాశిస్తున్నవారు సైతం రేపన్న రోజున అదే పని చేయరన్న గ్యారెంటీ లేదు. అదీగాక 17 స్థానాలకూ ఉప ఎన్నికలు వస్తే యడియూరప్పకు అదొక అగ్ని పరీక్ష అవుతుంది. వీటిని ఆయన ఎలా అధిగమిస్తారో, ఎలాంటి ఎత్తులు వేస్తారో వేచి చూడాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢమాసం, తిథి బ.త్రయోదశి ప.12.46 వరకు, తదుపరి చతుర్దశి నక్షత్రం ఆరుద్ర ప.3.54 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం తె.3.22 నుంచి 4.54 వరకు (తెల్లవారితే బుధవారం), దుర్ముహూర్తం ఉ.8.14 నుంచి 9.05 వరకు, తదుపరి రా.10.58 నుంచి 11.44 వరకు అమృతఘడియలు... ఉ.6.02 నుంచి 7.35 వరకు.

సూర్యోదయం : 5.41
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

# సమాచారానికి గ్రహచారం!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

**కేంద్ర పాలక పక్షంలో రోజురోజుకీ అసహనం పెరిగిపోవడానికిగల కారణాలలో ప్రధానమైనది మోదీ ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై ప్రశ్నల్ని సంధించడమే. రాఫెల్‌తో సహా రక్షణ శాఖ కొనుగోళ్లలో జరిగినట్టు పొక్కిన కుంభకోణాలను, పాలకవర్గంలోని అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తుల విద్యార్హతలు, ఆర్థిక వ్యవస్థ పతన దశల గురించిన ప్రశ్నల పరంపరలను పౌర సమాజాలు, వేగులవాళ్లు (విజిల్ బ్లోయర్స్) సమాచార హక్కు చట్టం కింద గుచ్చి గుచ్చి ప్రశ్నించడాన్ని పాలకవర్గం సహించలేక పోతోంది. అందుకే దేశ పౌరులు సమాచారం పొందే హక్కును గుర్తించి రాజ్యాంగ బద్ధతను పొందిన చట్టాన్ని సవరించడానికి బీజేపీ అడ్డగోలు ప్రయత్నాలు చేసింది. దీనికోసం టీడీపీ నుంచి బీజేపీలోకి గెంతేసిన సీఎం రమేష్ తైనాతీ పని చేయడం విశేషం. రాజ్యసభ ఆమోదంతో సమాచార హక్కు పాలకపార్టీ 'దురాచార వాంఛ'గా మారిపోయింది.**

''దేశంలోని పార్లమెంటేరియన్లు తమ పార్లమెంటరీ వ్యాపకాల్ని అబద్ధాలతోనే ప్రారంభిస్తారు'' (All MPs start their Parliamentary careers with lies).

*– మాజీ ప్రధాని వాజ్‌పేయి ఉవాచ: ప్రస్తుత పార్లమెంటు సభ్యుడు రాజీవ్ గౌడ్ ప్రస్తావన (26-07-2019)*

**''సకల అధికారాల కేంద్రీకరణ అనేది, అది శాసన వేదిక లేదా పాలక వర్గం లేదా న్యాయవ్యవస్థ తాలూకు అధికారాలన్నీ కొద్దిమంది చేతుల్లో ఉన్నప్పుడు వారు ఒకరా, కొద్దిమందా లేదా ఎక్కువమందా లేక వారు వంశపారంపర్య శక్తులా లేదా ఎన్నుకోబడిన శక్తులా అన్నదానితో నిమిత్తం లేకుండానే ఒక్క ముక్కలో చెప్పాలంటే నిరంకుశత్వానికి నికార్సయిన నిర్వచనం''**

*– అమెరికా స్వాతంత్ర్య ప్రదాతలలో ఒకరైన జేమ్స్ మాడిసన్ : ది ఫెడరలిస్ట్ నం: 47 (1758 జనవరి 30)*

**''కళ్లు మూసుకుంటే జీవితం తేలిగ్గా గడిపేయవచ్చు. కాని కళ్లు చూస్తున్న దానినల్లా అపార్థంగా భావించడమే అసలు దోషం!''**

*– జాన్ లెన్నిన్ : లూథర్ కింగ్ సమఉజ్జీ*

నిజమే, మన కళ్లముందే చాలా ఘటనలు (అనుకూల ప్రతికూల) అలా దొల్లుకుపోతున్నాయి. బీజేపీ, ఆరెస్సెస్, ఎన్డీయే కూటమి తొలి అయిదేళ్ల పాలన (2014–19)లో నరేంద్ర మోదీ, అమిత్ షా కాంబినేషన్‌లో ఎలా మోసపూరిత, ఆర్థిక విధానాలతో, దేశ ప్రజా బాహుళ్యం ఆర్థిక స్థితిగతులను (సంపన్నవర్గాలు మినహా) అర్థంతరంగా నోట్లరద్దు కార్యక్రమం ద్వారా ఎలా అతలాకుతలం చేసిందీ అనుభవించిన దేశ ప్రజలు చూశారు. ఆ క్రమంలోనే బీజేపీ–ఆరెస్సెస్ ఒరిజినల్ ఎజెండా అయిన 'హిందూ రిపబ్లిక్' స్థాపన లక్ష్యంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో వందల సంఖ్యలో గత అయిదేళ్లలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన దళితులపైనా, మైనారిటీలపైన అత్యాచారాలకు, హింసాకాండకు, మారణకాండకు తెరలేపారు. ఇది ఉత్తర భారతంలోనే కాకుండా దక్షిణ భారత రాష్ట్రాలకూ ఏదో రూపంలో పాకించి, ప్రజా బాహుళ్యంలో ఆందోళనకు కారణమైంది. ఈ వరసలోనే జరుగుతున్న దారుణ సంఘటనలకు నిరసనగా ఉద్యమించి ప్రజల్ని సమీకరించి పాలక విధానాలకు నిరసనగా ఉద్యమించిన గోవింద పన్సారే, ప్రొఫెసర్ కల్బుర్గి లాంటి పెక్కుమంది మేధావులను, లంకేష్ లాంటి పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలను హతమార్చడమో, అరెస్టుల ద్వారా నిర్బంధించడమో జరిగింది. ఈ దారుణ పరిణామాలకు నిరసనగా దేశంలోని పెక్కుమంది మేధావులు తాము గతంలో పొంది ఉన్న అనేక కేంద్రప్రభుత్వ బిరుదులను, పురస్కారాలను బీజేపీ ప్రభుత్వ ముఖం మీద కొట్టి స్వాతంత్ర్యానంతర దశలో తొలి త్యాగశీలతను ప్రదర్శించారు.

ఇక ఆ దశ ముగిసిన దరిమిలా కూడా ఇంతకు ముందు దేశ వ్యాపితంగా పేరెన్నికగన్న మేధావుల హత్యకు కారకులైన దుండగుల్ని (వారెవరో హత్యలు చేయించిన వారికి తెలుసు) గత అయిదేళ్లుగా పట్టి శిక్షించిన ఉదాహరణ ఈరోజుదాకా భారత ప్రజలు ఎరుగరు! కాగా, రెండోసారి అనేక కుంభకోణాల మధ్య, సామాజిక వ్యత్యాసాలకు, ఆర్థిక అసమానతలకు మధ్యనే కుమ్ములాటలు పెంచి తగాదాలు పెంచి,

### రెండో మాట



వారిలో కొందరిని చీల్చి కాంగ్రెస్ అనుసరించిన విభజించి పాలించే సూత్రాన్నే బీజేపీ పాలకవర్గం కూడా జయప్రదంగా అనుసరించి రెండో దఫా పగ్గాలు అందుకుంది. పైగా, గెలుపే ప్రధాన ధ్యేయంగా, వాపే బలుపుగా భావించి ప్రతిపక్షాలలో పేరుకున్న అనైక్యతను పెంచి వాటి నుంచి కొందరు సత్తరకాయలను తమ వైపునకు ధన, అధికార ప్రలోభాలతో గుంజుకుని రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చింది. కొద్ది రోజులనాడు రాజ్యసభలో దేశ సమాచార హక్కు పరిరక్షణా చట్టానికి బీజేపీ పాలకులు తెచ్చిన సమాచార వ్యతిరేక సవరణ బిల్లు సందర్భంగా మాట్లాడిన ఒక సీనియర్ సభ్యుడు ఆ సవరణ బిల్లును పార్లమెంటరీ స్థాయీ సంఘం పరిశీలనకు పంపడానికి ప్రభుత్వం నిరాకరించినందుకు కారణం పేర్కొంటూ. 'నాకిప్పుడు అర్థమైంది, రెండో దఫా బీజేపీ సంకీర్ణం ఈసారి 303 స్థానాలను లోక్‌సభలో ఏ పద్ధతుల్లో పొంది ఉంటుందోనని' వ్యాఖ్యానించాల్సి వచ్చింది.

కథ అంతటితో ముగియలేదు. దేశ పౌరులు సమాచారం పొందే హక్కును గుర్తించి రాజ్యాంగ బద్ధతను పొందిన చట్టాన్ని బీజేపీ అనుకున్న రీతిలో మార్చాలంటే రాజ్యసభ అనుమతి కూడా అవసరం. కానీ రాజ్యసభలో బీజేపీ–ఆరెస్సెస్–ఎన్డీఏ కాంబినేషన్‌కు మెజారిటీ లేదు. లేని మెజారిటీని ఎలా 'కుకప్' చేసి చూపాలి? ఆ పనిని బీజేపీ దొడ్డిదారిన వెళ్లి దారి దోపిడీకి పాల్పడింది. ఈ దోపిడీకి సహకరించిన వాడు చంద్రబాబు స్నేహితుడు, కేసులనుంచి తప్పించుకునేందుకు టీడీపీని వదిలి కాషాయ కండువా కప్పుకుని బీజేపీ తీర్థం పుచ్చుకున్న సీఎం రమేష్. ఆర్టీఐ సవరణ చట్టానికి ఎలాగోలా మద్దతు కూడగట్టే పనిని ఇతనికి బీజేపీ పురమాయించింది. తైనాతీ పని చెప్పింది చేయడమే. రాజ్యసభలో బీజేపీకి లేని 'వాపు'ను తీసుకురావడానికి ఓటింగ్ 'స్లిప్పు'లను తానే నిర్వహించి కొందరి సభ్యులకు వాటినిచ్చి, తిరిగి ఆ స్లిప్పులను సభ మార్షల్ వసూలు చేసి సభాధ్యక్షునికి అందజేయాల్సి ఉండగా –రమేష్ ఆ పని చేయడం సభాధ్యక్షునికే ఆశ్చర్యం వేసి, 'ఏంటి మీరు చేస్తున్న పని, మీకేం పని, వెళ్లి నీ స్థానంలో కూర్చో' అని పలు మార్లు గద్దించాల్సి వచ్చిందని మరవరాదు. ఈ తకరారు ఓటింగ్ ద్వారానే ఆర్టీఐ సవరణ చట్టం సభలో నెగ్గడంతో 'వాపును బలం'గా చూపించుకోవాల్సి వచ్చింది. ఒకవైపు నుంచి ఆర్టీఐ చట్టాన్ని నీరుకార్చుతూ, మరొకవైపు నుంచి 'చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) సవరణ పేరిట ఏ పౌరుడినైనా 'టెర్రరిస్టు' (ఉగ్రవాది)గా ముద్ర వేసే హక్కు కేంద్రానికి దఖలు పడుతుంది. మోదీ రెండోసారి పాలనకు వచ్చిన వెంటనే జరిగిన పని– సుప్రసిద్ధ చలనచిత్ర దర్శక నిర్మాత ఆదూరి గోపాలకృష్ణన్‌పైన, ఇతర స్వతంత్ర భావాలుకల కళాకారులపైన వరుస దాడులను బీజేపీ కనుసన్నల్లో నిర్వహించడం.

సామాజిక కార్యకర్తలపైన దళిత బహుజనులపైన, మైనా రిటీలపైన తరచుగా పనిగట్టుకుని ఆవుపేరిట, గోమాంసం పేరిట విచ్చలవిడిగా సాగిస్తున్న హింస, దౌర్జన్యాలకు, వేధింపులకు మోదీ అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతున్నారు. పాలక పక్షంలో రోజు రోజుకీ అసహనం పెరిగి పోవడానికిగల కారణాలలో ప్రధానమైనవి– రక్షణ శాఖ కొనుగోళ్లలో (ఉదా. రాఫెల్) జరిగినట్టు పొక్కిన కుంభకోణాలను, పాలకవర్గంలోని అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తుల విద్యార్హతలు, ఆర్థిక వ్యవస్థ పతన దశల గురించిన ప్రశ్న పరంపరలను పౌర సమాజాలు, వేగులవాళ్లు (విజిల్ బ్లోయర్స్) సమాచార హక్కు చట్టం కింద గుచ్చి గుచ్చి ప్రశ్నించడాన్ని పాలకవర్గం సహించలేక పోతోంది. కనుకనే తొలి ఆర్టీఐ సమ్మతించి అమలులోకి తెచ్చిన ప్రజల 'సమాచార హక్కు' చట్టానికి తూట్లు పొడిచి తమ నిరంకుశాధికార ప్రతిపత్తికి రక్షణ కవచంగా వాడుకోవడాన్ని ప్రజలు సహించరు. చివరికి సుప్రీంకోర్టులో అత్యంత ప్రసిద్ధ గౌరవ సీనియర్ న్యాయవాదులలో ఒకరుగా పేరొందిన ఇందిరా జైసింగ్, ప్రసిద్ధ సామాజిక కార్యకర్త, న్యాయవాది, 'లాయర్స్ కలెక్టివ్' ఉద్యమ సంస్థ అధ్యక్షుడైన ఆనంద్ గ్రోవర్ తదితరులపైన 'విదేశీ విరాళాల రెగ్యులేషన్ యాక్టు కింద కేసులు మోపి వేధిస్తోంది పాలక వర్గం. కానీ అదే సమయంలో అనేక బ్యాంకులను మోసం చేసిన బడా బడా ఆర్థిక నేరగాళ్లపై 'చర్యల' పేరిట జారీ చేసిన 'లుకౌట్' నోటీసుల వివరాలు ప్రజలకు వెల్లడించడానికి మోదీ 'మనసులోని మాట' పెగిలి బయటకు రావటం లేదు. తొలి అయిదేళ్ల పాలనలోనే కాదు, రెండవసారి అధికారం చేపట్టిన నేటి దశలో సైతం పెక్కు మత విద్వేష కార్యకలాపాలలో మైనారిటీలను వేధిస్తున్న పలు ఉదాహరణలను, దాడులను ప్రధాని దృష్టికి తెస్తూ వివిధ రంగాలలోని 49 మంది ప్రముఖులు ఈ దారుణ దౌర్జన్యకాండను నిలిపివేయవలసిందిగా విజ్ఞప్తి చేయాల్సి వచ్చింది. అందుకు పోటీగా ఎవరో 60 మంది సంతకాలతో బీజేపీ ఒక ప్రకటనను విడుదల చేయించింది. టెర్రరిజాన్ని (ఉగ్రవాదాన్ని) ఎదుర్కోవలసిందే– అది వ్యక్తిగతమైనదైనా, అధికార సంస్థాగత ఉగ్రవాదమైనా ఒకటే. అందుకే జాతీయవాది, మత సామరస్యవాది, సంస్కరణవాది అయిన విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ 'భారతీయ తీరాలు' పేరిట (ఆన్ ది షోర్స్ ఆఫ్ భారత్) పాలక శక్తులకు బుద్ధివచ్చే కవిత రాశారు:

**''భారతీయ తీరాలు/ సకల జాతుల మనుషులను/ఒక్కచోట చేర్చుతాయి/ మేలుకో, ఓ మనసా మేలుకో!/చేతులు బారలు చాపి నిలుచున్నా/ మానవతా దైవానికి నమస్సులు తెలుపుకుంటున్నా/రండి, రండి మానవతా దైవాన్ని మాత్రమే కొలవండి/ఎవరి పిలుపునందుకునోగానీ /మానవులు తీరాలుదాటి తెరలుగా అలలుగా వస్తున్నారు/వీరు భారత మనే మహా సంద్రంలో ఏకమైపోతారు– వారు/ఆర్యులు, అనార్యులు, ద్రావిడులు, హూణులు, పఠాన్లు/మొగలాయీలు– ఒకరా, వీరంతా/ ఒక్క శరీరమై కలిసిపోయారు!''**

విశ్వకవి పాఠం పాలకులకు గుణపాఠమైతే అంతకన్నా విశ్వజనీన సత్యం ఎక్కడుంటుంది?!

abkprasad2006@yahoo.co.in

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**



### సోషల్ మీడియా

#### పీరియడ్



"మీ పీరియడ్ డేట్ మీకు తెలుసు. కానీ, అందుకు మీరు సిద్ధంగా లేరు. మీ దగ్గర సమయానికి ప్యాడ్ కూడా లేదు. ఎన్నో సమస్యలతో సతమతమవుతూ పీరియడ్ డేట్ మర్చిపోయారు. ఎవరి దగ్గరి నుంచో ప్యాడ్ బదులు తీసుకున్నారు. మీ దగ్గర ప్యాడ్ ఉన్నప్పటికీ.. మరొకటి అవసరమవుతుందేమోనని ఆందోళన చెందారు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్న వారు ఎంతమంది ఉన్నారో చేతులెత్తండి"

– రితుపర్ణా చటర్జీ, జర్నలిస్ట్


#### సంతృప్తి



"ప్రభుత్వ పనితీరుతో జనం సంతృప్తిగా ఉన్నారా లేదా అనే అంశాన్ని ఎన్నికల ద్వారా మాత్రమే తెలుసుకోవడం ఒక అసంపూర్ణ ప్రక్రియ. అన్ని స్థాయిల్లో జరిగే పాలనపైనా ప్రజల మనోభావాలు తెలుసుకొనే రాజ్యాంగ విహిత మార్గాలు కనుక్కోవాలి"

– సుధీంద్ర కులకర్ణి
సామాజిక రాజకీయ కార్యకర్త


#### పతనం



"స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతూనే ఉంది. రియల్ ఎస్టేట్ కోమాలోంచి లేవడం లేదు. ఆటో మొబైల్ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మీడియా సంస్థలు మౌనంగా ఉంటున్నాయి లేదంటే సంబంధంలేని వార్తలతో కాలక్షేపం చేస్తున్నాయి. శాంతి భద్రతల పరిస్థితి అధ్వానంగా ఉంది"

– అమిత్ మెహ్రా, రచయిత


#### పార్టీ



"వెన్నెముక లేకపోవడంతో చాలామంది కాంగ్రెస్ నాయకులు పార్టీ పగ్గాలు చేపట్టవలసిందిగా ప్రియాంకా గాంధీ కాళ్లావేళ్లాపడుతున్నారు. ఇంత నిస్సిగ్గుగా సాగిలబడటం సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి అవమానకరం"

– మినాజ్ మర్చంట్, జర్నలిస్ట్

#### న్యాయం



"ఉన్నావ్ అత్యాచార బాధితురాలు తండ్రిని కోల్పోయింది. తల్లిని కూడా పోగొట్టుకుంది. ఆమె అత్త కూడా మరణించింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. బహుశా ఆమె కూడా మరణించవచ్చు. బాధితురాలి కారుని ఢీకొన్న ట్రక్కు నంబర్ ప్లేటుపై నల్లరంగు పూసి ఉంది. సంఘటన జరిగిన వెంటనే పరారైన ట్రక్కు డ్రైవర్ ఆచూకీ దొరకటం లేదు. కానీ, ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ మాత్రం తన పార్టీ సభ్యత్వాన్ని కూడా కోల్పోలేదు. న్యాయం ఎంత అపహాస్యమవుతోంది? ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకంటే ట్రక్కుల ద్వారా జరిగేదే న్యాయమేమో?!"

– షమా మహమద్, కాంగ్రెస్ నేత

## అక్రమ రవాణాను అరికడదాం

నేడు ప్రపంచ అక్రమ రవాణా వ్యతిరేకదినం. అక్రమ రవాణా అనగానే ముందుగా మనందరికీ గుర్తుకువచ్చేది పిల్లలు. పైగా పిల్లల అక్రమ రవాణా సైతం సులభం. వారు ప్రతిఘటించలేరు. బాహ్య ప్రపంచం నుంచి అక్రమ రవాణాకు గురైన పిల్లలను దాచి పెట్టడం సహితం సులభం. సీబీఐ నివేదిక ప్రకారం ఏటా కోటీ 20 లక్షల మంది పిల్లలు అక్రమ రవాణాకు గురవుతున్నారు. మాఫియా ముఠాలు పిల్లలని ప్రమాదకర పరిస్థితుల్లో బాల కార్మికులుగా, మాదక ద్రవ్య అక్రమ రవాణా ముఠాలో సభ్యులుగా, వ్యభిచారులుగా, బిచ్చగాళ్లుగా, దొంగతనం చేసేవారిగా తీర్చిదిద్దుతున్నారు. మన దేశంలో ఇలా అక్రమరవాణాకు గురైన వారిలో 44 వేలమంది బాలకార్మికులుగా గాజు, ఇటుకబట్టీలు, బాణసంచా, తినుబండారాలు తయారు చేసే ఫ్యాక్టరీలలో అర్ధాకలి బాలకార్మికులుగా దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. 3 లక్షల మంది పిల్లలు రోడ్లపై అడుక్కుతింటూ మాఫియా ముఠాలకు డబ్బులు సంపాదించి పెడుతున్నారు. మూడుసార్లు దనపుర ఎక్స్‌ప్రెస్ రైలులో బిహార్ నుంచి ఇక్కడి గాజుల పరిశ్రమకు వచ్చిన పిల్లలను బాలల హక్కుల సంఘం అధికారులు కలిసి పిల్లలకు విముక్తి కలిగించిన సంఘటన నిన్న మొన్న జరిగిందే. వ్యభిచార గృహాల్లో మగ్గుతున్న వారిని యాదగిరి గుట్ట పుణ్యక్షేత్ర పరిసరాల నుంచి విముక్తి కలిగించిన రాచకొండ పోలీసులకు ధన్యవాదాలు. వీరే గాజుల పరిశ్రమలో పనిచేస్తున్న వందలాది చిన్నారులను ఎంతో చాకచక్యంగా విముక్తి కలిపించారు. మాఫియా ముఠాలను అధికారులు అష్ట దిగ్బంధనం చేయడం ద్వారా, ఏపీ సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన అమ్మ వడి పథకం ద్వారా పిల్లల అక్రమ రవాణా తగ్గించవచ్చు. నగరాల్లో, పట్టణాల్లో పిల్లలు ఎవరైనా చేయకూడని పనులు చేస్తూ కనబడితే, మాఫియా కదలికలు కనిపిస్తే పౌరులు తమకేమీ పట్టనట్లు ఉండకుండా పోలీసులకు, అధికారులకు గానీ చైల్డ్‌లైన్ నంబర్ 1098కి గానీ ఫోన్ చేసి చెప్పడం పౌరుల కనీస బాధ్యత.

(నేడు ప్రపంచ అక్రమ రవాణా వ్యతిరేకదినం)

అచ్యుతరావు,
గౌరవ అధ్యక్షులు,
బాలల హక్కుల సంఘం
మొబైల్ : 93910 24242

# గొప్ప చదువరి, అరుదైన మేధావి



కల్లూరి భాస్కరం

దశాబ్దాలుగా ప్రజాజీవితంలో ఉంటూ మనకు తెలిసినట్టు అనిపించే వ్యక్తుల్లో కూడా మనకు తెలియని అద్భుత పార్శ్వాలు ఉంటాయి. అవి ఒక్కోసారి హఠాత్తుగా వెల్లడై ఆశ్చర్యం కలిగిస్తాయి. జైపాల్ రెడ్డిగారు అలాంటి వ్యక్తి. విద్యార్థినాయకునిగా, శాసనసభ్యునిగా, ఎంపీగా, గొప్ప వక్తగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కేంద్రమంత్రిగానే కాక; విలువలకు అంకితమైన వ్యక్తిగా ఆయన రాజకీయ జీవితం తెరచిన పుస్తకమే. ఈ రాజకీయ జీవితమనే దండలో దారంలా ఆయనకు ఎంతో లోతు, వైశాల్యం కలిగిన మేధోజీవితం ఉంది. ఒక ఏడాది పరిచయంలో అది అనేక రూపాలలో నాకు తెలిసివచ్చింది.

జైపాల్ రెడ్డిగారు ఆంగ్లంలో వెలువరించిన 'టెన్ ఐడియాలజీస్–ది గ్రేట్ ఎసిమెట్రీ బిట్వీన్ ఏగ్రేరియనిజం అండ్ ఇండస్ట్రియలిజం' అనే పుస్తకం గురించి ప్రముఖపాత్రికేయులు కె. రామచంద్రమూర్తిగారు చెప్పి, మీరు దానిని తెలుగులోకి అనువదించాలని సూచించినప్పుడు నేను వెంటనే అంగీకరించాను. ఆ సందర్భంలో ఆయనతో కలసి మొదటిసారి జైపాల్ రెడ్డిగారిని కలిసినప్పుడు, కాంగ్రెస్‌లో ఉంటూ అప్పటికే అనేక ఉన్నతపదవులను నిర్వహించిన ఒక ప్రముఖనాయకుని గురించి జైపాల్ రెడ్డిగారు ప్రస్తావించి, ఆయన హిందుత్వవర్గాలకు దగ్గరవడంపై మీ అభిప్రాయమేమిటని అడిగారు. ఆయనే ఆ ప్రశ్నకు సమాధానమిస్తూ, గాంధీ–నెహ్రూ ప్రభావాల మత్తులో రాజకీయాల్లోకి వచ్చి, వారు ప్రాతినిధ్యం వహించిన విలువలను ఉగ్గడిస్తూ దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో ఉన్నా, హిందూత్వాభిమానం ఆయనలో సుప్తావస్థలో ఉందనీ; బాహ్యవాతావరణం హిందూత్వకు అనుకూలంగా మారగానే అదిప్పుడు బయటపడుతోందని ఒక సామాజికశాస్త్రవేత్తలా విశ్లేషించారు. ఈ సందర్భంలోనే, అత్యున్నతపదవిని నిర్వహించిన ఇంకొక ప్రముఖ కాంగ్రెస్ నాయకునికి కూడా ఈ విశ్లేషణను ఆయన అన్వయించారు. దేశంలో ఇప్పుడు ప్రాబల్యం వహిస్తున్న రాజకీయశక్తుల గురించి మాట్లాడుతూ, విప్లవవ్యతిరేక మితవాదశక్తుల విజృంభణ ఈరోజున ప్రపంచవ్యాప్తంగా ఉన్నదేనంటూ, దీనినొక అవాంతరదశగా పేర్కొని చారిత్రిక ఆశావాదాన్ని ధ్వనింపజేశారు.

అనువాదాన్ని పూర్తి చేసిన తర్వాత, ఆయనతో కలసి మూలంతో దానిని బేరీజు వేసుకునే కార్యక్రమం కొన్ని రోజులపాటు సాగింది. అప్పుడే ఆయన వ్యక్తిత్వ, మేధోజీవితాల తాలూకు బహు పార్శ్వాలు నాకు పరిచయమయ్యాయి. రకరకాల భావజాలాల మీదుగా సాగిన ప్రపంచచరిత్రగమనంపై, సంస్కృతీసాహిత్యాలపై తన అవగాహనను, అనుభూతిని ఎదుటివారితో పంచుకోవాలన్న నిరంతరోత్సాహం ఆయనలో ఉరకలు వేసేది. దాంతో ఒక్కోరోజున మా అనువాదపరిశీలన రెండు, మూడు పేజీలను మించి సాగేది కాదు. ఇంకో వైపు, ఆయన రాజకీయమార్గదర్శనం కోసం రాష్ట్రానికి చెందిన ప్రముఖకాంగ్రెస్ నాయకులు, ఆయన ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకు, ఆయన స్వస్థలానికి చెందిన చిన్నా, పెద్దా నాయకులు, అభిమానుల రాకతో అంతరాయం కలుగుతూ ఉండేది. ఆవిధంగా ఆయన రాజకీయ, మేధో జీవితపార్శ్వాలను రెంటినీ ఒకేసారి, ఒకేచోట చూడగల అవకాశం ఏర్పడేది. గాంధీ, బుద్ధుడు, ఫ్రాన్సిస్ బేకన్, జాన్ మేనార్డ్ కీన్స్, డేవిడ్ రికార్డో వంటి పేర్లు ఒకపక్కన; స్వగ్రామంలో సర్పంచ్ ఎన్నికతో సహా పలు అంశాలకు సంబంధించిన మాటలు ఇంకో పక్కన దొర్లుతూ ఒక విచిత్రమైన వాతావరణాన్ని కల్పించేవి. మరోవైపు, ఎన్ని రోజులు తీసుకుంటున్నాసరే, ఒక్క మాటను కూడా విడిచిపెట్టకుండా అనువాదాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంలో ఒక పండితునిలో మాత్రమే ఉండే ఓపిక, శ్రద్ధ, దీక్ష ఆయనలో ఉండేవి. అవసరమైనప్పుడల్లా తన ముందున్న ఆంగ్లనిఘంటువులను, విజ్ఞానసర్వస్వాలను శోధిస్తూ నిర్దుష్టతకు ప్రాధాన్యమిచ్చేవారు. కొన్ని పదప్రయోగాలను, వాక్యాలను స్వయంగా సవరించుకుంటూ, కొన్ని చోట్ల కత్తిరిస్తూ మూలానికి మెరుగులు దిద్దే ప్రయత్నమూ చేశారు.

జైపాల్ రెడ్డిగారిలో ప్రత్యేకించి ఆకట్టుకునేది, ఆయన మౌలికఆలోచనా సరళి. ఆయన ప్రధానంగా జ్ఞానవాది. భాషాసాహిత్యాలలో పాండిత్యం గొప్పదే కానీ, జ్ఞానానికి దోహదం చేయడం అంతకన్నా గొప్పదనేవారు. ఈ సందర్భంలోనే భాషా,సాహిత్యవేత్తగా ప్రసిద్ధికెక్కిన ఒక ప్రముఖకాంగ్రెస్ నాయకుని గురించి ప్రస్తావిస్తూ, ఆయన ఆ రెండింటిలోనూ కూరుకు పోకుండా ఉంటే, జ్ఞానమార్గంలో ముందుకు పోగలిగిన సమర్థుడే ననేవారు. అదే సమయంలో కదిలించే ఒక కవితా వాక్యానికి, లేదా కథనానికి కంట తడిపెట్టే ఆర్ద్రత ఆయనలో ఉండేది. మౌలికచింతనతోపాటు, ఆయనలోని మరో ఆకర్షణ, చారిత్రికదృక్కోణం. ఆయన పుస్తకమే ఈ రెండింటికీ నిలువెత్తు ఉదాహరణ. ఉదారవాదం, లౌకికవాదం, పెట్టుబడిదారీ వాదం, సామ్యవాదంతో సహా నేటి భిన్న భిన్న భావజాలాల వేళ్ళు–సాంస్కృతిక పునరుజ్జీవనం, మానవవాదం, సంస్కరణవాదం, శాస్త్రవిజ్ఞానవిప్లవమనే నాలుగు ఉద్యమాలలోనూ; ఫ్రెంచి, పారిశ్రామిక విప్లవాలలోనూ ఎలా ఉన్నాయో అందులో ఆయన చర్చిస్తారు. మళ్ళీ నేటి సమస్యలు, సంక్షోభాల మూలాలను కూడా వాటిలోనే నిరూపిస్తూ, పరిష్కార మార్గాన్ని సూచిస్తారు. వివిధ భావజాలాల మధ్య నేడున్న ఘర్షణ పరిస్థితిని అధిగమించవలసిన అవసరం ఉందనీ; ప్రస్తుత సంక్షోభాలను సక్రమంగా అర్థం చేసుకుని ముందుకు వెళ్లాలంటే చారిత్రికదృక్కోణాన్ని పెంపొందించుకోవాలనీ ఆయన అంటారు. మన జీవనవిధానంపై సాంకేతిక అభివృద్ధి ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నా; దానికి తగినట్టే ఆలోచనాసరళులలో వచ్చిన మార్పుల ప్రభావం మాత్రం కనిపించడం లేదంటారు. ఉదారవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం వంటి భావనలను ఆధునిక సందర్భంనుంచి తప్పించి పురాతనకాలంనుంచీ ఉన్నవిగా భావించడంలోని పొరపాటును ఎత్తిచూపుతారు. అలాగే, చారిత్రిక పాశ్చాత్యానికీ, ఆధునిక పాశ్చాత్యానికీ తేడా గమనించకపోవడం కూడా మనలోని అనేక అయోమయాలకు కారణమంటారు. వలసదేశాలకు విముక్తి కలిగించినమేరకు జాతీయవాదం ఆహ్వానించదగినదే కానీ; భాష, జాతి, మతం వంటివి దానికి ఆధారం కాకూడదంటారు పెట్టుబడిదారీ విధానం నుంచి సంక్షేమరాజ్యం ఎలా అవతరించిందో, కమ్యూనిజానికి సోషలిజానికి ఉన్న తేడా ఎలాంటిదో ఆయన వివరించిన తీరు ఆసక్తికరమే కాక; ఎంతో అవగాహనాకరంగా ఉంటుంది. నేటి అనేక సవాళ్ళకు మూలాలు, మన వ్యావసాయిక గతంలో ఉన్నాయనీ, పారిశ్రామికవిప్లవం ఆవిష్కరించిన సాంకేతిక అద్భుతాలతో, వ్యావసాయికదశకు చెంది కరడుగట్టిన మన మనస్తత్వం తులతూగలేకపోవడమే అసలు సమస్య అనీ ఆయన చేసిన నిర్ధారణ చారిత్రికకోణం నుంచి మరింత ఆసక్తినీ, ఆలోచననూ కలిగిస్తుంది.



నివాళి


గాంధీ–నెహ్రూ–అంబేడ్కర్‌ల భావధార సన్నగిల్లుతున్నదనీ, భావజాలాలకు ప్రాధాన్యం అడుగంటిందనీ భావించే కాలంలో వెలువడడం ఆయన పుస్తకానికి విశేష ప్రాధాన్యాన్ని కల్పిస్తూనే, ఒక శకం అంతరించిందన్న స్ఫురణ కలిగి స్తుంది. రచయితలే కానీ, రాజకీయనాయకులే కానీ తమ భావజాల పాక్షికతను ప్రకటించుకుని తీరాలంటూ తనను ప్రగతిశీల ఉదారవాదిగా, లేదా సామాజిక ప్రజాస్వామ్యవాదిగా చెప్పుకున్న జైపాల్ రెడ్డి అంతర్జాతీయవాదిగానూ తనను ఎలుగెత్తి చాటుకుంటారు. మతతత్వరాజకీయాలతో ఎప్పటికీ రాజీపడని ఒక నిబద్ధుడు ఆయనలో చివరివరకూ ఉన్నాడు. తన పుస్తకం తెలుగు అనువాదం అచ్చుప్రతిని చూడకుండానే ఆయన కన్ను మూయడం కుటుంబసభ్యులకూ, అనువాదకునిగా నాకూ కూడా తీరని వెలితి, తీవ్ర బాధాకరం.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083


సల్మాన్ ఖాన్



ఆమిర్ ఖాన్



అక్షయ్ కుమార్


సంజయ్ దత్


వరుణ్ ధావన్


ఆలియా భట్

ప్రపంచంలో
ఏడే కథలు ఉంటాయట..
సప్త సముద్రాల్లానే.
ఆ సముద్రంలోని చేప
ఈ సముద్రంలోకి..
ఈ సముద్రంలోని చేప
ఆ సముద్రంలోకి
సాధారణంగా పోదు.. పోలేదు.
కానీ ముంబై మహా తీరానికి
అన్ని సముద్రాల చేపలూ
కొట్టుకొస్తున్నాయి.
బాలీవుడ్ మరి!
అదొక రీమేక్ కథాసాగరం.

# ఇక్కడ హిట్... అక్కడ ఫిట్

గత ఏడాదంతా బాలీవుడ్ సిల్వర్‌స్క్రీన్‌పై ఎక్కువగా బయోపిక్‌ల హవా నడిచింది. ఈ ఏడాది రీమేక్‌ల హవా. సల్మాన్ ఖాన్, ఆమిర్‌ఖాన్, సంజయ్‌దత్, అక్షయ్‌కుమార్ వంటి స్టార్ యాక్టర్స్ రీమేక్ సినిమాల వైపు దృష్టి పెట్టారు. ఇతర భాషల్లో బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్‌తో కింగ్‌లా నిలిచిన హిట్ సినిమాల రిమేక్స్‌తో బిజీ బిజీగా ఉన్నారు. ఈ 'రీమే కింగ్ చిత్రాల్లో నటించబోయే, నటిస్తున్న బాలీవుడ్ స్టార్స్ గురించి తెలుసుకుందాం.


పరిణీతి చోప్రా

## మరో కొరియన్

కొరియన్ హిట్ సినిమాలపై ఓ కన్నేసినట్లున్నారు కండల వీరుడు సల్మాన్‌ఖాన్. ఈ ఏడాది 'ఓడ్ టు మై ఫాదర్' అనే సౌత్ కొరియన్ మూవీ హిందీ రీమేక్ 'భారత్'లో నటించిన సల్మాన్... వెంటనే మరో సౌత్ కొరియన్ చిత్రం 'వెటరన్' రీమేక్‌లో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సల్మాన్ ఆశించిన విజయాన్ని 'భారత్' అందించకపోయినప్పటికీ 'వెటరన్' చిత్రం రీమేక్‌కు సల్లూ భాయ్ సై అనడం విశేషం. నటుడు, నిర్మాత, దర్శకుడు అతుల్ అగ్నిహోత్రి 'వెటరన్' రీమేక్ రైట్స్‌ను సొంతం చేసుకున్నారు. హిందీకి తగ్గట్టుగా కొన్ని మార్పులు చేసి, వచ్చే ఏడాది షూటింగ్ మొదలుపెట్టాలనుకుంటున్నారట.

## లాల్‌సింగ్

ఆమిర్ ఖాన్, అమితాబ్ బచ్చన్ తొలి సారి కలిసి నటించిన 300 కోట్ల భారీ బడ్జెట్ చిత్రం 'థగ్స్ ఆఫ్ హిందూస్తాన్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఫెయిలైంది. దీంతో ఆమిర్ ఆలోచనలు ఒక్కసారిగా ఆస్కార్ విన్నింగ్ హాలీవుడ్ ఫిల్మ్ 'ఫారెస్ట్ గంప్' వైపు తిరిగాయి. 'లాల్ సింగ్ చద్దా' టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ రీమేక్ కోసం ఆమిర్ దాదాపు 20 కిలోల బరువు తగ్గారు. అద్వైత్ చందన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు ఆమిర్ కూడా ఒక నిర్మాత కావడం విశేషం.


భూమి ఫడ్నేకర్

## డబుల్ ధమాకా

ఏడాదికి కనీసం నాలుగు సినిమాలనైనా ప్రేక్షకుల ముందకు తీసుకురావడం అక్షయ్ కుమార్ స్టైల్. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చే అక్షయ్ సినిమాల్లో ప్రస్తుతానికి రెండు సౌత్ రీమేక్స్ ఉన్నాయి. లారెన్స్ 'కాంచన', అజిత్ 'వీరమ్' చిత్రాల హిందీ రీమేక్స్ 'లక్ష్మీబాంబ్', 'బచ్చన్ పాండే'ల్లో అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్నారు. 'లక్ష్మీ బాంబ్' చిత్రానికి రాఘవ లారెన్స్, 'బచ్చన్‌పాండే'కు ఫర్హాద్ సామ్జీ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే నిర్మాతలు తనకు సరైన గౌరవం ఇవ్వలేదని లారెన్స్ ఈ సినిమా దర్శకత్వ బాధ్యతల నుంచి మొదట తప్పుకున్నారు. అక్షయ్ జోక్యంతో తిరిగి మళ్లీ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఇక అక్షయ్ నటించిన 'మిషన్ మంగళ్, హౌస్‌ఫుల్ 4, గుడ్ న్యూస్' రిలీజ్‌కు రెడీ అయ్యాయి.

## రాజకీయ ప్రస్థానం

రాజకీయ నాయకుడిగా 'ప్రస్థానం' మొదలుపెట్టారు బాలీవుడ్ ఖల్ నాయక్ సంజయ్‌దత్. ఇది వెండితెర పార్టీ. 2010లో దేవకట్టా దర్శకత్వంలో తెలుగులో వచ్చిన 'ప్రస్థానం' చిత్రం ఎంత పెద్ద హిట్టో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ సినిమాను దేవాకట్టాయే ప్రస్తుతం హిందీలో 'ప్రస్థానం' అనే టైటిల్‌తో రీమేక్ చేస్తున్నారు. తెలుగులో సాయికుమార్ చేసిన పాత్రను హిందీలో సంజయ్‌దత్ చేస్తున్నారు. ఈ చిత్రంలో మనీషా కొయిరాల, అలీ ఫజల్, జాకీష్రాఫ్, అమైరా దస్తూర్, చుంకీ పాండే కీలక పాత్రధారులు.


ఐశ్వర్య రాయ్

## కొత్త కూలీ

తొలిసారి నిర్మాతగా మారి కూలీ చేస్తున్నారు బాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ ధావన్. 1995లో వరుణ్ తండ్రి డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వచ్చిన హిందీ చిత్రం 'కూలీ నం 1' అప్పట్లో మంచి విజయం సాధించింది. గోవింద, కరిష్మా కపూర్ నటించారు. ఇప్పుడు ఈ సినిమా బాలీవుడ్‌లో అదే టైటిల్‌తో రీమేక్ అవుతోంది. వరుణ్ ధావన్, సారా అలీఖాన్ జంటగా నటిస్తున్నారు. నాటి 'కూలీ నం 1'కు దర్శకత్వం వహించిన డేవిడ్ ధావనే ఈ సినిమాకూ దర్శకుడు. వచ్చే ఏడాది కార్మికుల దినోత్సవానికి (మే 1) ఈ కూలీ నం 1 వెండితెరపైకి రానున్నారు.

## రంగు మారెనే!

త్వరలో రైలు ప్రయాణం చేయడానికి జుట్టు రంగు మార్చుకున్నారు హీరోయిన్ పరిణీతీ చోప్రా. హాలీవుడ్ మూవీ 'ద గాళ్ ఆన్ ది ట్రైన్' రీమేక్ కోసం అలా మేకోవర్ అయ్యారు పరిణీతి. మూడేళ్ల క్రితం విడుదలైన ఈ హాలీవుడ్ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది. ఈ సినిమా హిందీ రీమేక్ రిభూ దాస్‌గుప్తా దర్శకత్వంలో తెరకెక్కనుండగా పరిణీతీ చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు.

## క్యాన్సర్ బాధితుడు

బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ క్యాన్సర్‌తో బాధపడే వ్యక్తిగా కనిపించనున్న చిత్రం 'దిల్ బచారే'. ఐదేళ్ల క్రితం హాలీవుడ్‌లో వచ్చిన 'ద ఫాల్ట్ ఇన్ అవర్ స్టార్స్' చిత్రం హిందీలో 'దిల్ బచారే'గా రీమేక్ అవుతోంది. సుశాంత్ సింగ్, సంజనా సాంఘీ హీరో హీరోయిన్లు. ముఖేష్ చబ్రా దర్శకుడు.

## భార్య, భర్త మధ్యలో ఆమె!


'సోనూ కి టిట్టు కి స్వీటీ' సినిమా సక్సెస్‌తో బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్‌కు మంచి గుర్తింపు దక్కింది. ఈ సినిమా వందకోట్ల క్లబ్‌లో చేరడంతో కార్తీక్ క్రేజ్ పెరిగింది. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్ నటిస్తున్న చిత్రాల్లో 'పతీ పత్నీ ఔర్ ఓ' సినిమా ఒకటి. ఈ సినిమా టైటిల్ ఎక్కడో విన్నట్లు ఉంది కదూ. అవును.. 1978లో బీఆర్ చోప్రా దర్శకత్వంలో వచ్చిన 'పతీ పత్నీ ఔర్ ఓ' సినిమాను అదే టైటిల్‌తో రీమేక్ చేస్తున్నారు. కార్తీక్, భూమి ఫడ్నేకర్, అనన్య పాండే హీరో హీరోయిన్లు. ముదస్సార్ అజీజ్ దర్శకత్వం వహిస్తున్నారు.


ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది బాలీవుడ్‌లో దాదాపు 25 రీమేక్ సినిమాలు నిర్మాణంలో ఉండటం విశేషం. కథల కొరతా? అంటే.. అదొక కారణం అయ్యుండొచ్చు. హిట్ ఫార్ములాతో సేఫ్ గేమ్ ఆడొచ్చనే కారణం కూడా ఇన్ని రీమేక్స్‌కి కారణం అయ్యుండొచ్చు.


– ముసిమి శివాంజనేయులు

## ఇంకా...

మలయాళ హిట్ 'ఎజ్రా' సేమ్ టైటిల్‌తో హిందీలో రీమేక్ అవుతోంది. నటుడు ఇమ్రాన్ హష్మి నటిస్తున్నారు. 1971లో వచ్చిన 'హాథీ మేరే సాథీ' సినిమా సోల్‌ను ప్రేరణగా తీసుకుని అదే టైటిల్‌తో హిందీలో సినిమా చేస్తున్నారు రానా. ఈ సినిమాకు తెలుగులో అరణ్య, తమిళంలో 'కాడన్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. 'ఆర్ఎక్స్ 100' హిందీ రీమేక్‌లో అహన్ శెట్టి హీరోగా నటించనున్నారు. మరోవైపు 1994లో వచ్చిన హిందీ హిట్ 'అందాజ్ అప్నా అప్నా' లేటెస్ట్ రీమేక్‌లో రణ్‌వీర్ సింగ్, వరుణ్‌ధావన్ కలిసి నటించబోతున్నారని టాక్. 'ఓ కౌన్ తీ?' (1964) 'రాత్ ఔర్ దిన్' (1967) తాజా రీమేక్స్‌లో ఐశ్వర్యా రాయ్ నటించబోతున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

ఇమ్రాన్ హష్మీ


రానా


అహన్ శెట్టి


## హీరోలు కావలెను!

కొన్ని సౌత్ సినిమాలు హిందీలో రీమేక్ కానున్నట్లు అధికారిక ప్రకటన వచ్చినప్పటికీ ఆ సినిమాల్లో ఎవరు హీరోలుగా నటించబోతున్నారు అనే విషయంపై సరైన స్పష్టత రావడం లేదు. ఇప్పుడు ఈ రీమేక్స్‌లో నటించడానికి బాలీవుడ్‌లో హీరోలు కావాలి. తెలుగు చిత్రాలు 'జెర్సీ', 'ఓ బేబి', 'ఎఫ్ 2', 'డియర్ కామ్రేడ్', 'ఎవడు'తో పాటు తమిళ చిత్రాలు 'వేదాలం', 'కత్తి', 'విక్రమ్ వేదా', 'పితామగన్', 'జిగర్తండా' హిందీలో రీమేక్ కానున్నాయి. కానీ ఈ చిత్రాల్లో ఎవరు హీరో హీరోయిన్లుగా నటించబోతున్నారనే అంశంపై బాలీవుడ్‌లో ఆసక్తికరమైన చర్చలు సాగుతున్నాయి. 'జెర్సీ' హిందీ రీమేక్‌లో షాహిద్‌కపూర్, 'ఎఫ్ 2'లో ఒక హీరోగా అర్జున్ కపూర్, 'ఓ బేబీ' హీరోయిన్‌గా ఆలియా భట్ నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇంకా 'జిగర్తండా' హిందీ రీమేక్‌లో రాజ్‌కుమార్ రావు, సైఫ్ అలీఖాన్ నటించనున్నారని తాజా బీ టౌన్ టాక్. మరి.. ప్రచారంలో ఉన్నట్లుగా ఆయా రీమేక్ చిత్రాల్లో పైన పేర్కొన్న నటీనటులు నటిస్తారా? లేక కొత్తవారు ఎవరైనా వస్తారా? అనే ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే వెయిట్ చేయాల్సిందే.

## కోట్ల క్లబ్‌లో హిట్ ఫార్ములా

బడా బడా స్టార్స్ రీమేక్ సినిమాలవైపు ఆసక్తి చూపడానికి బాక్సాఫీస్ కలెక్షన్స్ కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చు. ఎలాగంటే.. అమితాబ్ బచ్చన్, తాప్సీ కలిసి నటించిన 'బద్లా' మూవీ ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది. స్పానిష్ థ్రిల్లర్ 'ది ఇన్‌విజిబుల్ గెస్ట్' చిత్రానికి ఇది హిందీ రీమేక్. రణ్‌వీర్ సింగ్ నటించిన 'సింబా' (తెలుగు హిట్ 'టెంపర్' రీమేక్) బీటౌన్ బాక్సాఫీస్ వద్ద రెండువందల కోట్ల రూపాయలను కలెక్ట్ చేసింది. తెలుగు 'అర్జున్‌రెడ్డి' హిందీ రీమేక్ 'కబీర్‌సింగ్'లో షాహిద్‌కపూర్ నటించిన విషయం తెలిసిందే.




ఈ సినిమా 300కోట్ల రూపాయల వసూళ్లవైపు పరుగులు తీస్తోంది. ఇలా స్ట్రయిట్ చిత్రాలకు దీటుగా రీమేక్ చిత్రాల వసూళ్లు ఉండటంతో ఆల్రెడీ హిట్ అయిన సినిమా మీద నమ్మకం ఉంచి, రీమేక్‌కి సై అంటున్నారని ఊహించవచ్చు.

స్త్రీ శక్తి

# వెరవని ధీరత్వం

**ఇరవయ్యవ శతాబ్దపు తొలి రోజులు. భారతీయ మహిళలకు జెండర్ ఈక్వాలిటీ అనే పదం కూడా తెలియదు. అయినప్పటికీ సమానత్వ సాధన కోసం పోరాడాల్సిన సమయంలో అంతకంటే గొప్ప పోరాటానికి తమ జీవితాలను అంకితం చేశారు. మహిళల గొంతు ఇంటి నాలుగ్గోడలకు కూడా వినిపించని రోజుల్లో జాతీయోద్యమం కోసం గళమెత్తారు. మగవాళ్లతో పాటు ఉద్యమించారు. వారిలో పంజాబ్‌కు చెందిన బీబీ గులాబ్ కౌర్ ఒకరు.**

జాతీయోద్యమంలో పోరాడిన ధీరవనితల్లో అరుణా అసఫ్ అలీ, లక్ష్మీ సెహగల్, సుచేతా కృపలాని, తారా రాణి, కనకలత వంటి కొన్ని పేర్లు మాత్రమే మనకు గుర్తుకు వస్తుంటాయి. జాతీయోద్యమ ముఖచిత్రంలో తొలి పేజీల్లో చోటు చేసుకున్న ఈ మహిళామణులతో పాటు మరెందరో స్త్రీలు.. రాష్ట్రాలు, జిల్లాలు, గ్రామాల స్థాయిలో ఎవరి శక్తి మేరకు వాళ్లు పోరాడారు. ఆ పోరాట యోధులలో పంజాబ్ రాష్ట్రం తమ ఆడపిల్లలకు నేటికీ రోల్‌మోడల్‌గా చూపించుకుంటున్న ఒక యోధురాలు గులాబ్ కౌర్.

### గమ్యాన్ని మార్చిన ప్రయాణం


గులాబ్ కౌర్‌ది పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లా, బక్షివాలా గ్రామం. 1890లో పుట్టిన గులాబ్... జాతీయోద్యమంలో అడుగు పెట్టే వరకు అందరిలా మామూలమ్మాయే. మాన్‌సింగ్ అనే విద్యావంతుడిని పెళ్లి చేసుకుంది. మితిమీరిన సంపన్నులు కాకపోయినా సౌకర్యంగా జీవించగలిగిన సంపన్నత కలిగిన కుటుంబమే వాళ్లది. అయినప్పటికీ అతడికి అమెరికా వెళ్లి బాగా డబ్బు సంపాదించాలనే కోరిక ఉండేది. భార్యతోపాటు బయలుదేరాడు. ఫిలిప్పీన్స్ మీదుగా అమెరికా చేరడానికి వారి నౌకాయానం మొదలైంది. ఆ ప్రయాణమే గులాబ్‌ను జాతీయోద్యమం వైపు నడిపించింది.

### 'విడిపోయిన' భార్యాభర్తలు

అమెరికా ప్రయాణంలో వారితోపాటు గదర్ పార్టీ కార్యకర్తలు కూడా ఉన్నారు. వాళ్ల మాటల ద్వారా గులాబ్‌కు వలస పాలనలో మగ్గుతున్న భారతదేశ విముక్తి కోసం పోరాడాల్సిన అవసరం తెలిసి వచ్చింది. భార్యాభర్తల మధ్య 'వెనక్కి వెళ్లి జన్మభూమి కోసం పోరాటం చేయటమా, ముందుకు వెళ్లి కోరుకున్నంత ధనాన్ని సంపాదించుకుని విలాసవంతంగా జీవించడమా' అనే చర్చ మొదలైంది. మాన్‌సింగ్ ప్రయాణాన్ని కొనసాగించడానికే మొగ్గు చూపించాడు. గులాబ్ భర్తను వ్యతిరేకించ లేదు, అలాగని అతడిని అనుసరించనూ లేదు. అతడిని అమెరికాకు పంపించి, తాను ఫిలిప్పీన్స్ నుంచి వెనక్కి వచ్చి జాతీయోద్యమంలో పాల్గొన్నది!

### అక్షరమే ఆయుధం

గులాబ్ కౌర్ పంజాబ్ రాష్ట్రంలోని కపుర్తల, హోషియార్ పూర్, జలంధర్‌లలో క్షేత్రస్థాయిలో పనిచేశారు. యువకులను సాయుధ పోరాటం వైపు మరలించారు. వలస పాలనలో భారతీయులకు ఎదురవుతున్న వివక్షను కథనాలుగా రాశారు. అప్పటికే బ్రిటిష్ సేనల నిఘా కళ్లు ఆమె మీదకు ఉన్నాయి. బ్రిటిష్ పాలకుల పట్ల భారతీయుల్లో చెలరేగుతున్న వ్యతిరేకతను ఆమె కళ్లకు కట్టినట్లు రాస్తూ, రహస్యంగా ప్రింట్ చేసి కార్యకర్తల ద్వారా గ్రామాలకు చేరవేశారు. ఆమె రచనలు చదివిన యువకులు ఉత్తేజంతో ఉరికేవాళ్లు. ఆమె అక్షరాలు బ్రిటిష్ పాలకులకు కంట్లో నలుసుగా మారి ప్రశాంతతను దూరం చేశాయి. జర్నలిస్టుగా ఆమె రాసే రాతలు పాఠకులను ఉద్రేక పరిచేటట్లుగానూ, వలస పాలకుల నిబంధనలకు విరుద్ధంగానే ఉన్నాయనే నెపంతో ఆమె మీద రాజద్రోహం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గులాబ్ కౌర్‌ను లాహోర్‌లోని షామి ఖిలా జైల్లో నిర్బంధించి చిత్రహింసలకు గురి చేశారు. ఆ చిత్రహింసలను భరించలేక, రెండేళ్ల శిక్ష కాలం పూర్తి కాకముందే ఆమె 1931లో ప్రాణాలు వదిలారు గులాబ్ కౌర్. పంజాబ్ వాసులు ఇప్పటికీ గులాబ్ కౌర్‌ను గర్వంగా తలుచుకుంటారు.


బీబీ గులాబ్ కౌర్

– మంజీర

చెట్టు నీడ

## ఎవరు చెబితేనేమిటి?

కంచి పరమాచార్య జీవితంలో ఇదొక సంఘటన. ఆయన ఎక్కడికైనా వెళ్లాలంటే పల్లకిని ఉపయోగించేవారు. అలాగే ఓమారు ఆయన పల్లకిలో వెళ్తూ వెళ్తూ ఓ చోట పల్లకిని ఆపించి అందులో నుంచే ప్రసంగిస్తుండగా ఒకతను ఆయనను విమర్శించాడు. ''ఇతరులు నలుగురైదుగురు మోస్తుండగా దర్జాగా పల్లకిలో కూర్చుని ప్రయాణం చేస్తుంటారు. ఈయన సాధువేంటీ? ఓ మనిషిని మరొక మనిషి మోయడం తగునా! ఇది ఆయనకు తెలీదా? సాధువు అనే అతను అన్ని సుఖాలనూ త్యజించాలి కదా. ఎంత హీనమైన తంతిది. మరొకరి భుజాలపై ప్రయాణం చేసే ఈయనను సాధువని ఎలా అనుకోవాలి? ఈ పెద్దమనిషి మనకు హితవచనాలూ సామాన్య ధర్మాలు చెప్పడమా! అసలీయనకు ఏమర్హత ఉంది.. ఛీఛీ..'' అని అన్నాడు.

ఈ మాటలన్నీ పరమాచార్య చెవిన పడ్డాయి. మరుక్షణమే పరమాచార్య పల్లకిని నేల మీదకు దింపించి పల్లకిలోంచి ఇవతలకు వచ్చారు. ''ఆయన చెప్పినదాంట్లో తప్పేముంది. సబబే కదా..'' అని తన వెంట ఉన్నవారితో అన్నారు. అయితే పల్లకీ మోసిన వాళ్లు.. ''ఎవరో ఏదో అన్నారని మీరిలా దిగడం మాకు బాధగా ఉంది. వాళ్ల మాటలను పెద్దగా పట్టించుకోకండి. మిమ్మల్ని మా భుజాలమీద తీసుకుపోవడం మా భాగ్యం'' అన్నారు. అయినా పరమాచార్య తన మాట కొనసాగిస్తూ.. ''ఆ మనిషి చెప్పింది నిజమే. సుఖాన్ని త్యజించని వారు సాధువెలా అవుతారు. నాకీ పల్లకి వద్దు. ఇక మీదట నేనెక్కడికి వెళ్లి నడచిపోతాను'' అని ఓ గట్టి నిర్ణయానికి వచ్చారు. ఆ విధంగానే ఎక్కడి వెళ్లినా ఆయన నడిచే వెళ్తుండేవారు. పరమాచార్య చివరి వరకూ ఈ నిర్ణయం నుంచి తప్పుకోలేదు.

– జగద్రేణు

బ్యూటిప్ హెయిర్ కేర్

- రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్ అంతే మొత్తం కొబ్బరి నూనెలో గుడ్డు సొన వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టించాలి. మృదువుగా మసాజ్ చేయాలి. ఈ మిశ్రమం వెంట్రుకలకు మంచి కండిషనర్‌లా ఉపయోగపడుతుంది. కుదుళ్లు బలంగా అవుతాయి. దీంతో వెంట్రుక పెరుగుదల బాగుంటుంది.
- వెంట్రుకలు చిట్లడం, చుండ్రు సమస్యలు ఉంటే జుట్టు రాలడం కూడా ఎక్కువే ఉంటుంది. ఈ సమస్య నివారణకు కొబ్బరినూనెలో కొన్ని కరివేపాకులు వేసి వేడిచేయాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు ఆ మిశ్రమాన్ని తలకు పట్టించి సున్నితంగా మసాజ్ చేయాలి. రాత్రిపూట ఇలా చేసి మరుసటి రోజు ఉదయం తలస్నానం చేయాలి.
- ఆలివ్ ఆయిల్, దాల్చిన చెక్క పొడి, తేనె కలిపి మాడుకు పట్టించి 15 నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ప్రతి మూడు రోజులకు ఒకసారి ఇలా చేస్తూ ఉంటే జుట్టు రాలడం సమస్య తగ్గుతుంది.



సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ మంగళవారం
30-7-2019

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్ చేయ్...దాచేయ్...

**పల్లవి :**
నేనే నాని నే... నే నీ నాని నే...
పోనే పోనీనే నీడై ఉన్నానే
అరె అరె అరె అరె... ఓ...
(2)

కళ్లకు ఒత్తులు వెలిగించి
కలలకు రెక్కలు తొడిగించి
గాలిని తేలుతు ఉంటున్నా నే
అరె అరె అరె అరె... ఓ...
(2)

కనబడినా ఓకె...
కనుమరుగవుతున్నా ఓకె...
(2)
అరె అరె అరె అరె... ఓ...
(2)

**చరణం : 1**

మాటల్లో ముత్యాలే దాచేసినా
చిరునవ్వు కాస్తైనా ఉలికించవా
కోపం అయినా కోరుకున్నా అన్నీ నాకు నువ్వనీ
కనబడినా ఓకె...
కనుమరుగవుతున్నా ఓకె...
(2)
అరె అరె అరె అరె... ఓ...
(2)

**చరణం : 2**

నా భాషలో రెండే వర్ణాలనీ
నాకింక నీ పేరే జపమౌననీ
బిందు అంటే గుండె ఆగి దిక్కులన్నీ చూడనా
కనబడినా ఓకె...
కనుమరుగవుతున్నా ఓకె...
(2)
అరె అరె అరె అరె... ఓ...
(2)

**చిత్రం : ఈగ (2012)**
**రచన, సంగీతం : ఎం.ఎం.కీరవాణి**
**గానం : దీపు, జి.సాహితి**

# చికుబుకు రైలే...



● మహేశ్‌బాబు

రైలు ప్రయాణం చేస్తున్నారు మహేశ్‌బాబు. ఒంటరిగా కాదు రష్మికా మండన్నాతో. చికుబుకు రైలులో ఆడిపాడతారో, తియ్యని కబుర్లు చెప్పుకుంటారో లేక మహేశ్‌బాబు విలన్లను రఫ్ఫాడిస్తారో తెలియాలంటే వచ్చే సంక్రాంతి వరకూ ఆగాల్సిందే. మహేశ్‌బాబు, రష్మికా మండన్నా జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న 'సరిలేరు నీకెవ్వరు'లోనే ఈ ట్రైన్ సీన్ ఉంది. యూనిట్ సన్నిహిత వర్గాల సమాచారం ప్రకారం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో వేసిన ట్రైన్ సెట్‌లో ప్రస్తుతం కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మహేశ్, రష్మికలతో పాటు చిత్రంలోని కీలక తారాగణం ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారు. వచ్చే నెల 10 వరకూ హైదరాబాద్ షెడ్యూల్ జరుగుతుందని తెలిసింది. ఇందులో మహేశ్‌బాబు ఆర్మీ ఆఫీసర్ పాత్ర చేస్తున్నారు. విజయశాంతి కీలక పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. 'దిల్' రాజు, అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది.

**మహేశ్ హంబుల్:** గత ఏడాది థియేటర్ బిజినెస్‌లోకి అడుగు పెట్టిన మహేశ్‌బాబు లేటెస్ట్‌గా దుస్తుల బ్రాండ్‌లోకి అడుగు పెట్టారు. 'హంబుల్' పేరుతో మొదలుపెట్టిన క్లాతింగ్ లైన్‌ను ఆగస్ట్ 7న ప్రారంభించబోతున్నారు.

# తిరునాళ్ల సందడి!



● నాగచైతన్య, వెంకటేశ్

వెంకటేశ్, నాగచైతన్య ఏం చేస్తున్నారో తెలుసా? తిరునాళ్లల్లో ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు. హైదరాబాద్ అంతా బోనాల సందట్లో ఉంది. మామాఅల్లుడు కూడా బోనాల పండగలో మునిగి తేలుతున్నారు. ఏ ఏరియాలో అంటే హైదరాబాద్ శివార్లలో వేసిన తిరునాళ్ల సెట్టింగ్‌లో. 'వెంకీ మామా' చిత్రం కోసం వేసిన ఈ సెట్‌లో మామాఅల్లుడు వెంకీ, చైతూ జోరుగా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. కె.యస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో సురేశ్ ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. చిత్రంలోని కీలక తారాగణంతో పాటు ఐదువందల మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్న సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని సమాచారం. తిరునాళ్ల సందట్లో మామాఅల్లుడు ఫైట్ కూడా చేయాల్సి వస్తుందట. ఫైట్‌మాస్టర్‌లు రామ్–లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ ఫైట్ చిత్రీకరణ జరుగుతోందని తెలిసింది. అక్టోబర్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. వెంకీ సరసన పాయల్ రాజ్‌పుత్, చైతూ సరసన రాశీఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు.



● జాన్వీ కపూర్

# పిక్చర్ పర్ఫెక్ట్

ఫ్రెండ్సంతా బీచ్ సైడ్ పార్టీకు వెళ్లారు. అక్కడ మూడ్‌కి తగ్గట్టు షాంపైన్ పొంగించారు. బీట్స్‌కి తగ్గట్టు పాటను అందుకోవాలి. వెంటనే కాజల్ 'పిల్ల పిక్చర్ పర్ఫెక్ట్..' అంటూ సాంగ్ అందుకున్నారు. దానికి తగ్గట్టు హుషారుగా నాలుగు స్టెప్పులు కూడా వేశారు. కాజల్ హుషారుని కామ్‌గా దూరం నుంచి చూస్తూ పార్టీని ఎంజాయ్ చేస్తున్నారు శర్వానంద్. ఇదంతా 'రణరంగం' సినిమాలో మూడో సాంగ్ 'పిల్ల పిక్చర్ పర్ఫెక్ట్..' సందర్భం. కృష్ణ చైతన్య రచించిన ఈ పాటకు సన్నీ ఎం.ఆర్ స్వరాలు అందించారు. సుధీర్ వర్మ దర్శకత్వంలో శర్వానంద్, కాజల్, కల్యాణీ ప్రియదర్శన్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'రణరంగం'. ఆగస్ట్ 15న ఈ చిత్రం రిలీజ్ కానుంది. అన్నట్లు.. ఈ పాటలోని కాజల్ స్టిల్ చూస్తే 'పిక్చర్ పర్ఫెక్ట్' అనుకుండా ఉండలేం కదూ.



● కాజల్ అగర్వాల్

# బంగారు గనుల్లోకి...

కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో అధికారం కోసం పోరాటం జరుగుతోంది. రాకీ భాయ్ (యశ్) ఎదుర్కోవాల్సిన వాళ్లు చాలామందే ఉన్నారు. ఇప్పుడు బాలీవుడ్ ఖల్‌నాయక్ సంజయ్ దత్ కూడా ఈ బంగారు గనుల్లోకి అడుగుపెట్టనున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యశ్ హీరోగా హొంబలే ఫిల్మ్స్ నిర్మాణంలో తెరకెక్కిన చిత్రం 'కేజీఎఫ్'. చాప్టర్ 1 గత ఏడాది డిసెంబర్‌లో విడుదలై మంచి విజయం సాధించింది. 250 కోట్ల వసూళ్లను కూడా సాధించింది. 'కేజీఎఫ్: చాప్టర్ 2'లో అధీరా పాత్రలో సంజయ్ దత్ నటించనున్నారు. ఆయన లుక్‌ను సోమవారం రిలీజ్ చేశారు. ''బెంగళూరులో కోలార్ మైన్స్‌లో మూడో షెడ్యూల్ జరుగుతోంది. ఆగస్ట్‌లో హైదరాబాద్‌లో ఓ షెడ్యూల్ ఉంది. ఆ తర్వాత సంజయ్ దత్ షూటింగ్‌లో జాయిన్ అవుతారు. వచ్చే ఏడాది వేసవిలో విడుదల చేస్తాం'' అని చిత్రబృందం తెలిపింది.



● సంజయ్ దత్

# తగ్గుతూ.. పెరుగుతూ...

యాక్టర్లు పాత్రకు తగ్గట్టు బరువు తగ్గుతూ, పెరుగుతూ ఉండాల్సి ఉంటుంది. కానీ ఒకేసారి బరువు తగ్గుతూ, పెరుగుతూ జిమ్‌లో శ్రమిస్తున్నారు జాన్వీ. ప్రస్తుతం జాన్వీ 'కార్గిల్ గాళ్, రూహీఅఫ్జా' సినిమాలను ఏకకాలంలో చేస్తున్నారు. 'కార్గిల్ గాళ్' ఏమో గుంజన్ సక్సేనా బయోపిక్. ఈ పాత్రలో కొంచెం బొద్దుగా కనిపించనున్నారు జాన్వీ. 'రూహీ అఫ్జా' అనేది హారర్ కామెడీ చిత్రం. ఈ సినిమాలో నాజూకుగా కనిపించాలి. 'కార్గిల్ గాళ్' సినిమా షూటింగ్ మొదట ప్రారంభించారు. ఆ పాత్ర కోసం జాన్వీ సుమారు 6 కిలోల బరువు పెరిగారు. ఆ తర్వాత 'రూహీ అఫ్జా' షెడ్యూల్ కూడా స్టార్ట్ అయింది. ఇందులోని పాత్ర కోసం 10 కిలోల బరువు తగ్గారామె. ఇప్పుడు 'కార్గిల్ గాళ్' కొత్త షెడ్యూల్ స్టార్ట్ కానుంది. దాంతో మళ్లీ బరువు పెరగనున్నారని తెలిసింది. ''కొత్త షెడ్యూల్‌కి ఆరు వారాల సమయం ఉంది. ఈ గ్యాప్‌లో వారానికి ఆరుసార్లు జిమ్ చేస్తూ, రోజుకి 3 గంటలు జిమ్‌లోనే గడుపుతున్నారు. రోజుకి ఇంట్లో తయారు చేసిన లడ్డూలు మూడు నాలుగు లాగించేస్తున్నారు'' అన్నారు జాన్వీ ట్రైనర్ నమ్రత.

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | | | | 1 | | | | |
| 7 | 2 | 6 | | 8 | 3 | | 4 | 1 |
| | 3 | | | | | 9 | | 2 |
| 6 | | | | | | 1 | 8 | |
| 8 | 1 | 3 | | | | 4 | 9 | 5 |
| | 5 | 4 | | | | | | 7 |
| 5 | | 9 | | | | | 1 | |
| 2 | 8 | | 7 | 4 | | 3 | 6 | 9 |
| | | | | 6 | | | | 8 |

**నిబంధనలు:** ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 6 | 9 | 1 | 7 | 8 | 4 | 5 | 3 |
| 8 | 5 | 3 | 4 | 2 | 6 | 7 | 1 | 9 |
| 7 | 4 | 1 | 5 | 3 | 9 | 8 | 2 | 6 |
| 6 | 1 | 4 | 8 | 5 | 2 | 9 | 3 | 7 |
| 5 | 7 | 8 | 9 | 1 | 3 | 6 | 4 | 2 |
| 3 | 9 | 2 | 6 | 4 | 7 | 1 | 8 | 5 |
| 4 | 3 | 6 | 7 | 8 | 5 | 2 | 9 | 1 |
| 1 | 2 | 7 | 3 | 9 | 4 | 5 | 6 | 8 |
| 9 | 8 | 5 | 2 | 6 | 1 | 3 | 7 | 4 |

# కరెక్ట్ టైమ్‌లో చెప్పిన కథ ఇది



● చెర్రీ, నవీన్, యశ్, రవిశంకర్

విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా జంటగా నూతన దర్శకుడు భరత్ కమ్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డియర్ కామ్రేడ్'. నవీన్ ఎర్నేని, మోహన్ చెరుకూరి, రవి శంకర్, యశ్ రంగినేని నిర్మించారు. గత శుక్రవారం విడుదలైన ఈ చిత్రం మంచి కలెక్షన్స్‌తో ప్రదర్శింపబడుతోందని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నవీన్ ఎర్నేని మాట్లాడుతూ – ''బ్రహ్మాండమైన రెస్పాన్స్ వస్తోంది. మొదటి మూడు రోజుల కలెక్షన్స్ 21 కోట్లు వచ్చింది. పెట్టిన దానికి 80శాతం రికవరీ అయింది. గురువారంతో 100 శాతం రికవరీ అవుతుంది. సినిమాను కొన్న అందరూ లాభాల్లో ఉంటారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాల కారణంగా ఓ 5 శాతం ఎఫెక్ట్ సినిమా మీద ఉంటుంది. ఓపెనింగ్స్ బావున్నాయి. కొంచెం స్లోగా ఉంది అనే ఫీడ్‌బ్యాక్ వచ్చింది. వెంటనే పదమూడు నిమిషాలు తగ్గించాం. క్యాంటీన్ సాంగ్ చాలా పాపులర్ అయింది. దాని రన్‌టైమ్ ఎక్కువైందని తీశాం. ఇప్పుడు కలిపాం. బుక్ మై షోలో కూడా సెకండ్ డేలా బుకింగ్స్ జరుగుతున్నాయి. తమిళనాడు, కేరళలో కూడా మంచి రన్ ఉంది. సక్సెస్ పట్ల చాలా సంతృప్తిగా ఉన్నాం'' అన్నారు.

''డియర్ కామ్రేడ్' ఓ సోషల్ సబ్జెక్ట్. ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా ఇది. అమ్మాయిలకు పని చేసే చోట వేధింపులు ఉండటంతో పాటు ఇంట్లో ఒత్తిడి వల్ల నచ్చిన పనిని కూడా సరిగ్గా చేయలేని పరిస్థితి ఉంది. ఆ విషయాన్ని మా సినిమాలో చూపించాం. ప్రస్తుతం 'మీటూ' మూమెంట్ జరుగుతోంది. కరెక్ట్ టైమ్‌లో చెప్పిన కథ ఇది. కొందరు సినిమా ల్యాగ్ ఉంది అంటున్నారు. ట్రిమ్ చేసిన వెర్షన్ చూస్తే చాలా నచ్చుతుంది. ఫ్యామిలీలు, స్త్రీలు, యూత్ అందరికీ నచ్చే సినిమా ఇది. 'అర్జున్ రెడ్డి'కి ముందు ఓకే చేసిన కథ అయినప్పటికీ కథలో మార్పులు చేయలేదు. ముందు అనుకున్నదాని కంటే పెద్ద స్కేల్‌లో తీయాల్సి వచ్చింది. విజయ్ తన ఇమేజ్‌ని పట్టించుకోడు. మంచి కథలను చెప్పాలనుకుంటాడు'' అన్నారు యశ్ రంగినేని.

''విజయ్ దేవరకొండతో చేస్తున్న 'హీరో' సినిమా ఆగిపోలేదు. బైక్ రేసింగ్‌తో కూడుకున్న సినిమా కాబట్టి రేస్ ట్రాక్ మీద నచ్చిన సమయంలో షూట్ చేయడానికి వీలుపడదు. వాళ్లు అనుమతించినప్పుడే షూట్ చేయాలి'' అన్నారు రవి శంకర్.

# కాలేజీకి చేసినదే సినిమాకి చేశాను

''40 ఏళ్లుగా కేఎల్ యూనివర్శిటీలు నడిపిస్తున్నాం. హైదరాబాద్‌లో కొత్త బ్రాంచ్ కూడా ప్రారంభించాం. మా అబ్బాయి హవీష్ చేసిన 'జీనియస్'కు నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నాను. కానీ నిర్మాణంలో ఇన్వాల్వ్ కాలేదు. పూర్తిస్థాయి ప్రొడక్షన్‌లోకి వద్దామనుకొని 'ఏ స్టూడియోస్' బ్యానర్ స్థాపించాం'' అన్నారు కోనేరు సత్యనారాయణ. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా రమేశ్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రాక్షసుడు'. కేఎల్‌యు సంస్థల చైర్మన్ కోనేరు సత్యనారాయణ నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కోనేరు సత్యనారాయణ చెప్పిన విశేషాలు.



● సత్యనారాయణ

● ఎంటర్‌టైన్‌మెంట్ యూనివర్శిటీ స్థాపించాలనుకుంటున్నాను. ఆ యూనివర్శిటీలో సినిమా, టీవీ, యానిమేషన్, గ్రాఫిక్స్ అన్నీ నేర్చుకునేలా ఏర్పాటు చేస్తాం.

● తమిళంలో 'రాక్షసన్' రిలీజ్ అయిన వారంలోనే చూశాను. గ్రిప్పింగ్‌గా ఉంది. మా అబ్బాయితో రీమేక్ చేయాలనుకున్నాను. అప్పటికే మావాడు థ్రిల్లర్ జానర్‌లో '7' సినిమా చేస్తున్నాడు. దాంతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా బావుంటాడనుకున్నాం. సాయి శ్రీనివాస్ చాలా బాగా చేశాడు.

● 'ఒరిజినల్‌లో ఉన్నదానికి ఒక్క సీన్ కూడా మార్చకుండా తీయండి' అని దర్శకుడితో అన్నాను. ఉన్నది ఉన్నట్టు తీయడం కూడా కష్టమే! రమేష్ వర్మ చాలా కష్టపడ్డాడు. సినిమాను ఎలా తీయాలనుకున్నామో అలానే తీశాం.

● నా చిత్రాల్లో మెసేజ్ ఉండాలనుకుంటాను. 'జీనియస్'లో హీరోలను, క్రికెటర్స్‌ను అభిమానించండి.. ఆరాధించొద్దని చెప్పాం. 'రాక్షసుడు'లో ఆడపిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పాం.

● కాలేజీలో ఒక పని చేయాలంటే చాలా మంది ఉంటారు. ఒకరికి చెబితే పని అయిపోతుంది. షూటింగ్‌లోనూ అదే అప్లై చేశాను. సినిమా బిజినెస్ పూర్తయింది. థియేట్రికల్ రైట్స్ అభిషేక్ పిక్చర్స్ వాళ్లకి ఇచ్చేశాం. నెక్ట్స్ 2, 3 సినిమాలు అనుకుంటున్నాం. వాటిలో హవీష్‌తో ఓ సినిమా ఉంటుంది.



● ప్రియా మోహన్

## అఖిల్ సరసన?

ముందు జోడీ లేకుండానే అఖిల్ తన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఇప్పుడు తనతో పాటు 'గ్యాంగ్‌లీడర్' భామ కూడా జాయిన్ కానున్నారని తెలిసింది. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో అఖిల్ హీరోగా ఓ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇంకా ఫిక్స్ కాలేదు. నాని 'గ్యాంగ్‌లీడర్'లో హీరోయిన్‌గా నటించిన ప్రియా మోహన్‌ను అఖిల్ సినిమాలో హీరోయిన్‌గా తీసుకోవాలని ప్లాన్ చేస్తోందట చిత్ర బృందం. జీఏ2 పిక్చర్స్ బ్యానర్‌పై 'బన్నీ' వాసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# వాలి స్ఫూర్తితో...



● నాగప్రభాకర్, పద్మనాభరెడ్డి

ముగ్గురు అబ్బాయిలు ఒకే అమ్మాయిని ప్రేమిస్తారు. అయితే ఆ ముగ్గురిలో ఆ అమ్మాయి ఎవరిని ప్రేమించింది? అనే సస్పెన్స్ కథాంశంతో రూపొందిన చిత్రం 'శివరంజని'. రశ్మి, నందు, అఖిల్ కార్తీక్, ఇంద్ర ప్రధాన పాత్రల్లో నాగప్రభాకర్ దర్శకత్వంలో తెరకెక్కింది. యూ అండ్ ఐ ఎంటర్టైన్‌మెంట్ పతాకంపై ఎ. పద్మనాభరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఎ.పద్మనాభరెడ్డి మాట్లాడుతూ– ''రంగు' సినిమా తర్వాత మా బ్యానర్‌లో వస్తోన్న సినిమా ఇది. లవ్, సస్పెన్స్, హారర్‌తో పాటు థ్రిల్లర్ అంశాలున్నాయి. ప్రేక్షకులు థ్రిల్‌ను బాగా ఎంజాయ్ చేస్తారు. శివరంజని ఎవరు? అనేది తెలుసుకోవడమే సినిమా. ధన్‌రాజ్ కామెడీ, శేఖర్ చంద్ర మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తాయి'' అన్నారు. ''కె. రాఘవేంద్రరావు, చంద్రమహేష్, వినాయక్ గార్ల వద్ద అసిస్టెంట్‌గా పనిచేశాను. 'వాలి' సినిమా నుంచి స్ఫూర్తి పొంది రాసుకున్న కథ ఇది. ముందు క్లయిమాక్స్ రాసుకుని ఆ తర్వాత కథ రెడీ చేశా. అనుకున్నదాని కంటే సినిమా బాగా వచ్చింది'' అన్నారు నాగప్రభాకర్. నందినీరాయ్, అఖిల్ కార్తీక్, ధన్‌రాజ్, ఢిల్లీ రాజేశ్వరి నటించిన ఈ సినిమాకి కెమెరా: సురేందర్ రెడ్డి, సమర్పణ: నల్లా స్వామి, సహ నిర్మాత: కటకం వాసు.

# సంపూ రికార్డ్

'హృదయకాలేయం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు నవ్వులు పంచి, 'బర్నింగ్ స్టార్'గా పేరు తెచ్చుకున్న సంపూర్ణేష్ బాబు నటించిన తాజా చిత్రం 'కొబ్బరిమట్ట'. రూపక్ రొనాల్డ్ సన్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ సాయి రాజేష్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 10న విడుదలకానుంది. ఈ సందర్భంగా – ''ప్రపంచ సినిమా చరిత్రలోనే తొలిసారిగా 3.30 నిమిషాల సింగిల్ షాట్ డైలాగ్ ఉన్న సినిమా 'కొబ్బరిమట్ట'' అంటూ పెద్ద డైలాగ్ ట్రైలర్‌ను విడుదల చేశారు చిత్రబృందం. ''ఏరా పెదరాయుడు.. త్రికాలాత్రక.. ఓరీ ఓరోరీ ఆపరా..' అంటూ మొదలైన సంపూర్ణేష్ డైలాగ్.. 'పెదరాయుడు టైమ్ ఈజ్ ఓవర్.. ఆండ్రాయుడు టైమ్ స్టార్ట్స్ నౌ..' అనే డైలాగ్‌తో ముగుస్తుంది. 3.30 నిమిషాలపాటు సంపూ చెప్పిన ఈ డైలాగ్‌కి మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ– ''ఈ సినిమాలో పాపారాయుడు, పెదరాయుడు, ఆండ్రాయుడు.. లాంటి మూడు పాత్రలతో సంపూ మెప్పించబోతున్నారు. అత్యంత భారీ డైలాగ్‌లు చెప్పి లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుని నెలకొల్పాడు. ఇటీవల విడుదల చేసిన 'అఆ.. ఇఈ...' అనే పాటకి యూట్యూబ్‌లో 24 గంటల్లో రెండు లక్షల వ్యూస్ వచ్చాయంటే మా సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ తెలియజేస్తోంది. ఈ చిత్రం నైజాం, ఓవర్‌సీస్ హక్కులని 'నో బారియర్స్ ఎంటర్‌టైన్‌మెంట్' వారు సొంతం చేసుకున్నారు'' అన్నారు.



● సంపూర్ణేష్‌బాబు




సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 30-7-2019



1960ల నాటి హరిత విప్లవ నమూనా(రసాయనిక వ్యవసాయ పద్ధతి)పై ఇక ఎంతకాలమో ఆధారపడలేం. దిగుబడులు పెరిగినప్పటికీ.. ప్రకృతి వనరులు, పర్యావరణ విధ్వంసంతో అధిక మూల్యం చెల్లించవలసి వచ్చింది!
- గ్రాజియానో డిసిల్వ, డైరెక్టర్ జనరల్, ఎఫ్.ఎ.ఓ.

పుష్యమి కార్తె - జూలై 21 నుంచి

గేదె పాలతో పాల పొడిని తయారు చేయడం కురియన్ సాధించిన మొదటి విజయం. ఆవు పాల ఉత్పత్తుల తయారీలో పట్టున్న న్యూజిలాండ్ ఇంజినీర్లు.. గేదె పాలతో పొడిని తయారు చేయడం అసాధ్యమన్నారు. కానీ, మన రైతుల దగ్గర గేదెలే ఎక్కువగా ఉన్నాయి. స్వతహాగా మెకానికల్ ఇంజినీర్ అయిన కురియన్ దేశీయంగానే సాంకేతికతను సహకార రంగంలో అభివృద్ధి చేయడం ద్వారా గేదె పాలతో పొడిని, ఇతర ఉత్పత్తులను తొట్టతొలిగా తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. 'అముల్' బ్రాండ్‌ను సృష్టించి గుజరాత్‌లో సహకార పాడి పరిశ్రమకు గట్టి పునాదులు వేశారు. ఆ స్ఫూర్తితోనే దేశవ్యాప్తంగా రైతుల సహకార డెయిరీలు ఏర్పాటయ్యాయి.




• డెయిరీ డైరీ-1

# క్షీర చరిత్ర

మానవ జాతికి అమృత తుల్యమైన తల్లి పాలే మొదటి ఆహారం. మనుషులే కాదు పాలిచ్చే జంతువులన్నిటికీ ఇంతే. అయితే, కాలక్రమంలో పెంపుడు జంతువుల పాలను ఆహారంగా ఉపయోగించడం మనిషి అలవాటు చేసుకున్నాడు. వ్యవసాయం ప్రారంభ దినాల నుంచే సుమారు 11 వేల సంవత్సరాల క్రితం నుంచి, గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెల పాలను మనుషులు ఆహారంగా తీసుకోవడం మొదలైంది.

### డెయిరీ పరిశ్రమ మొదలైంది ఇలా..

ఐరోపా పారిశ్రామిక విప్లవం(1830) తర్వాత గ్రామాల నుంచి పాలను పట్టణ ప్రాంతాలకు తరలించడానికి రవాణా సదుపాయం ఏర్పడింది. ఆ క్రమంలోనే డెయిరీ పరిశ్రమకు అవసరమైన సాంకేతికతలు అభివృద్ధి చెందుతూ వచ్చాయి. 1860లో నెదర్లాండ్స్‌లో మెకానికల్ కూలర్‌ను కనుగొనడంతో సాంద్ర డెయిరీ పరిశ్రమకు పునాదులు పడ్డాయి. 1864లో ఫ్రెంచ్ మైక్రోబయాలజిస్ట్ లూయిస్ పాశ్చర్ పాల శీతలీకరణ ప్రక్రియను కనుగొన్నాడు. 1880లలోనే అటస్టె గాలిన్ హోమోజెనైజేషన్‌ను కనుగొన్నాడు. దీంతో స్కిమ్ మిల్క్, లో ఫాట్ మిల్క్ వంటి వివిధ రకాల పాల ఉత్పత్తుల తయారీ ప్రారంభమైంది. ఈ ఆవిష్కరణల మూలంగా పాల నాణ్యత దెబ్బతినకుండా నిల్వచేయడం, దూర ప్రాంతాలకు తరలించడం సులభమైంది. ఈ విధంగా అంతర్జాతీయంగా పాల ఉత్పత్తుల తయారీ ఒక పరిశ్రమగా రూపుదాల్చింది.



ఈజిప్టులో క్రీ.పూ. నాటి ఆవు పాలు పితికే మానవుడి కుడ్య చిత్రం

వేదకాలంలోనూ ఆవుపాలకు ప్రాధాన్యం ఉంది. బాస్ ప్రిమిజెనియస్ అనే ఆదిమజాతి పశువులు భారత ఉపఖండంలో 13వ శతాబ్దం వరకూ ఉండేవి. ఆ పురాతన ఆవుల జాతి నుంచే మన దేశీ గోజాతులు వృద్ధి చెందాయన్న అభిప్రాయం ఉంది. సుమేరియన్లు తొలుత పాలు వాడారని మరో అభిప్రాయం ఉంది.

### పాల ఉత్పత్తులే మన రైతుకు జవజీవాలు

ప్రపంచంలో ఏ ఇతరదేశం కన్నా మిన్నగా మన దేశానికి పాడిపరిశ్రమ ప్రాణప్రదమైనది. ఒకటో రెండో ఆవులనో, గేదెలనో పెంచుకునే మన పేద రైతులకు, భూమి లేని గ్రామీణ నిరుపేదలకు పాడి ద్వారా వచ్చే దినసరి ఆదాయం అతి పెద్ద భరోసా. పంటలు పండినా పండకపోయినా రెండు పాడి ఆవులో, గేదెలో ఉంటే చాలు ఇంట్లో తిండికి, పై ఖర్చులకు చేయి చాచాల్సిన అవసరం ఉండదు అనేదే ప్రతి రైతు కుటుంబం అనుభవం.

దేశవ్యాప్తంగా 15 కోట్ల మంది చిన్న రైతులు, పాల సహకార సంఘాలు, చిన్నా చితక పాల వ్యాపారుల సమూహాలు.. వీళ్లందరి కృషి వల్ల మన దేశం పాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడమే కాదు, ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తిదారుగా ఎదిగింది. వ్యవసాయం, అనుబంధ రంగాల స్థూల జాతీయోత్పత్తిలో పశువుల వాటా 25% ఉండగా, అందులో 67% వాటా పాల నుంచి సమకూరుతోంది.

### కురియన్ పాల విప్లవం

డాక్టర్ వర్గీస్ కురియన్ రైతుల సహకార డెయిరీల ద్వారా పాల విప్లవాన్ని సృష్టించారు. పాల నురగను విప్లవంగా మార్చిన మహనీయుడాయన. 1949లో గుజరాత్‌లో కైరా జిల్లా ఆనంద్‌లో పాడి పరిశ్రమలో ఇంజినీరుగా పనిలో చేరిన కురియన్ రైతుల కష్టాలు చూసి చలించారు. అప్పట్లోనే పాల్సన్ అనే ప్రైవేటు డెయిరీ కంపెనీ సరైన ధర ఇవ్వకపోవడంతో గుజరాత్ పాడి రైతులు సమ్మె చేశారు. ఈ పూర్వరంగంలోనే కైర జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం 1946లో ఏర్పడింది. దీనిపేరు తదనంతరం ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్(అముల్)గా మారింది. 1955లో ఆనంద్‌లో తొలి అముల్ సహకార డెయిరీ ప్లాంట్ ఏర్పాటైంది. అప్పటి వరకు పాల సేకరణకే పరిమితమైన రైతుల సహకార సంఘం బట్టర్, నెయ్యి, పాల పొడి తయారు చేయడం మొదలుపెట్టింది. అధికారుల జోక్యం లేకుండా పాడి రైతులే స్వతంత్ర విధాన నిర్ణేతలుగా ఉండే సహకార డెయిరీ వ్యవస్థ వేరూనుకునేలా పాటుపడిన కురియన్ దేశవ్యాప్తంగా సహకార పాల విప్లవానికి ఊపిర్లూదారు.

గేదె పాలతో ప్రపంచంలోనే తొట్టతొలిగా పాల పొడిని తయారు చేయడం కురియన్ సాధించిన మొదటి విజయం. అప్పటి వరకు ఆవు పాల ఉత్పత్తుల తయారీలో పట్టున్న న్యూజిలాండ్ ఇంజినీర్లు.. గేదె పాలతో పొడిని తయారు చేయడం అసాధ్యమన్నారు. కానీ, మన రైతుల దగ్గర గేదెలే ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికీ కూడా ప్రపంచంలో ఉన్న గేదెల్లో 57%, ఆవుల్లో 16% మన దేశంలో ఉన్నాయి. స్వతహాగా మెకానికల్ ఇంజినీర్ అయిన కురియన్ దేశీయంగానే సాంకేతికతను అభివృద్ధి చేయడం ద్వారా గేదె పాలతో పొడిని, ఇతర ఉత్పత్తులను తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. ఆ ఉత్పత్తులను వినియోగదారులకు అందించడానికి 'అముల్' బ్రాండ్‌ను సృష్టించి సహకార పాడి పరిశ్రమకు గట్టి పునాదులు వేశారు. ఆ స్ఫూర్తితోనే దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో రైతుల సహకార డెయిరీల ఏర్పాటయ్యాయి.

### నిర్ణయాధికారం రైతులదే

ఈ సహకార సంఘాల్లోని పాడి రైతులకే కాకుండా.. పాలను రైతుల నుంచి వినియోగదారులకు చేర్చే క్రమంలో పనిచేసే వారు లేదా పాలతో వివిధ ఉత్పత్తులు తయారు చేసి అమ్మే లక్షలాది చిన్న వ్యాపారులకు కూడా ఏడాది పొడవునా ఉపాధి దొరుకుతోంది.

చిన్నతరహా పాల వ్యాపార సంస్థల్లో ప్రతి వంద లీటర్ల పాలు సేకరించి, శుద్ధి చేసి, వివిధ ఉత్పత్తులు తయారు చేసి విక్రయించే క్రమంలో పరిస్థితులను బట్టి 4 నుంచి 17 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించవచ్చని అంచనా. పాలను ప్రాసెస్ చేసి ఆ ప్రాంత విని



యోగదారుల అవసరాల మేరకు వివిధ ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తుంటారు. ఏ స్థాయి డెయిరీ సంస్థల్లో ప్రాసెసింగ్ జరుగుతుందన్న దాన్ని బట్టి ఎంత మందికి ఉపాధి కల్పించగలమన్నది ఆధారపడి ఉంటుంది.

1950–51లో కోటి 70 లక్షల టన్నుల పాలు మన దేశంలో ఉత్పత్తయ్యేవి. అయితే, ప్రజల అవసరాలు తీర్చడానికి అవి సరిపోక అప్పట్లో 55 వేల టన్నుల ఆవు పాల పొడిని విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకునే వాళ్లం. కురియన్ సారథ్యంలోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(1965) చేపట్టిన 'ఆపరేషన్ ఫ్లడ్' పథకం ద్వారా సహకార డెయిరీ ఉద్యమం దేశవ్యాప్తమైంది. ఫలితంగా పాల ఉత్పత్తిలో మన దేశం స్వయం సమృద్ధిని సాధించింది. 1998 నాటికి ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తి దేశంగా, అత్యధిక సంఖ్యలో పాడి పశువులున్న దేశంగా భారత్ ప్రసిద్ధికెక్కింది.


### 1,85,903 గ్రామాల్లో పాల సంఘాలు

మన దేశంలో ఇప్పుడు 1,85,903 గ్రామాల్లో పాల సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. ఇందులో 32,000 సంఘాలకు మహిళలే నేతృత్వం వహిస్తున్నారు. పాల ఉత్పత్తి శ్రమలో 70% వరకూ గ్రామీణ మహిళలదే. మన దేశంలో 210 సహకార పాల డెయిరీలు, 9 పెద్ద పాల ఉత్పత్తి దారుల కంపెనీలు ఉన్నాయి. 2017–18 నాటికి మన దేశంలో పాల ఉత్పత్తి 17.64 కోట్ల టన్నులకు పెరిగింది. 2021–22 నాటికి 25.45 కోట్ల టన్నులకు పెంచడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామాల్లో రైతులు పాల సంఘాలకు పోసే పాలల్లో 47% పాలను ఆయా గ్రామాల్లోని ప్రజలే వినియోగించుకుంటున్నారు. మిగతా 53% పాలు పాల సహకార డెయిరీలు, ప్రైవేటు డెయిరీల ద్వారా దగ్గర్లోని పట్టణాలు, నగరాలకు సరఫరా అవుతున్నాయి. వినియోగదారులు చెల్లించే ధరలో 70% మొత్తాన్ని పాడి రైతులు పొందుతున్నారు. సహకార డెయిరీల్లో సభ్యులైన పాడి రైతులకు మరో పది శాతం ఎక్కువ లబ్ధి కలుగుతోంది.

1950లో ప్రతి మనిషి రోజుకు 130 గ్రాముల పాలు అందుబాటులో ఉంటే.. సహకార పాడి పరిశ్రమ పుణ్యమా అని 2018 నాటికి రోజుకు 374 గ్రాముల పాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రపంచ సగటు తలసరి పాల లభ్యత రోజుకు 294 గ్రాములకన్నా ఇది 80 గ్రాములు ఎక్కువ కావడం విశేషం.

### పాల ఉత్పత్తిలో మనమే నంబర్ వన్

ప్రపంచ వ్యాప్తంగా 75 కోట్ల మంది రైతులు పాలను ఉత్పత్తి చేస్తున్నారు. 2018లో ప్రపంచ వ్యాప్తంగా 84.32 కోట్ల టన్నుల పాలు ఉత్పత్తయ్యాయి. ఇందులో మన దేశం వాటా అత్యధికంగా 19%. మన తర్వాత స్థానాల్లో ఐరోపా దేశాల కూటమి(ఈయూ), అమెరికా, చైనా, పాకిస్తాన్, బ్రెజిల్, రష్యా, న్యూజిలాండ్ ఉన్నాయి. అయితే, పాల ఉత్పత్తుల ఎగుమతుల్లో ఈయూ, న్యూజిలాండ్, అమెరికా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. చైనా పాలు, పాల ఉత్పత్తులను ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నది. న్యూజిలాండ్ ఉత్పత్తి చేసే 2.2 కోట్ల టన్నుల పాలలో 1.9 కోట్ల టన్నులను ఎగుమతి చేస్తుంటుంది. పాల ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించిన మన దేశంలో 15 కోట్ల మంది పాడి రైతులు ఉన్నారు. వీళ్లంతా ఐదెకరాల లోపు భూములున్న చిన్న, సన్నకారు రైతులే.విదేశాల్లో ఒక్కో రైతుకే వేలాది ఎకరాల భూములుంటాయి. పారిశ్రామిక వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తుంటారు. అందుకే అక్కడ రైతుల సంఖ్య తక్కువే అయినా దేశ అవసరాలకు పోను మిగులు పాల ఉత్పత్తులు పెద్ద పరిమాణంలో ఉంటాయి. అందువల్ల న్యూజిలాండ్‌లో 12,000 మంది, ఆస్ట్రేలియాలో 6,300 మంది రైతులు మాత్రమే పాల ఉత్పత్తులు తయారుచేస్తున్నప్పటికీ విదేశాలకు పాల ఉత్పత్తులను ఎక్కువగా ఎగుమతి చేస్తున్నాయి. కొన్ని చిన్న దేశాలకు మనమూ పాల ఉత్పత్తులను కొంతమేరకు ఎగుమతి చేస్తున్నాం.




## సరికొత్త హైబ్రిడ్ మామిడి 'ఆర్క సుప్రభాత్'



బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ ఆర్క సుప్రభాత్ (హెచ్–14) అనే సరికొత్త డబుల్ క్రాస్ హైబ్రిడ్ మామిడి వంగడాన్ని రూపొందించింది. దసేరి–నీలం నుంచి తయారైన ఆమ్రపాలి, ఆల్ఫాన్సో–జనార్దన్ నుంచి తయారైన ఆర్క అనుమోల్‌లను సంకరపరచి ఈ కొత్త వంగడాన్ని ఐఐహెచ్‌ఆర్ రూపొందించింది. నాటిన 4 ఏళ్లలో ప్రతి చెట్టూ 35–40 కిలోల దిగుబడినిస్తుంది. గుత్తులుగా, ప్రతి ఏటా కాస్తుంది. కాయల బరువు 240–250 గ్రాములు ఉంటుంది. ఆకారం ఆల్ఫాన్సోలాగ, గుజ్జు రంగు ఆమ్రపాలి లాగ ముదురు ఉంటుంది. 70%కిపైగా గుజ్జు ఉంటుంది. పండు 8–10 రోజులు నిల్వ ఉంటుంది.

## 3న గుంటూరులో భూగర్భ డ్రిప్ 'స్వర్'పై చర్చాగోష్టి

సాగు నీటిని పొదుపుగా బిందు సేద్యం కన్నా 40% తక్కువ నీటితో అదే స్థాయి దిగుబడులు సాధించే భూగర్భ డ్రిప్ పద్ధతి 'స్వర్'. నీటి బిందువులను నేలపైన కాకుండా మొక్కలు/చెట్ల వేర్లకు భూమి లోపలే అందించే ఈ పద్ధతిని హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్స్ వ్యవస్థాపకులు కె. ఎస్. గోపాల్ ఆవిష్కరించారు. 'స్వర్' పద్ధతిపై ఆగస్టు 3న ఉ. 10 గం. నుంచి మ. 2 గం. వరకు గుంటూరు ఆర్.అగ్రహారం 6వ లైనులోని ద కాపిటల్ హోటల్‌లో వారధి ఫౌండేషన్ చర్చాగోష్టిని నిర్వహించనుంది. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం, నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ జి. అశోక్‌కుమార్, డా. వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకులు డా. ఆర్.ఎస్.కె. రెడ్డి తదితరులు పాల్గొంటారు. వివరాలకు.. కె.ఎస్.గోపాల్ – 98481 27794

## 4న సేంద్రియ చిరుధాన్యాల సాగుపై శిక్షణ

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతు శిక్షణా కేంద్రంలో ఈ నెల 4(ఆదివారం)న ఉ. 10 గం. నుంచి సా. 4 గం. వరకు ప్రకృతి వ్యవసాయ విధానంలో చిరుధాన్య పంటల సాగుపై, కషాయాలు, మిశ్రమాల తయారీపై కడప జిల్లాకు చెందిన రైతు శాస్త్రవేత్త విజయ్ కుమార్ శిక్షణ ఇస్తారు. చిరుధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉంటాయి. వివరాలకు.. 9705383666, 0863–2286255.

## బసంపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

అనంతపురం జిల్లా సి.కె.పల్లి మండలం బసంపల్లి గ్రామంలోని దేవాలయ ఆశ్రమ ప్రాంగణంలో ప్రతి నెలా మొదటి ఆదివారం ఉ. 9 గం. నుంచి సా. 4 గం. వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వివిధ పంటల సాగుపై రైతు శాస్త్రవేత్త తాడిమర్రి నాగరాజు శిక్షణ ఇస్తారు. ఫీజు రూ. 100. పేర్ల నమోదుకు సంప్రదించాల్సిన నంబర్లు.. 91826 71819, 94403 33349.

## కందకాలతో జలసిరి!




పద్మారెడ్డి తోటలో కందకం తవ్వుతున్న జేసీబీ

భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యంలో వర్షాలు సరిగ్గా పడని ప్రాంతాల్లోని పండ్ల తోటల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. లోకసాని పద్మారెడ్డి కూడా వారిలో ఒకరు. నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి గ్రామ పరిధిలో పద్మారెడ్డికి 80 ఎకరాల భూమి ఉంది. ఇందులో బత్తాయి తదితర తోటలు ఉన్నాయి. తోటలకు నీటి కొరత తీర్చుకునేందుకు గత కొన్నేళ్లుగా మొత్తం 247 బోర్లు వేసిన రైతు పద్మారెడ్డి. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం వల్ల బోర్లలో నీరు ఆఫ్ ఇంచ్‌కు తగ్గిపోయాయి. ఈ దశలో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంగెం చంద్రమౌళి (98495 66009), మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి (99638 19074), వాటర్ మేనేజ్‌మెంట్ ఫోరం నిపుణుడు శంకరప్రసాద్ (90003 00993) సూచన మేరకు జూలై 5–6 తేదీల్లో తమ 80 ఎకరాల్లో, వాలుకు అడ్డంగా ప్రతి 50 మీటర్లకు ఒక వరుసలో, కందకాలు తవ్వించారు. అదృష్టం కొద్దీ కందకాలు తవ్విన కొద్ది రోజుల్లోనే 3 రోజుల పాటు మంచి వర్షాలు కురిశాయి. పొలాల్లో కురిసిన ప్రతి చినుకూ కందకాల ద్వారా అంతకుముందెన్నడూ లేని విధంగా భూమిలోకి ఇంకింది. భూగర్భ జల మట్టం పెరిగింది. గతంలో ఆఫ్ ఇంచ్ పోసే బోర్లు ఇప్పుడు 2.5 ఇంచులు పుల్లుగా పోస్తుండడంతో పద్మారెడ్డి పరమానందభరితుడయ్యారు. అనూహ్యంగా ఇంత సులువుగా, ఇంత తక్కువ రోజుల్లో భూగర్భ జల మట్టం పెరగడం తనను ఆశ్చర్యపరచిందని ఆయన అన్నారు. ఈ స్ఫూర్తితో గుంటిపల్లి దగ్గర ఉన్న మరో 30 ఎకరాల్లో కూడా కందకాలు తీయిస్తున్నామన్నారు. సాగు నీటి భద్రత కోసం కందకాల ఆవశ్యకత గురించి ప్రచారం చేస్తున్న సాక్షి దినపత్రిక, టీవీ యాజమాన్యాలకు, తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం నేతలకు పద్మారెడ్డి(99481 11931) కృతజ్ఞతలు తెలిపారు.




కందకాలు తవ్విన తర్వాత పుష్కలంగా పోస్తున్న నీరు




రైతు పద్మారెడ్డి

కందకాలు తవ్వక ముందు స్వల్పంగా పోస్తున్న నీరు

# ఆకుల దాణా అదరహో!

అసలే కరువు కాలం. పశువులకు గ్రాసం అందించడం పాడి రైతులు, పశుపోషకులకు కష్టమవుతోంది. వర్షాభావంతో పచ్చి మేత లభ్యత తగ్గిపోయింది. ఎండు మేత (చొప్ప)తో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. పశువులను రైతులు పోషించలేక తెగనమ్ముకునే స్థితికి వచ్చారు. మేతతోపాటు పోషక విలువలతో కూడిన దాణా కూడా పశువులకు అందిస్తేనే పాల దిగుబడి పెరుగుతుంది, పొట్టేళ్లు/మేకలు కండపుష్టితో చక్కగా పెరుగుతాయి. అయితే, నాణ్యమైన పోషక విలువలున్న దాణాను బజారులో కొనుగోలు చేయడం కూడా రైతులకు ఈ కష్టకాలంలో ఇబ్బందే.

ఇటువంటి పరిస్థితుల్లో ఆకుల దాణా ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. వివిధ రకాల పప్పుజాతి చెట్ల ఆకులతో రైతులు ఇంటి దగ్గరే ఆకుల దాణా తయారు చేసుకొని పశువులకు పచ్చి/ఎండు మేతతోపాటు మేపుకుంటే పాల దిగుబడి పెంచుకోవచ్చని, పొట్టేళ్లను లాభదాయకంగా పెంచుకోవచ్చని వైఎస్సార్ కడప రూరల్ పశుసంవర్ధక శాఖ వైద్యులు డా. జి. ఆర్. రాంబాబు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ లైవ్ స్టాక్ డీపీఎం డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి సూచిస్తున్నారు. పప్పు జాతి గ్రాసాల్లోను.. పశు గ్రాసపు చెట్లయిన మునగ, అవిసె, సుబాబుల్, సుంకేసుల ఆకులలోను మాంసకృత్తులు(ప్రొటీన్లు) ఎక్కువగా లభిస్తాయి. ఈ ఆకులతో ఇంటి దగ్గరే మంచి పోషక విలువలు కలిగిన ఆకుల దాణాను తయారు చేసుకోవచ్చు. ఆకుల దాణాను రెండు రకాలుగా తయారు చేసుకోవచ్చు.




ఆకుల దాణా తయారీ

**ఆకుల దాణా (మొదటి రకం) తయారీకి కావాల్సిన వస్తువులు:**

- మునగ/అవిసె/ సుబాబుల్/ జమ్మి ఎండు ఆకులు (వీటిలో ఏదైనా ఒక రకం లేదా అన్ని రకాల ఆకులు కలిపి) 600 గ్రాములు.
- గంజి (అన్నం వార్చినప్పుడు వచ్చే గంజి) దాదాపు అర లీటరు.
- ఉప్పు సరిపడేటంత అంటే 15–20 గ్రాములు.
- మిరల్ మిక్చర్ (ఎముకల పొడి) 10–15 గ్రాములు.

**తయారీ విధానం**

గంజిని గోరు వెచ్చగా చల్లార్చి ఉప్పు, మినరల్ మిక్సర్‌ను కలపాలి. తర్వాత ఎండు ఆకుల పొడిని అందులో వేసి కలిపి ముద్దగా చేసి.. ఏదేని పాలిథిన్ కవర్‌పై వడియాల రూపంలో వేసుకుని బాగా ఎండబెట్టాలి.

**ఆకుల దాణా (రెండో రకం) తయారీకి కావాల్సిన వస్తువులు:**

- మునగ /అవిసె/ సుబాబుల్/ జమ్మి ఎండు ఆకులు (వీటిలో ఏదైనా ఒక రకం లేదా అన్ని రకాల ఆకులు కలిపి) 600 గ్రాములు.
- గోధుమ పిండి 300 గ్రాములు
- ఉప్పు దాదాపు 15–20 గ్రాములు

**తయారీ విధానం**

గోధుమపిండిని కొంచెం చల్ల నీరు పోసి గట్టిగా కలుపుకొని పెట్టుకోవాలి. తర్వాత తగినంత నీటిని మరగబెట్టి (గోధుమ పిండిని ఒకేసారి వేడి నీటిలో కలిపితే ముద్దలు ముద్దలుగా ఉండిపోతాయి) కలిపి పెట్టుకున్న పిండిని అందులో వేసి కలపాలి. గోరు వెచ్చగా చల్లార్చి నిదానంగా ఉప్పు, ఎముకలపొడి మిశ్రమాన్ని కలపాలి. ఆ తర్వాత ఎండు ఆకుల పొడిని అందులో వేసి గట్టిగా అయ్యే విధంగా కలిపి ముద్దలుగా చేసుకోవాలి. పాలిథిన్ కవర్‌పై వడియాలు మాదిరిగా వత్తుకొని బాగా ఎండబెట్టుకోవాలి.

**గమనిక:** పై రెండు పద్ధతుల్లో 250 గ్రాముల ముడి బెల్లం తరిగి పెట్టుకొని వేడి దశలో కలిపినట్లయితే ఇంకా బలవర్ధకమైన దాణా తయారవుతుంది. రూ. 20 ఖర్చుతోనే సుమారు 1200 గ్రాముల ఆకుల దాణా తయారు చేసుకోవచ్చని చెబుతున్నారు.

### ఎలా వాడుకోవాలి?

పైవిధంగా తయారు చేసిన ఆకుల దాణా వడలను పెద్ద పశువులకు అయితే వీటిని రోజుకు 2 కిలోల వరకు, దూడలకు అర కిలో వరకు, గొర్రె/మేక పిల్లలకు 100–150 గ్రాములు, పెద్ద పొట్టేళ్లు/మేకలకు 250 గ్రాముల వరకు తినిపించవచ్చు. కొద్దిగా తడిపి లేదా నీటిలో ముంచి తినిపించాలి.

### ఆకుల దాణాతో ప్రయోజనాలు..

- తక్కువ ధరలో తయారు చేసుకోవచ్చు. కేవలం ఒక గంటలో తయారు చేసుకోవచ్చు. త్వరగా జీర్ణమవుతుంది. ఎన్ని రోజులైనా చెడిపోదు.
- పశువులు పాల దిగుబడి, వెన్న శాతం పెరుగుతుంది. సకాలంలో ఎదకు వచ్చి సజావుగా ఈనుతాయి. దూడలకు కూడా మంచి దాణాగా పనికి వస్తుంది.
- పొట్టేలు పిల్లలకు మంచి ఆహారం, త్వరగా ఎదుగుదల కనిపిస్తుంది. ఇవి బరువు బాగా పెరుగుతాయి. ఎముకల పొడి వలన పశువుల శరీరానికి ఖనిజ లవణాలు అందుతాయి. రక్తహీనతను నివారించవచ్చు.
- ఆకుల దాణా తయారు చేసి అమ్మకానికి పెట్టవచ్చు. గ్రామాల్లో కొంత మందికి ఉపాధి కూడా దొరుకుతుంది.



ఆకుల దాణాతో చేసిన వడియాలు

### ఆకుల దాణాలో పోషక విలువలు

- ఆకుల దాణాను గన్నవరం వెటర్నరీ కాలేజీ లాబ్‌లో టెస్ట్ చేయించగా.. ఎండు పదార్థం 80.2 శాతం, ముడి మాంసకృత్తులు 8.59 శాతం, ముడి పీచుపదార్థం 30.3 శాతం ఉన్నట్లు తేలింది. వాడిన రైతులు సంతృప్తికరమైన ఫలితాలు పొందుతున్నారు.
- మునగలో బీటా కెరోటిన్, విటమిన్ సీ, మాంసకృత్తులు, ఇనుము, కాల్షియం, పొటాషియం సమృద్ధిగా ఉంటాయి.
- అవిసాకులో క్యాల్షియం, విటమిన్ ఏ, ఐరన్ అధికంగా ఉంటాయి. ఇరవై గుడ్లు లేదా పది కప్పుల పాలు లేదా అర కిలో మాంసం ద్వారా లభించే క్యాల్షియం ఓ గుప్పెడు అవిసాకుల్లో లభిస్తుంది.
- ఇరవై కప్పుల పాలు లేదా ఐదు కిలోల మాంసంలో లభించే విటమిన్–ఏ ఓ గుప్పెడు అవిసాకుల్లో లభిస్తుంది. ఇంకా ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు అవిసాకుల్లో ఉన్నాయి.



ఆకుల దాణా వడియాలను గేదెకు తినిపిస్తున్న మహిళా రైతు

- గంజి వాడటం వలన ఎక్కువ బలం వస్తుంది. సుబాబుల్/ జమ్మిలలో మాంసకృత్తులు ఎక్కువ శాతంలో లభిస్తాయి. బెల్లం వలన రక్తహీనత నివారణతోపాటు త్వరగా బలం వస్తుంది.

(వివరాలకు డా.రాంబాబు–94945 88885)

- మాచుపల్లె ప్రభాకరరెడ్డి,
సాక్షి, వైఎస్సార్ జిల్లా అగ్రికల్చర్

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మంగళవారం
30-7-2019





# ఉన్నత చదువులు.. ఉపకార వేతనాలు

ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్రం పలు స్కాలర్‌షిప్స్ పథకాలు అమలుచేస్తోంది. పాఠశాల స్థాయి నుంచి పీహెచ్‌డీ వరకు ప్రతిభావంతులను గుర్తించి వారికి ఆర్థిక చేయూత ఇస్తోంది. అదేవిధంగా అమ్మాయిల చదువుకు తోడ్పాటును అందించేందుకు ప్రత్యేకంగా స్కాలర్‌షిప్ పథకాలు ప్రవేశపెట్టింది. వీటితోపాటు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం కూడా కేంద్ర ప్రభుత్వం పలు ఉపకార వేతనాలు అందిస్తోంది. 2019-20 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న పలు ఉపకార వేతనాలు.. అర్హతలు.. అందుకునేందుకు మార్గాల గురించి తెలుసుకుందాం..

## నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ (ఎన్‌టీఎస్‌ఈ)

సైన్స్, సోషల్ సైన్సెస్, ఇంజనీరింగ్, మెడిసిన్, లా, మేనేజ్‌మెంట్ వంటి కోర్సుల్లో ఉన్నతవిద్య ఔత్సాహికులను పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సహించి.. ఆర్థిక తోడ్పాటునందించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన స్కీం.. నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్. ఎన్‌టీఎస్‌ఈలో ప్రతిభచూపిన వారికి ప్రవేశం పొందిన కోర్సుల ఆధారంగా స్కాలర్‌షిప్ లభిస్తుంది.

- **పరీక్ష విధానం:** ఎన్‌టీఎస్‌ఈ పరీక్ష రెండు దశల్లో జరుగుతుంది. అవి.. స్టేజ్-1, స్టేజ్-2.
- **స్టేజ్-1 పరీక్ష:** దీన్ని రాష్ట్రాల స్థాయిలో ఆయా ప్రభుత్వాలు నిర్వహిస్తాయి. ఈ పరీక్షలో రెండు భాగాలు ఉంటాయి. పార్ట్-1 మెంటల్ ఎబిలిటీ టెస్ట్, పార్ట్-2 స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్.
- **స్టేజ్-2 పరీక్ష:** ఇది జాతీయస్థాయిలో జరిగే పరీక్ష. స్టేజ్-1లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ ఈ పరీక్షను నిర్వహిస్తుంది.
- **అర్హత:** పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్‌టీఎస్‌ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు చివరితేదీలను ఆయా రాష్ట్రాలు ప్రకటిస్తాయి.
- **స్కాలర్‌షిప్ మొత్తం:** పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా జాతీయస్థాయిలో 2000 మందిని ఎంపికచేసి నేషనల్ టాలెంట్ సెర్చ్ నిబంధనల ప్రకారం 11, 12 తరగతుల విద్యార్థులకు నెలకు రూ.1200; యూజీ, పీజీ స్థాయి కోర్సు విద్యార్థులకు నెలకు రూ.2 వేలు అందిస్తారు.

**పరీక్ష తేదీలు:**

- **స్టేజ్ 1 పరీక్ష:** 2019, నవంబర్ 17.
- **స్టేజ్ 2 పరీక్ష:** 2020, మే 10.
- **వివరాలకు వెబ్‌సైట్:** www.ncert.nic.in

## సెంట్రల్ స్కీం ఆఫ్ స్కాలర్‌షిప్ ఫర్ కాలేజ్ అండ్ యూనివర్సిటీ స్టూడెంట్స్

డిగ్రీ నుంచి పీజీ స్థాయి వరకు.. ప్రతిభావంతులైన విద్యార్థులకు రోజువారి ఖర్చులకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 2008 నుంచి అమలుచేస్తున్న స్కాలర్‌షిప్ పథకం ఇది. ఏటా జాతీయస్థాయిలో మొత్తం 82 వేల మందికి ఈ స్కాలర్‌షిప్స్ అందిస్తారు. ఇందులో 50 శాతం అంటే 41 వేల స్కాలర్‌షిప్స్‌ను విద్యార్థినులకు కేటాయిస్తారు. కుటుంబ వార్షికాదాయం రూ. ఆరు లక్షల లోపు ఉండి.. రాష్ట్ర స్థాయిలో టాప్-80 పర్సంటైల్‌లో నిలిచిన ఇంటర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఇతర ఏ స్కాలర్‌షిప్ అందుకోని విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు అయిదేళ్లపాటు స్కాలర్‌షిప్స్ అందజేస్తారు. మొదట డిగ్రీ స్థాయిలో మూడేళ్లపాటు ఏడాదికి రూ.10,000, తర్వాత రెండేళ్లు రూ.20,000 నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. విద్యార్థుల కుటుంబ ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలి. కోర్సులో నిర్దేశిత మార్కులు సాధిస్తే ఉపకార వేతనాల కొనసాగింపు ఉంటుంది.

- **వివరాలకు వెబ్‌సైట్:** https://mhrd.gov.in/scholarships-education-loan-0

## ఏఐసీటీఈ స్కాలర్‌షిప్స్

- **అమ్మాయిలకు ప్రగతి స్కాలర్‌షిప్స్:** ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కాలేజీల్లో డిప్లొమా, డిగ్రీ కోర్సుల్లో చేరే అమ్మాయిల కోసం ఎంహెచ్‌ఆర్‌డీ ప్రవేశ పెట్టిన పథకమే.. ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్ ఫర్ గర్ల్ స్టూడెంట్. దీని అమలు బాధ్యత ఏఐసీటీఈ చూస్తుంది. ఏటా మొత్తం 4000 మందికి ఈ స్కాలర్‌షిప్స్ అందిస్తున్నారు. వీటిలో డిప్లొమా విద్యార్థులకు 2000 స్కాలర్‌షిప్స్, డిగ్రీ విద్యార్థులకు 2000 స్కాలర్‌షిప్స్ కేటాయించారు. సాంకేతిక విద్య ద్వారా మహిళా సాధికారతకు కృషిచేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రగతి స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తోంది.



- **అర్హతలు:** డిప్లొమా/డిగ్రీ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా ప్రవేశాలు పొందిన అమ్మాయిలు అర్హులు. వారి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.8 లక్షలలోపు ఉండాలి. అర్హత పరీక్షలో మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. రిజర్వేషన్ నిబంధనలు పాటిస్తారు.
- **స్కాలర్‌షిప్:** ఈ స్కీమ్ కింద ఎంపికైన విద్యార్థులకు.. ట్యూషన్ ఫీజు చెల్లించడానికి గరిష్టంగా రూ.30,000 వరకు ఇస్తారు. ఒకవేళ ట్యూషన్ ఫీజు రూ.30,000 లోపు ఉంటే ఆ మొత్తాన్ని మాత్రమే ఇస్తారు. దీంతోపాటు నెలకు రూ.2,000 చొప్పున అందిస్తారు. విద్యార్థులు.. ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు పొందినా, లేక ప్రభుత్వం నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం నుంచి లబ్ధి పొందుతున్నా సరే.. వీరికి రూ.30,000 ఇస్తారు. ఈ మొత్తాన్ని పుస్తకాలు, సాఫ్ట్‌వేర్స్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, ఇతర పరికరాలు, వెహికల్, పోటీ పరీక్షలకు ఫీజు చెల్లించడానికి ఉపయోగించుకోవచ్చు.
- **వెబ్‌సైట్:** www.aicteindia.org

## యూనివర్సిటీ ర్యాంకు విద్యార్థులకు యూజీసీ స్కాలర్‌షిప్స్

- డిగ్రీలో యూనివర్సిటీ ర్యాంకర్లుగా నిలిచి, పీజీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల కోసం యూజీసీ-పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్స్ ఫర్ యూనివర్సిటీ ర్యాంకు హోల్డర్స్ పథకం అమలు చేస్తోంది.
- **విభాగాలు:** లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఎర్త్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, కామర్స్, లాంగ్వేజెస్ తదితర ఏదైనా విభాగంలో.. ఏదైనా ఉన్నత విద్యాసంస్థలో పీజీ కోర్సుల్లో చేరిన, చేరబోతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులు.
- **స్కాలర్‌షిప్ మొత్తం:** ఈ స్కాలర్‌షిప్‌ను ఏటా మూడువేల మందికి అందిస్తారు. రెండేళ్లపాటు స్కాలర్‌షిప్ లభిస్తుంది. నెలకు రూ. 3,100 లభిస్తుంది.
- **అర్హత:** అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీలో(బీఏ/బీకామ్/బీఎస్సీ) యూనివర్సిటీ స్థాయిలో మొదటి లేదా రెండో ర్యాంకు పొంది ఉండాలి.
- **వెబ్‌సైట్:** www.ugc.ac.in/urh/

## నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్ఎస్)

- ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎనిమిదో తరగతి తర్వాత చదువు మానేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కాలర్‌షిప్ పథకమే.. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్ఎస్). తల్లిదండ్రుల ఆదాయం రూ.లక్షన్నరలోపు ఉన్న ప్రతిభ కలిగిన విద్యార్థుల చదువుకు చేయూత అందించేందుకు ప్రవేశపెట్టిన పథకమిది.
- **స్కాలర్‌షిప్ మొత్తం:** సంవత్సరానికి రూ.6000 చొప్పున ఏటా లక్షల మంది దీనికింద లబ్ధి పొందుతారు. తొమ్మిదో తరగతి నుంచి 10+2/ఇంటర్ ఫైనల్ విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ అందుతుంది.
- **అర్హత:** కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఈ పథకానికి సర్కారీ బడుల్లో చదివే విద్యార్థులు మాత్రమే అర్హులు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఏడో తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. అదే విధంగా తుది ఎంపిక జరిగే సమయానికి ఎనిమిదో తరగతిలోనూ కనీసం 55 శాతం మార్కులు పొందడం తప్పనిసరి.

**ప్రతిభను ప్రోత్సహించేలా పలు స్కాలర్‌షిప్ పథకాలు**

**అమ్మాయిల చదువులకు చేయూత అందిస్తున్న వైనం**

**పేద విద్యార్థుల వెన్నుతట్టేలా ఆర్థిక సహాయం**

- **ఎంపిక:** ప్రతి రాష్ట్రంలో సెలక్షన్ టెస్టుల్లో భాగంగా మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్), స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (శాట్) నిర్వహిస్తారు. అందులో కనీసం 40 శాతం మార్కులు తెచ్చుకోవాలి.
- దరఖాస్తు ప్రక్రియ ఆగస్టు-సెప్టెంబర్‌లో ప్రారంభమవుతుంది.
- వెబ్‌సైట్: https://mhrd.gov.in/nmms

## తొమ్మిదో తరగతి అమ్మాయిలకు స్కాలర్‌షిప్స్

పాఠశాలల్లో అమ్మాయిల డ్రాప్ అవుట్ సంఖ్య తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం.. 'నేషనల్ స్కీమ్ ఆఫ్ ఇన్సెంటివ్ టు గర్ల్స్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్' (ఎన్ఎస్ఐజీఎస్ఈ). ఎనిమిదో తరగతి పూర్తిచేసుకొని తొమ్మిదో తరగతిలోకి అడుగిడే ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలు ఈ పథకానికి అర్హులు. అలానే, కస్తుర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదివే అన్ని కేటగిరీల అమ్మాయిలూ దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన వారి పేరిట రూ.3000 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారు. వడ్డీతో కలుపుకొని ఈ మొత్తాన్ని 18 ఏళ్లు నిండి, పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత విత్‌డ్రా చేసుకోవచ్చు. 16 ఏళ్ల లోపు ఉండి తొమ్మిదో తరగతిలో చేరే విద్యార్థినులు అర్హులు.

- **వెబ్‌సైట్:** https://mhrd.gov.in/incentives

## ఇందిరాగాంధీ స్కాలర్‌షిప్ ఫర్ సింగిల్ గర్ల్ చైల్డ్ ఫర్ పీజీ ప్రోగ్రామ్స్

పలు రాష్ట్రాల్లో లింగనిష్పత్తి చాలా దయనీయంగా ఉంది. దీనికి తోడు ఆడపిల్లలను గర్భంలోనే తుంచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అమ్మాయిల సాధికారతకు చదువు ఒక్కటే మార్గం. ఉన్నత చదువులతోనే మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించగలరని భావించిన ప్రభుత్వం.. అమ్మాయిల చదువులకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే యూజీసీ ఇందిరాగాంధీ స్కాలర్‌షిప్ ఫర్ సింగిల్ గర్ల్ చైల్డ్ ఫర్ పీజీ ప్రోగ్రామ్స్‌ను ప్రవేశపెట్టింది.

- **అర్హత:** దరఖాస్తు చేసుకునే అమ్మాయి ఏకైక సంతానం అయి ఉండాలి. తోబుట్టువులు ఉండకూడదు. ఒకవేళ కవలలు అయితే ఒక అమ్మాయి దరఖాస్తు చేసుకోవచ్చు. యూజీసీ యాక్ట్ సెక్షన్ 2(ఎఫ్),12(బి) ప్రకారం ఏర్పాటైన యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్‌లు/కాలేజీలు; యూజీసీ యాక్ట్ 1956 సెక్షన్ 3 ప్రకారం ఏర్పాటైన డీమ్డ్ యూనివర్సిటీలు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నడిచే యూనివర్సిటీలు/కాలేజీలు/ఇన్‌స్టిట్యూట్‌లు, జాతీయ ప్రాధాన్యమున్న విద్యాసంస్థ (ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్)ల్లో రెగ్యులర్, ఫుల్‌టైమ్ పీజీ కోర్సు మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థినులు అర్హులు. దూర విద్యలో చేరేవారు అనర్హులు. వయసు 30 ఏళ్ల లోపు ఉండాలి.
- **స్కాలర్‌షిప్:** ఎంపికైన వారికి నెలకు రూ.3,100 మొత్తాన్ని స్కాలర్‌షిప్ రూపంలో అందజేస్తారు. ఏటా 10 నెలలపాటు రెండేళ్ల వరకు చెల్లిస్తారు.
- **వెబ్‌సైట్:** www.ugc.ac.in/sgc

## ప్రొఫెషనల్ పీజీ కోర్సుల్లో ఎస్సీ/ఎస్టీలకు స్కాలర్‌షిప్స్

అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులను ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించేందుకు యూజీసీ ప్రవేశపెట్టిన పథకం... 'పీజీ స్కాలర్‌షిప్స్ ఫర్ ప్రొఫెషనల్ కోర్సెస్ ఫర్ ఎస్సీ/ఎస్టీ క్యాండేట్స్'. ఇంజనీరింగ్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఫార్మసీ వంటి ప్రొఫెషనల్ పీజీ కోర్సుల్లో చేరే విద్యార్థులను ఉద్దేశించి యూజీసీ ఏర్పాటు చేసిన పథకం ఇది. ఏటా 1000 మందికి ఈ స్కాలర్‌షిప్‌ను అందిస్తారు. కోర్సు వ్యవధిని బట్టి రెండు లేదా మూడేళ్ల వరకు ఈ స్కాలర్‌షిప్ కొనసాగుతుంది.

- **స్కాలర్‌షిప్ మొత్తం:** ఎంఈ/ఎంటెక్ కోర్సుల్లో చేరే అభ్యర్థులకు నెలకు రూ.7,800, ఇతర కోర్సుల్లో ప్రవేశాలు పొందితే రూ.4,700 చెల్లిస్తారు. అదనంగా కంటింజెన్సీ గ్రాంట్ రూపంలో ఎంఈ/ఎంటెక్ అభ్యర్థులకు రూ.15,000, ఇతర కోర్సుల్లో చేరిన విద్యార్థులకు రూ.10,000 చెల్లిస్తారు.
- **అర్హతలు:** సంబంధిత కోర్సుల్లో డిగ్రీ పట్టా పొంది.. పీజీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దూరవిద్యలో చేరే విద్యార్థులు అనర్హులు. గరిష్ట వయోపరిమితి 45 ఏళ్లు. మహిళా అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితి 55 ఏళ్లు. ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులు పొందిన స్కాలర్‌షిప్ కొనసాగేందుకు ప్రతి సెమిస్టర్‌లో నిర్దేశిత మార్కులు సాధించడం తప్పనిసరి. ఇతర ఉపకార వేతనాలు, ఫెలోషిప్స్ పొందే విద్యార్థులు ఈ పథకానికి అనర్హులు.
- **వెబ్‌సైట్:** www.ugc.ac.in/pgsprof
- వీటితోపాటు యూజీసీ, ఎంహెచ్‌ఆర్‌డీలు ఇంకా ఎన్నో స్కాలర్‌షిప్స్, ఫెలోషిప్స్ అందిస్తున్నాయి.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ugc.ac.in/page/ScholarshipsandFellowships.aspx; https://mhrd.gov.in/scheme

## ఏఐసీటీఈ పీజీ స్కాలర్‌షిప్స్

గేట్, జీప్యాట్‌లో ఉత్తీర్ణత పొంది ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కాలేజీల్లో ఎంటెక్, ఎంఈ, ఎంఆర్క్, ఎంఫార్మసీ వంటి పీజీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు నెలకు రూ.12,400 అందిస్తుంది. ప్రభుత్వ ఇతర పథకాల కింద ఆర్థిక సహాయం పొందే విద్యార్థులు ఈ స్కీమ్‌కు అనర్హులు.

- వీటితోపాటు ప్రేరణ-స్కీమ్ ఫర్ ప్రిపేరింగ్ ఎస్సీ/ఎస్టీ స్టూడెంట్స్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఏఐసీటీఈ-ఐఎన్ఏఈ ట్రావెల్ గ్రాంట్ స్కీమ్, సమృద్ధి-స్కీమ్ ఫర్ ఎస్సీ/ఎస్టీ స్టూడెంట్స్ ఫర్ సెట్టింగ్ స్టార్టప్స్, నేషనల్ డాక్టోరల్ ఫెలోషిప్ మొదలైన మరెన్నో పథకాలను ఏఐసీటీఈ అమలు చేస్తోంది.
- **వెబ్‌సైట్:** www.aicte-india.org/schemes/students-development-schemes

## దివ్యాంగులకు సాక్ష్యం స్కాలర్‌షిప్స్


దివ్యాంగుల కోసం ఎంహెచ్‌ఆర్‌డీ ప్రవేశపెట్టిన సాక్ష్యం స్కాలర్‌షిప్స్‌ను కూడా ఏఐసీటీఈ అమలు చేస్తుంది. ఈ స్కీమ్ కింద ఏటా 1000 మంది దివ్యాంగులను ఎంపిక చేసి స్కాలర్‌షిప్స్ అందిస్తారు. వీటిలో 500 డిప్లొమా విద్యార్థులకు, మరో 500 డిగ్రీ విద్యార్థులకు అందజేస్తారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.8 లక్షలలోపు ఉండాలి. అర్హత పరీక్షలో మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. రిజర్వేషన్ నిబంధనలు పాటిస్తారు.

- **వెబ్‌సైట్:** www.aictepragatisakshamgov.in

---

# పరిశోధనలకు ముందడుగు

**రీసెర్చ్ ఎడ్యుకేషన్**



కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా సంస్కృతిని, నవకల్పనలను ప్రోత్సహించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) కొత్తగా 'స్కీమ్ ఫర్ ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ ఫర్ ఇండియాస్ డెవలపింగ్ ఎకానమీ (స్ట్రైడ్)'కు శ్రీకారం చుట్టింది. దీనిద్వారా యువ ప్రతిభావంతులను గుర్తించడంతోపాటు దేశ ప్రగతికి దోహదపడే బహుముఖ విభాగాల్లో పరిశోధనలకు ఊతమివ్వాలని యూజీసీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో స్ట్రైడ్ పథకం లక్ష్యాలు, అమలు తీరుతెన్నులపై ప్రత్యేక కథనం..

### లక్ష్యాలు

- దేశంలో యువ ప్రతిభావంతులను గుర్తించడం, పరిశోధన సంస్కృతిని బలపరచడం, పరిశోధనా సామర్థ్యాలను పెంపొందించడం.
- సమాజంలో ప్రగతికి, జాతీయాభివృద్ధికి దోహదపడే నవకల్పనలు, ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించడం.
- హ్యుమానిటీస్, హ్యూమన్ సైన్సెస్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్‌లో జాతీయస్థాయిలో ప్రభావం చూపగలిగే ప్రాజెక్టులకు ఆర్థిక తోడ్పాటు అందించడం.

### బహుళ విభాగాలు

- మానవ ప్రగతిలో పరిశోధనల పాత్ర విస్మరించలేనిది. పరిశోధనల ద్వారా నూతన విజ్ఞానాలను వెలికితీయవచ్చు. స్ట్రైడ్ పథకం ద్వారా పరిశోధనల్లో మల్టీడిసిప్లినరీ (బహుళ విభాగాలు) అప్రోచ్‌ను ప్రోత్సహించనున్నారు. ఈ విధానం వేర్వేరు విభాగాల నుంచి నిపుణులను తీర్చిదిద్దేందుకు, సమాజానికి ఉపయోగపడే కొత్త సిద్ధాంతాలు, పద్ధతుల సృష్టికి దోహదపడనుంది.
- హ్యుమానిటీస్, హ్యూమన్ సైన్సెస్‌లో పరిశోధనలను ప్రోత్సహించడం స్ట్రైడ్ లక్ష్యాల్లో ప్రధానమైంది. ఆయా విభాగాల్లోని విద్యార్థులు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కోణాల్లో మానవ ప్రవర్తన, సంబంధాలను అధ్యయనం చేస్తారు.
- స్ట్రైడ్.. నిష్ణాతులైన పరిశోధకుల ద్వారా మల్టీ ఇన్‌స్టిట్యూషనల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనుంది. పరిశోధకులను, ఇన్‌స్టిట్యూట్‌లను పెద్ద సంఖ్యలో ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ కాన్సెప్ట్‌లోకి తీసుకురానుంది.

### ఈ ప్రాజెక్టులకు మద్దతు

స్ట్రైడ్ పథకం ద్వారా కింది విభాగాల్లోని నవకల్పన పరిశోధనా ప్రాజెక్టులకు సహాయం అందిస్తారు. అవి... సామాజిక సంబంధిత, స్థానిక అవసరాలకు ఉపయోగపడే, జాతీయ ప్రాధాన్యత కలిగిన, అంతర్జాతీయంగా కీలకమైనవి.

### మూడు విభాగాలుగా రీసెర్చ్ గ్రాంట్

స్ట్రైడ్ పథకం కింద మూడు విభాగాలుగా రీసెర్చ్ గ్రాంట్‌ను అందిస్తారు. అవి.. స్ట్రైడ్ కాంపోనెంట్ 1, స్ట్రైడ్ కాంపోనెంట్ 2, స్ట్రైడ్ కాంపోనెంట్ 3.

### స్ట్రైడ్ కాంపోనెంట్ 1

కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లోని అన్ని విభాగాల్లో పరిశోధన సామర్థ్యం పెంపు, మానవ వనరుల అభివృద్ధి.. కాంపోనెంట్ 1 లక్ష్యంగా ఉంది. దీని ద్వారా మూడేళ్ల పాటు గ్రాంట్ అందిస్తారు. ఈ స్కీమ్‌లో భాగంగా యూనివర్సిటీలు, కాలేజీల్లో పరిశోధనలు, నవకల్పనల పట్ల ఆసక్తి ఉన్న ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహిస్తారు. పరిశోధనా కార్యకలాపాల్లో యువ విద్యార్థులకు శిక్షణ, గైడెన్స్ ఇస్తూ.. బహుముఖ విభాగాల్లో పరిశోధనా సామర్థ్యాలు పెంపుదల, అవకాశాల కల్పనకు కృషి చేస్తారు.

### స్ట్రైడ్ కాంపోనెంట్ 2

జాతీయ అభివృద్ధే ధ్యేయంగా ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్, సమ్మిళిత నవకల్పనలను ప్రోత్సహిస్తారు. కాల వ్యవధి మూడేళ్లు. సమ్మిళిత నవకల్పనలు, పరిశోధనల ద్వారా సమస్యా పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తారు. తద్వారా స్థానిక, ప్రాంతీయ, జాతీయస్థాయి సమస్యలకు పరిష్కారాలను కనుగొని దేశాభివృద్ధికి కృషి చేస్తారు.

### స్ట్రైడ్ కాంపోనెంట్ 3

హ్యుమానిటీస్, హ్యూమన్ సైన్సెస్‌లో అత్యధిక ప్రభావశీలత కలిగిన ట్రాన్స్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించడం స్ట్రైడ్ కాంపోనెంట్ 3 లక్ష్యం. అయిదేళ్ల వరకూ గ్రాంట్ అందిస్తారు. మల్టీ ఇన్‌స్టిట్యూషనల్ నెట్‌వర్క్ మార్గంలో హ్యుమానిటీస్, హ్యూమన్ సైన్సెస్ విభాగాల్లో ఎంపిక చేసిన రీసెర్చ్ ప్రాజెక్టులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తారు.

### అర్హత

ఏ విశ్వవిద్యాలయమైనా, ఏ కాలేజీ అయినా ఫండింగ్ కోసం పరిశోధన ప్రాజెక్టు ప్రతిపాదనలను పంపించొచ్చు. రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకుల్లో రీసెర్చ్ అభివృద్ధి, సామర్థ్యాల పెంపునకు సంబంధించి ప్రాజెక్టు ప్రతిపాదనలను సమర్పించవచ్చు. ఈ దిశగా అప్‌గ్రేడేషన్, ఇంక్లూజన్ కోణాల్లో ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌తోనూ కలవొచ్చు. స్ట్రైడ్ ప్రోగ్రామ్ కింద ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్స్‌కు ఆర్థిక సహాయం లభించదు. కానీ, ఆయా ఇన్‌స్టిట్యూట్స్ స్వీయ నిధులతో యూజీసీ స్ట్రైడ్ సెంటర్‌గా ఉండేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. యూజీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు, యువ ఫ్యాకల్టీ, డాక్టోరల్, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోస్ పరిశోధనల్లో పాల్గొనేలా ప్రోత్సహించడమే స్ట్రైడ్ పథకం ఉద్దేశం.

- **ఎంపిక:** యూజీసీ నియమించిన నిపుణుల బృందం, సైంటిఫిక్ అడ్వయిజరీ కమిటీ (ఎస్ఏసీ), సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ, ప్రాజెక్ట్ మానిటర్ కమిటీ (పీఎంసీ)ల పరిశీలన అనంతరం రీసెర్చ్ ప్రాజెక్టులను ఎంపిక చేస్తారు.

### ఎంత మొత్తం

- నిర్దేశిత లక్ష్యాలను అనుసరించి స్ట్రైడ్ పథకం కింద ఒక ఇన్‌స్టిట్యూట్‌కు గరిష్టంగా రూ.కోటి గ్రాంట్ లభిస్తుంది. ఈ మొత్తాన్ని యూజీసీ నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.
- గ్రాంటు మొత్తాన్ని ఇన్‌స్టిట్యూట్/విశ్వవిద్యాలయానికి రెండు విడతల్లో ఇస్తారు. మొదటి విడతలో మంజూరుచేసిన 50 శాతానికి సంబంధించిన వినియోగ పత్రాలను సమర్పిస్తే రెండో దఫా నిధులు విడుదలవుతాయి.

### పర్యవేక్షణ

- గ్రాంటు అందుకున్న ప్రతి ఇన్‌స్టిట్యూట్ ప్రముఖ స్కాలర్స్, సైంటిస్టులతో మెంటారింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంఎంసీ)ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం ఒక నేషనల్ అకాడమీ ఫెలో లేదా నేషనల్ అవార్డు గ్రహీత ఉండాలి.
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి పురోభివృద్ధిపై సమీక్ష చేయాలి. ఏడాదిలో ఒకసారి యూజీసీ నామినీ హాజరయ్యే అవకాశం ఉంటుంది.
- ఎంఎంసీ వార్షిక నివేదికను యూజీసీకి అందించాల్సి ఉంటుంది. సదరు నివేదికలో ఇన్‌స్టిట్యూట్ సాధించిన ఫలితాలను పేర్కొనాల్సి ఉంటుంది.

### దరఖాస్తు ప్రక్రియ

- స్ట్రైడ్ స్కీమ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- దరఖాస్తుకు చివరి తేదీ: 2019, జూలై 31.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ugc.ac.in

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఎల్‌పీయూలో ప్రవేశాలు


దేశవ్యాప్తంగా పేరున్న ఎల్‌పీయూ (లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ).. వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సులు:** ఇంజనీరింగ్, ఎంబీఏ, బీబీఏ, బీకాం, బీఆర్క్, బీ-ఫార్మసీ, ఫ్యాషన్ డిజైనింగ్, అగ్రికల్చర్, ఫిజియోథెరపీ, జర్నలిజం, బీఈడీ, ఎంఈడీ, లా తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 31, 2019.(బీఈడీ, ఎంఈడీ కోర్సులకు మాత్రం ఆగస్టు 20, 2019 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు).
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.lpu.in

### వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రంగ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన విశాఖపట్నంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీస్, ఆపరేటర్ కమ్ మెకానిక్ ట్రైనీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.


- **మొత్తం పోస్టుల సంఖ్య:** 559
- **జూనియర్ ట్రైనీస్:** 539(మెకానికల్-260, ఎలక్ట్రికల్-115, మెటలర్జీ-86, కెమికల్-43, ఎలక్ట్రానిక్స్-5, ఇన్‌స్ట్రుమెంటేషన్-9, సివిల్-2, రిఫ్రాక్టరీ-10).
- **అర్హతలు:** పదో తరగతితోపాటు సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణత. హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- **ఆపరేటర్ కమ్ మెకానిక్ ట్రైనీస్:** 29
- **అర్హతలు:** పదో తరగతితోపాటు సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణత. హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- **వయసు:** 01.07.2019 నాటికి 27 ఏళ్లకు మించరాదు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తులు ప్రారంభం:** 2019, ఆగస్టు 1.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2019, ఆగస్టు 21.
- **వెబ్‌సైట్:** www.vizagsteel.com



### కోహ్లి కెప్టెన్సీని ప్రశ్నించేది లేదా?: సునీల్ గావస్కర్

కనీస సమీక్ష కూడా లేకుండా విరాట్ కోహ్లిని భారత కెప్టెన్‌గా కొనసాగించడాన్ని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ తప్పు పట్టారు. కోహ్లిని వన్డే ప్రపంచ కప్ వరకే సారథిగా ఎంపిక చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 'సెలక్టర్లు జట్టును ఎంపిక చేసే ముందు కెప్టెన్‌ను కూడా ఎంపిక చేసేందుకు కనీసం ఐదు నిమిషాలైనా విడిగా సమావేశం అవ్వాల్సింది. అతడిని మళ్లీ నియమించే విషయంపై చర్చించాల్సింది. ఇప్పుడు చూస్తే కోహ్లి తన ఇష్టప్రకారం తనను తానే కెప్టెన్‌గా ఎంపిక చేసుకున్నట్లు అనిపిస్తోంది' అని సన్నీ విమర్శించారు. భారత సెలక్షన్ కమిటీ ఎలాంటి అధికారాలు లేకుండా పని చేస్తోందని కూడా గావస్కర్ అన్నారు.


## ఆసియా యూత్ టోర్నీకి తిలక్ వర్మ



**న్యూఢిల్లీ:** హైదరాబాద్ యువ క్రికెటర్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ మరో గొప్ప అవకాశాన్ని దక్కించుకున్నాడు. ప్రస్తుతం ఇంగ్లండ్‌లో జరుగుతున్న ముక్కోణపు అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు సభ్యుడిగా ఉన్న తిలక్ వర్మ... సెప్టెంబర్‌లో శ్రీలంక ఆతిథ్యమిచ్చే ఆసియా యూత్ కప్ అండర్–19 టోర్నీలో పాల్గొనే భారత జట్టులోకి ఎంపికయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధ్రువ్ చంద్ జురేల్‌ను కెప్టెన్‌గా నియమించారు. ఎడంచేతి వాటం బ్యాట్స్‌మెన్ అయిన తిలక్ వర్మ 2018–19 రంజీ సీజన్‌లో హైదరాబాద్ సీనియర్ జట్టు తరపున అరంగేట్రం చేశాడు.

**భారత అండర్–19 జట్టు:** ధ్రువ్ చంద్ జురేల్ (కెప్టెన్, వికెట్ కీపర్), సువేద్ పార్కర్, ఠాకూర్ తిలక్ వర్మ, నేహాల్, అర్జున్ ఆజాద్, శాశ్వత్ రావత్, వరుణ్ లావండే, సలీల్ అరోరా, కరణ్ లాల్, అథర్వ అంకోలేకర్, పంకజ్ యాదవ్, ఆకాశ్ సింగ్, సుశాంత్ మిశ్రా, పూర్ణక్ త్యాగి, విద్యాధర్ పాటిల్.

## బ్యాటింగ్ కోచ్ పదవికి ఆమ్రే దరఖాస్తు



**ముంబై:** భారత మాజీ బ్యాట్స్‌మన్ ప్రవీణ్ ఆమ్రే టీమిండియా బ్యాటింగ్ కోచ్ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. 50 ఏళ్ల ఆమ్రే ప్రస్తుతం ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు టాలెంట్ స్కౌట్‌గా ఉన్నారు. అలాగే అమెరికా క్రికెట్‌కు బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్నారు. దిగ్గజ క్రికెట్ గురు, దివంగత కోచ్ రమాకాంత్ ఆచ్రేకర్ వద్దే బ్యాటింగ్ శిక్షణ తీసుకున్న ప్రవీణ్ ఆమ్రే 11 టెస్టులాడి 425 పరుగులు చేశాడు. ఇందులో సెంచరీ, మూడు అర్ధ సెంచరీలున్నాయి. అతను 37 వన్డేలు ఆడి 513 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో అరంగేట్రం చేసిన టెస్టులోనే సెంచరీ బాదిన బ్యాట్స్‌మెన్‌గా ఆమ్రే ఘనత వహించాడు. భారత జట్టు సహాయ సిబ్బంది కాంట్రాక్టు ముగియడంతో విండీస్ పర్యటన కోసం 45 రోజుల పొడిగింపునిచ్చిన బోర్డు కోచింగ్ బృందం కోసం దరఖాస్తుల్ని ఆహ్వానిస్తోంది. నేటితో ఆ గడువు ముగియనుంది.

## వైదొలిగిన సింధు

- నేటి నుంచి థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ
- బరిలో సైనా, కశ్యప్, శ్రీకాంత్, సాయిప్రణీత్



**బ్యాంకాక్:** ఈ సీజన్‌లో తొలి టైటిల్ కోసం నిరీక్షిస్తున్న భారత నంబర్‌వన్ మహిళా షట్లర్ పీవీ సింధు చివరి నిమిషంలో థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నమెంట్ నుంచి వైదొలిగింది. రెండు వారాల క్రితం ఇండోనేసియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన ఈ ఆంధ్రప్రదేశ్ అమ్మాయి... గతవారం జపాన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. ఈ రెండు టోర్నీల్లోనూ జపాన్ క్రీడాకారిణి అకానె యామగుచి చేతిలో సింధు ఓడిపోయింది. సింధు గైర్హాజరీలో... మంగళవారం మొదలయ్యే థాయ్‌లాండ్ ఓపెన్‌లో భారత ఆశలన్నీ ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్‌పై ఆధారపడ్డాయి. ఈ ఏడాది ఆరంభంలో ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలో విజేతగా నిలిచిన సైనా పూర్తి ఫిట్‌గా లేకపోవడంతో ఇండోనేసియా ఓపెన్, జపాన్ ఓపెన్‌లకు ఎంట్రీలు పంపించి... ఆ తర్వాత వైదొలిగింది. ప్రస్తుతం ఆమె ఫిట్‌నెస్ సాధించడంతో ఈ టోర్నీలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. బుధవారం జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో క్వాలిఫయర్‌తో సైనా ఆడుతుంది. మంగళవారం జరిగే క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి చుక్కా సాయి ఉత్తేజిత రావు కెనడా ప్లేయర్ బ్రిట్నీ టామ్‌తో ఆడుతుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, పారుపల్లి కశ్యప్, సమీర్ వర్మ, శుభాంకర్ డే బరిలో ఉన్నారు.

## భారత్‌కు గట్టిపోటీ తప్పదు: రిచర్డ్స్

**ముంబై:** కరీబియన్ పర్యటనకు వస్తున్న భారత జట్టుకు వెస్టిండీస్ గట్టిపోటీ ఇస్తుందని ఆ దేశ క్రికెట్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్ అన్నారు. కోహ్లి బృందం కరీబియన్‌లో మూడు టి20లు, మరో మూడు వన్డేలతో పాటు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగే రెండు టెస్టు మ్యాచ్‌లు కూడా ఆడుతుంది. 'ఈ సిరీస్ ఏదో ఆషామాషీగా జరుగుతుందని నేను అనుకోను. భారత్, వెస్టిండీస్ పోరు ఈసారి ఉత్కంఠభరితంగా జరుగుతుంది. విరాట్ కోహ్లి సేనకు విండీస్ జట్టు నుంచి సవాళ్లు తప్పవు. దీంతో పోటీ క్లిష్టంగా ఉంటుంది' అని ఆయన తెలిపారు. భారత బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గావస్కర్ మాట్లాడుతూ తన హృదయంలో వెస్టిండీస్‌కు ప్రత్యేక స్థానముందన్నారు. విండీస్ ఆటగాళ్లను ఎప్పుడూ అభిమానిస్తూనే ఉంటానని చెప్పారు.

# వట్టి మాటలు కట్టిపెట్టండి

**అవకాశం వచ్చినప్పుడల్లా రోహిత్ శర్మను ప్రశంసలతో ముంచెత్తాను. నాలో అభద్రతాభావం ఉంటే ఇలా చేసేవాడినా?**

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి స్పందన ఇది. ఇటీవల తనకు, రోహిత్‌కు పడటం లేదంటూ గత కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారానికి అతను తెర దించే ప్రయత్నం చేశాడు. ఎక్కడా దాటవేత ధోరణి లేకుండా ఈ అంశంపై కోహ్లి పూర్తి స్పష్టతనిచ్చాడు. పేరుకు వెస్టిండీస్‌తో సిరీస్‌కు బయల్దేరడానికి ముందు జరుగుతున్న అధికారిక మీడియా సమావేశమే అయినా రోహిత్‌తో సంబంధాల గురించే కోహ్లి వివరణ సుదీర్ఘంగా సాగింది. కోచ్ రవిశాస్త్రి కూడా కెప్టెన్‌తో జత కలిసి జట్టు ప్రయోజనాల కోసమే ఎవరైనా ఆడతారని, జట్టుకంటే ఎవరూ ఎక్కువ కాదంటూ 'గాలివార్తలను' కొట్టిపారేశాడు. కోహ్లి తాజా సమాధానాలతోనైనా విభేదాల వార్తలకు ఫుల్‌స్టాప్ పడుతుందో లేదో వేచి చూడాలి.



### రోహిత్‌తో విభేదాలు లేవన్న కోహ్లి
### అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆవేదన
### కోచ్‌గా రవిశాస్త్రికే మద్దతు ప్రకటించిన కెప్టెన్
### వెస్టిండీస్ బయల్దేరిన భారత జట్టు

**ముంబై:** భారత కెప్టెన్ కోహ్లి తన డిప్యూటీ రోహిత్ శర్మతో విభేదాల వార్తలపై పెదవి విప్పాడు. జట్టులో అంతా బాగుందని, ఎవరో కావాలని ఇలాంటివి పుట్టిస్తున్నారని ఒకింత అసహనాన్ని ప్రదర్శించాడు. టి20, వన్డే, టెస్టు సిరీస్‌లు ఆడేందుకు సోమవారం రాత్రి టీమిండియా సభ్యులు విండీస్ బయల్దేరారు. దానికి ముందు కోహ్లి, కోచ్ రవిశాస్త్రి మీడియాతో సంభాషించారు. విశేషాలు కోహ్లి మాటల్లోనే...

**రోహిత్‌తో విభేదాల గురించి వాస్తవాలేమిటి?**

నేను కూడా బయటి నుంచి కొన్ని రోజులుగా ఎన్నో విషయాలు వింటున్నాను. నిజంగా జట్టు సభ్యుల మధ్య సుహృద్భావ వాతావరణం లేకపోతే నాకు తెలిసి ఇంతటి విజయాలు సాధ్యం కావు. ఎందుకంటే అంతర్జాతీయ స్థాయిలో జట్టు ప్రదర్శనలో డ్రెస్సింగ్ రూమ్‌లో మంచి సంబంధాలు, నమ్మకం కూడా కీలక పాత్ర పోషిస్తాయి. గత 2–3 ఏళ్లలో మేం ఎన్నో గొప్ప ఘనతలు సాధించాం. వన్డేల్లో ఏడో స్థానం నుంచి నంబర్‌వన్‌కు చేరుకున్నాం. ఒకరిపై మరొకరికి పరస్పర విశ్వాసం, సమన్వయం, తగిన గౌరవం లేకపోతే ఇదంతా జరగకపోయేది. నిజంగా సంబంధాలు బాగా లేకపోతే అది మైదానంలో ప్రతిఫలిస్తుంది.

**ప్రచారంలో ఉన్న వార్తలపై స్పందన ఏమిటి?**

ఇవన్నీ చాలా చికాకు పరుస్తాయి. మేం జనంలోకి వెళితే మీరు వరల్డ్ కప్‌లో చాలా బాగా ఆడారంటూ ప్రశంసలు వినిపిస్తుంటే మరోవైపు ఇలాంటి హాస్యాస్పద మాటలు వినాల్సి రావడం దురదృష్టకరం. పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. మన మెదళ్లలోకి వాటిని నింపి నిజమని నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. జట్టుకు సంబంధించిన విజయాలు, సానుకూలాంశాల గురించి అసలేమీ తెలియనట్లుగా నటిస్తున్నారు. వ్యక్తిగత అంశాలను ఆటలోకి తీసుకు రావడం అందరినీ అగౌరవపర్చడమే. నేను చాలా కాలంగా ఇలాంటివి అనుభవిస్తూనే ఉన్నాను. మా జట్టు డ్రెస్సింగ్ రూమ్ ఎంత బాగుంటుందో వచ్చి చూడండి. కుల్దీప్‌తో ఎలా మాట్లాడతాం, ధోనిలాంటి సీనియర్‌ను ఎలా ఆటపట్టిస్తామో వీడియో తీసి చూపించలేను కదా?

**రోహిత్‌తో అంతా బాగున్నట్లేనా!**

నా గురించి ఒక్క మాట చెబుతాను. నిజంగా నాకు ఎవరిపైనైనా కోపం ఉంటే అది నా ముఖంలో కనిపిస్తుంది. నాకు ఎలాంటి అభద్రతాభావం లేదు. అవకాశం దొరికినప్పుడల్లా రోహిత్ శర్మను ప్రశంసించేందుకు ఎప్పుడూ వెనుకాడలేదు.

### రవిశాస్త్రికే నా ఓటు...

కోచ్ రవిశాస్త్రితో తనకున్న అనుబంధాన్ని కోహ్లి మరోసారి ప్రదర్శించాడు. ఒకవైపు క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) హెడ్ కోచ్ ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానించి ఆ ప్రక్రియ కొనసాగుతుండగానే తన ఓటు మాత్రం శాస్త్రికేనని బహిరంగంగా మద్దతిచ్చేశాడు. 'కోచ్ ఎంపిక విషయంపై సీఏసీ ఇప్పటి వరకైతే నన్ను ఏమీ అడగలేదు. అయితే నాకు, శాస్త్రికి మధ్య మంచి సమన్వయం ఉంది. ఆయన కోచ్‌గా కొనసాగాలని కోరుకుంటున్నా. నన్ను అభిప్రాయం అడిగితే మాత్రం ఇదే చెబుతా' అని కోహ్లి స్పష్టం చేసేశాడు.

ఎందుకంటే అతనిపై నాకు నమ్మకముంది. రోహిత్ దానికి అర్హుడు. నేను 10 ఏళ్లుగా, రోహిత్ 11 ఏళ్లుగా ఆడుతున్నాం. జట్టును ఈ స్థాయికి తెచ్చేందుకు నాలుగేళ్లుగా కలిసి ఎంతో కష్టపడ్డాం. ఇప్పుడు ఇలాంటి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తోంది. మేం బతికేది, శ్వాసించేది, ఏం చేసినా భారత క్రికెట్ బాగు కోసమే. మా మధ్య ఎలాంటి సమస్య లేదు. ఇలాంటివి పుట్టించి ఎవరు లాభపడుతున్నారో అర్థం కావడం లేదు.

**మిడిలార్డర్ సమస్యను ఎలా పరిష్కరిస్తారు?**

దీనిపై కచ్చితంగా ఇలాగే చేయాలంటూ పరిష్కారం ఏమీ లేదు. పరిస్థితులను బట్టి అప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవడమే. టాపార్డర్ బాగుందంటూ ప్రశంసించిన వారే మిడిలార్డర్‌కు బ్యాటింగ్ అవకాశం రాలేదంటారు. రాక రాక ఒక మ్యాచ్‌లో అవకాశం వచ్చి వారు విఫలమైతే 1–2 మ్యాచ్‌లతోనే వారి ప్రదర్శనను ఎలా అంచనా వేస్తాం! నాలుగో స్థానం గురించి బెంగ ఏమీ లేదు. ప్రపంచ కప్‌లో ఓడినంత మాత్రాన ఏదో ప్రమాదం జరిగినపోయినట్లు కాదు.



**రాబోయే విండీస్ పర్యటన ఎలా ఉండబోతోంది?**

మంచి ఆటకు, వినోదానికి అనువైన దేశం వెస్టిండీస్. ఈ టూర్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. ముందుగా టి20ల్లో కొత్త కుర్రాళ్లకు అవకాశం కల్పించి ప్రయత్నించాలని భావిస్తున్నాం. అయితే టెస్టు చాంపియన్‌షిప్ నేపథ్యంలో ఈ సారి టెస్టు సిరీస్ కూడా ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఉన్న సాధారణ ద్వైపాక్షిక సిరీస్‌లతో పోలిస్తే ఇకపై ప్రతీ టెస్టులో సవాళ్లు, తీవ్రత ఎక్కువ ఉంటాయి. టెస్టులు బతికేందుకు ఇది చాలా అవసరం. నా దృష్టిలో కూడా మొదటి ప్రాధాన్యత, నేను ఇష్టపడేది కూడా సుదీర్ఘ ఫార్మాట్‌నే.

**షెడ్యూల్...**

తొలి టి20: ఆగస్టు 3
రెండో టి20: ఆగస్టు 4
మూడో టి20: ఆగస్టు 6

తొలి వన్డే: ఆగస్టు 8
రెండో వన్డే: ఆగస్టు 11
మూడో వన్డే: ఆగస్టు 14

తొలి టెస్టు: ఆగస్టు 22–26
రెండో టెస్టు: ఆగస్టు 30–సెప్టెంబరు 3

## 16 ఏళ్ల రికార్డు బద్దలు

**మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో అమెరికా అథ్లెట్ దలీలా ప్రపంచ రికార్డు**



**డెస్ మొయినెస్ (అమెరికా):** రియో ఒలింపిక్స్ చాంపియన్ దలీలా మొహమ్మద్ మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో కొత్త ప్రపంచ రికార్డు నమోదు చేసింది. అమెరికాకు చెందిన 29 ఏళ్ల ఈ అథ్లెట్ యూఎస్ చాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల మహిళల హర్డిల్స్ రేసును 52.20 సెకన్లలో పూర్తి చేసింది. ఈ క్రమంలో 16 ఏళ్ల క్రితం 2003లో యులియా పెచొంకినా (రష్యా) నెలకొల్పిన 52.34 సెకన్ల ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి బంగారు పతకం చేజిక్కించుకుంది. దోహా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అమెరికా జట్టు ఎంపిక కోసం నిర్వహిస్తున్న ట్రయల్స్‌లో దలీలా ఈ ఘనత సాధించింది. అయితే ఈ కొత్త ప్రపంచ రికార్డు విషయం తనకు కోచ్ చెబితేగానీ తెలియదని ఆమె చెప్పింది. పురుషుల 200 మీటర్ల పరుగు పందెంలో అమెరికా స్టార్ నోవా లైల్స్ విజేతగా నిలిచాడు. అతను అందరి కంటే ముందు పరుగును 19.78 సెకన్లలో పూర్తి చేయగా... క్రిస్టియాన్ కోల్‌మన్ (20.02 సెకన్లు) రజతం, అమీర్ వెబ్ (20.45 సెకన్లు) కాంస్యం గెలుపొందారు.

## దీపా కర్మాకర్ ఇంకా కోలుకోలేదు

**కోచ్ బిశ్వేశ్వర్ నంది వెల్లడి**



**కోల్‌కతా:** భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ ఇంకా మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదని ఆమె కోచ్ బిశ్వేశ్వర్ నంది వెల్లడించారు. అయితే టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనడంపై ఇప్పుడే చెప్పలేనని అన్నారు. 'దీపా పునరావాస కార్యక్రమం కొనసాగుతోంది. ఆమె ఎప్పుడు బరిలోకి దిగేది ఇప్పుడే చెప్పలేను. ఏదైనా డాక్టర్ సలహా మేరకే నడుచుకుంటాం. ఆమె పూర్తిగా కోలుకున్నాకే కసరత్తయినా... ఇంకేదైనా! లేదంటే లేదు. ఫిట్‌నెస్ సంతరించుకున్నాక మళ్లీ ఓసారి డాక్టర్‌కు చూపిస్తాం. సానుకూల సంకేతం వస్తే ఆ తర్వాత ఫిజియోతో కలిసి పునరాగమనంపై దృష్టిపెడతాం' అని కోచ్ నంది వివరించారు. ఈ అక్టోబర్‌లో జర్మనీలో ప్రపంచ చాంపియన్‌షిప్ జరగనుంది. ఇది ఒలింపిక్స్‌కు క్వాలిఫయింగ్ ఈవెంట్ కావడంతో అప్పటి వరకైనా ఆమె కోలుకోవాలని కోచ్ ఆశిస్తున్నారు.

## గట్టెక్కిన పట్నా పైరేట్స్

- తమిళ్ తలైవాస్‌పై పాయింట్ తేడాతో గెలుపు
- మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్‌పై బెంగాల్ ఘన విజయం



**ముంబై:** ఉత్కంఠభరిత మ్యాచ్‌లకు వేదికగా మారిన ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో మరో ఆసక్తికర మ్యాచ్ నమోదైంది. విజయం కోసం చివరి వరకు పోరాడిన తమిళ్ తలైవాస్ కేవలం ఒక పాయింట్ తేడాతో పట్నా పైరేట్స్ ముందు తలవంచింది. సోమవారం ముంబైలో జరిగిన మొదటి మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 24–23 తేడాతో తమిళ్ తలైవాస్‌పై గెలిచి ఊపిరి పీల్చుకుంది. వరుసగా తానాడిన రెండు మ్యాచ్‌లలో విజయం అంచుల వరకు వచ్చి ఓడిపోవడంతో తలైవాస్ డీలా పడింది. పైరేట్స్ డిఫెండర్ జైదీప్ 5 టాకిల్ పాయింట్లతో పాటు కీలక సమయంలో రైడ్‌కు వెళ్లి రెండు బోనస్ పాయింట్లు తెచ్చి హీరోగా నిలిచాడు. మోను 5 పాయింట్లతో అతనికి తన వంతు సాయం చేశాడు. రాహుల్ చౌదరి (5 పాయింట్లు), మంజీత్ చిల్లర్ (4 పాయింట్లు) ఆకట్టుకోలేకపోయారు.

**తడబడి నిలబడి...**

పట్నా పైరేట్స్ ఆటను అంత గొప్పగా ఆరంభించలేదు. మరోవైపు తలైవాస్ మొదటి మూడు నిమిషాల్లోనే నాలుగు పాయింట్లు సాధించి 4–0తో అధిక్యంలోకెళ్లింది. అయితే తరువాతి నిమిషంలో రాహుల్‌ని సూపర్ టాకిల్ చేసిన పట్నా రెండు పాయింట్లు సాధించి ఖాతా తెరిచింది. ఆ వెంటనే రైడ్‌కు వెళ్లిన ఇస్మాయిల్ రాన్ సింగ్‌ను ఔట్ చేయడంతో పాటు బోనస్ పాయింట్‌ను సాధించి స్కోరును సమం చేశాడు. తర్వాత ఇరు జట్లు సమానంగా పాయింట్లను సంపాదించడంతో విరామ సమయానికి 11–11తో సమంగా నిలిచాయి.

**చివరి మూడు నిమిషాల్లో...**

ఆట మరో మూడు నిమిషాల్లో ముగుస్తుందనగా తలైవాస్ 18–22తో వెనుకబడింది. ఈ దశలో రాహుల్, రాన్ సింగ్‌లు తమ రైడ్లతో మూడు పాయింట్లు తెచ్చారు. అదే సమయంలో పైరేట్స్ రెండు పాయింట్లను సాధించడంతో స్కోరు 21–24కు వెళ్లింది. చివరి రైడ్‌కు వెళ్లిన ప్రదీప్‌ను సూపర్ టాకిల్ చేసిన తలైవాస్‌కు రెండు పాయింట్లు వచ్చినా అది విజయాన్ని అందించలేకపోయింది.

**బెంగాల్ ఘనవిజయం**

రెండో మ్యాచ్‌లో బెంగాల్‌వారియర్స్ 43–23తో పుణేరి పల్టన్‌ను బోల్తా కొట్టించింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో బెంగాల్ ముందు పుణేరి ఏమాత్రం నిలబడలేకపోయింది. బెంగాల్ తరపున మణీందర్ సింగ్ సూపర్ 'టెన్' (మొత్తం 14 పాయింట్లు)తో అదరగొట్టాడు. అతనికి ఇస్మాయిల్ నబీబక్ష్ (8 పాయింట్లు) సహకారం తోడవడంతో బెంగాల్ రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన పుణేరి ఇప్పటి వరకు ఖాతా తెరవలేదు. దీంతో పాయింట్ల పట్టికలో 11వ స్థానంలో నిలిచింది. మంగళవారం విశ్రాంతి దినం. బుధవారం జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్; యు ముంబాతో యూపీ యోధ తలపడతాయి.

ప్రొ కబడ్డీలో 900 పాయింట్లను సాధించిన తొలి రైడర్‌గా రాహుల్ చౌదరి చరిత్ర సృష్టించాడు. మంజీత్ చిల్లర్ 300 టాకిల్ పాయింట్ల మార్క్‌ను అందుకున్నాడు. అజయ్ ఠాకూర్ రైడింగ్‌లో 600 పాయింట్లను సాధించాడు.

సాక్షి బిజినెస్
మంగళవారం
30-7-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 194 ▼ | 95 ▼ |
| 37,686 | 11,189 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (సోమ రెండు రాత్రి 11.30గంలకు)

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,285 | ▼ | 45 |
| డోజోన్స్ | 27,258 | ▲ | 66 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,687 | ▲ | 138 |
| డాక్స్ | 12,417 | ▼ | 2 |
| షాంఘై | 2,941 | ▼ | 4 |
| నికాయ్ | 21,617 | ▼ | 41 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.20 | 69.84 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 83.89 | 86.95 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.36 | 78.22 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.40 | 64.79 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.72 | 48.89 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.42 | 51.16 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.60 | 19.31 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.02 | 19.53 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.35 | 10.70 |

# గ్లోబల్ టాప్ సీఈఓల్లో అంబానీ

- సీఈఓ వరల్డ్ మ్యాగజైన్ గ్లోబల్ ర్యాంకింగ్స్
- అత్యంత ప్రభావశీల సీఈఓల్లో 10 మంది భారతీయులు
- వాల్‌మార్ట్ సీఈఓ డగ్లస్ మెక్‌మిలన్ టాప్



ముకేశ్ అంబానీ



లక్ష్మీ మిట్టల్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక సీఈఓ వరల్డ్ మ్యాగజైన్ తాజాగా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావశీల చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ (సీఈఓ) 2019 జాబితాను విడుదల చేసింది. 121 మందితో కూడిన ఈ జాబితాలో వాల్‌మార్ట్ సీఈఓ డగ్లస్ మెక్‌మిలన్ అగ్రస్థానంలో నిలిచారు. 10 మంది భారతీయులకూ ఈ జాబితాలో చోటు లభించింది. భారత్‌కు సంబంధించి ర్యాంకింగ్ విషయానికి వస్తే, ఆర్సిలార్ మిట్టల్ చీఫ్ లక్ష్మీ మిట్టల్ 3వ ర్యాంక్‌తో ముందు నిలిచారు. అయితే ఆయన కంపెనీ కేంద్రాన్ని లగ్జెంబర్గ్‌గా పేర్కొనడం జరిగింది. దీనితో 49వ ర్యాంక్‌తో ముకేశ్ అంబానీ దేశంలో తొలి స్థానాన్ని దక్కించుకున్నట్లయ్యింది.

**టాప్ 3గా లక్ష్మి మిట్టల్:** గ్లోబల్ జాబితాలో వాల్‌మార్ట్ సీఈఓ డగ్లస్ మెక్‌మిలన్ ముందు నిలవగా, రెండవ స్థానంలో రాయల్ డచ్ షెల్ గ్లోబల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బెన్ వాన్ బెవుర్డెన్ నిలిచారు. మూడవ స్థానంలో ఆర్సిలర్ మిట్టల్ చైర్మన్ అండ్ సీఈఓ లక్ష్మీ మిట్టల్ ఉన్నారు. నాల్గవ ర్యాంక్‌ను సౌదీ ఆరామ్‌కో సీఈఓ అమిన్ హెచ్ నాసర్ సొంతం చేసుకున్నారు. బీపీ చీఫ్ బాబ్ డుబే ఐదవ స్థానాన్ని, ఎక్సాన్‌మొబిల్ సీఈఓ డారిన్ ఉడ్స్ ఆరవస్థానాన్ని, ఫోక్స్‌వ్యాగన్ సీఈఓ హెర్బర్ట్ డియాస్ ఏడవ స్థానాన్ని, టయోటా సీఈఓ అరియో టయోడా ఎనిమిదవ స్థానాన్ని పొందారు. 9,10 స్థానాలను వరుసగా యాపిల్ సీఈఓ టిమ్‌కుక్, బెర్క్‌షైర్ హాత్‌వే సీఓఈ వారెన్ బఫెట్ పొందారు. అమెజాన్ సీఈఓ జెఫ్ బెజోస్ 11వ స్థానాన్ని, యునైటెడ్‌హెల్త్ గ్రూప్ సీఈఓ డేవిడ్ విచ్‌మన్ 12వ స్థానాన్ని, శాంసంగ్ సీఈఓ కిమ్ కి–నామ్ 13వ స్థానాన్ని దక్కించుకున్నారు.

**గర్వకారణం: ఓఎన్‌జీసీ, ఐఓసీ**

తమ సంస్థల సీఈఓలకు ఈ ప్రతిష్టాత్మక జాబితాలో గుర్తింపు లభించడం గర్వకారణమని ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)లు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నాయి.

**ప్రాతిపదిక ఇది...:** సీఈఓలకు సంబంధించి సీఈఓ వరల్డ్ మ్యాగజైన్ గ్లోబల్ ర్యాకింగ్స్ ప్రతిష్టాత్మకమైనవి. 96 దేశాల్లో 1,200కిపైగా సీఈఓలను ఈ ర్యాంకింగ్స్‌కు పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. కంపెనీ వ్యాపార పనితీరు, సీఈఓ పూర్తి బాధ్యతల కాలంలో కంపెనీ సాధించిన ఫైనాన్షియల్ రిటర్న్స్ తుది ర్యాంకింగ్‌లో 60 శాతం వెయిటేజ్‌ని కలిగిఉంటాయి. పర్యావరణం, పాలనాతీరు, కంపెనీలో ఉద్యోగుల ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ షేర్లు, మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో మార్పులు వంటి అంశాలు మిగిలిన 40 శాతం వెయిటేజీలో ఉన్నాయి.

### మన సీఈఓల ర్యాంకింగ్స్...

| పేరు | కంపెనీ | ర్యాంక్ |
|---|---|---|
| ముకేశ్ అంబానీ | రిలయన్స్ ఇండస్ట్రీస్ | 49 |
| సంజీవ్ సింగ్ | ఐఓసీ | 69 |
| శశి శంకర్ | ఓఎన్‌జీసీ | 77 |
| రజనీష్ కుమార్ | ఎస్‌బీఐ | 83 |
| గుంటెర్ బషెక్ | టాటా మోటార్స్ | 89 |
| డి.రాజ్‌కుమార్ | బీపీసీఎల్ | 94 |
| రాజేష్ మెహతా | రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ | 99 |
| రాజేష్ గోపీనాథన్ | టీసీఎస్ | 118 |
| అబిదాలీ జెడ్ నీముచ్‌వాలా | విప్రో | 118 |

## బిలియనీర్ల జాబితాలోకి బైజూస్ రవీంద్రన్



**న్యూఢిల్లీ:** దేశ బిలియనీర్ల జాబితాలో బైజూస్ వ్యవస్థాపకుడు, సీఈఓ బైజు రవీంద్రన్ చేరారు. కతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఏ)–సావరిన్ వెల్త్ ఫండ్ నుంచి బైజూస్‌కు 150 మిలియన్ డాలర్ల ఫండ్ లభించడంతో రవీంద్రన్ బిలియనీర్ల జాబితాలోకి వచ్చి చేరారు. దీనితో కంపెనీ విలువ 6 బిలియన్ డాలర్లకు చేరింది. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎడ్యుకేషనల్ టెక్నాలజీ అండ్ ఆన్‌లైన్ ట్యుటోరియల్ సంస్థలో రవీంద్రన్‌కు 21% మేర వాటా ఉంది. కాగా, 2018–19 ఆర్థిక సంవత్సరంలో బైజూస్ ఆదాయం మూడింతలై రూ.1,430 కోట్లకు చేరింది.

## మారుతి సుజుకి చిన్న ఎస్‌యూవీ వస్తోంది..

- సెప్టెంబరులో విడుదల కానున్న ఎస్–ప్రెస్సో
- ప్రారంభ ధర రూ.5 లక్షలుగా అంచనా



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వాహన తయారీ దిగ్గజం మారుతి సుజుకి మాస్ మార్కెట్ లక్ష్యంగా రూపొందించిన చిన్న ఎస్‌యూవీ 'ఎస్–ప్రెస్సో' త్వరలో రోడ్డెక్కనుంది. సెప్టెంబరులో ఈ కారు విడుదలకు కంపెనీ సన్నాహాలు చేస్తోంది. గ్రేటర్ నోయిడాలో గతేడాది జరిగిన ఆటో ఎక్స్‌పో సందర్భంగా మారుతి సుజుకి కాన్సెప్ట్ కారును ప్రదర్శించింది. కంపెనీ నుంచి ఇదే అతి చిన్న ఎస్‌యూవీ కావడం గమనార్హం. కాంపాక్ట్ ఎస్‌యూవీ విటారా బ్రెజ్జా కంటే ఇది చిన్నగా ఉంటుంది. తక్కువ బడ్జెట్‌లో ఎస్‌యూవీ కోరుకునేవారికి ఇది బెస్ట్ చాయిస్‌గా నిలుస్తుందని కంపెనీ భావిస్తోంది. బీఎస్–6 ప్రమాణాలతో 1.2 పెట్రోల్ ఇంజన్, 5 స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్‌తో రూపుదిద్దుకుంది. ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంటీ) మోడల్ కూడా రానుంది. సీఎన్‌జీ వేరియంట్‌ను సైతం రానున్న రోజుల్లో ప్రవేశపెట్టనుంది. బేస్ వేరియంట్ రూ.5 లక్షల లోపు ఉండే అవకాశముంది. వేరియంట్‌నుబట్టి ధర రూ.8 లక్షల దాకా ఉండొచ్చు. యువతను దృష్టిలో పెట్టుకుని మోడర్న్ స్టైలింగ్, క్యాబిన్ ఫీచర్లతో ఆకట్టుకోనుంది. ఆధునిక టచ్ స్క్రీన్ డిస్‌ప్లే, ఎయిర్‌బ్యాగ్, ఏబీఎస్ వంటివి అదనపు హంగులు.

## ఎస్‌బీఐ డిపాజిట్ రేట్ల కోత



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వివిధ కాలపరిమితులపై డిపాజిట్ రేట్లను తగ్గించింది. 170 రోజుల వరకూ స్వల్పకాలిక డిపాజిట్లపై వడ్డీరేటును 50 నుంచి 75 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) తగ్గిస్తున్నట్లు ఎస్‌బీఐ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. రిటైల్ సెగ్మెంట్‌లో దీర్ఘకాలిక కాలపరిమితి డిపాజిట్లపై రేట్లు 20 బేసిస్ పాయింట్లు, బల్క్ సెగ్మెంట్‌లో డిపాజిట్ రేట్లు 35 బేసిస్ పాయింట్లు తగ్గాయి. రూ. 2 లక్షలు ఆపైన బల్క్ డిపాజిట్లపై రేటును కూడా ఎస్‌బీఐ తగ్గించింది. తగ్గించిన తాజా రేట్లు ఆగస్టు 1వ తేదీ నుంచీ అమల్లోకి వస్తాయి.

# మార్కెట్లోకి 'బిగ్‌బాస్'?




**ప్రభుత్వం ముందు ఎల్‌ఐసీ లిస్టింగ్ ప్రతిపాదన**

- ఇప్పటికే ప్రాథమికంగా చర్చలు
- లిస్ట్ అయితే దేశంలో టాప్ కంపెనీగా అవతరణ
- మార్కెట్ విలువలో ఆర్‌ఐఎల్, టీసీఎస్ వెనక్కి

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజ సంస్థ ఎల్‌ఐసీ షేర్లను కొనుగోలు చేసే రోజు భవిష్యత్తులో చూసే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే పెట్టుబడుల ఉపసంహరణ/వాటాల అమ్మకాల ద్వారా కేంద్రంలోని మోదీ సర్కారు పెద్ద ఎత్తున నిధుల సమీకరణకు ప్రాధాన్యం ఇస్తుండడంతో, ఎల్‌ఐసీ లిస్టింగ్ కూడా ప్రభుత్వ అజెండాలో భాగంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. ఐపీవో ద్వారా స్వల్ప మొత్తంలో వాటాలను ప్రభుత్వం విక్రయించే చాన్స్ ఉందని సమాచారం. ఎల్‌ఐసీ తొలిదశ ఐపీవోకు అధిక ప్రీమియం ఉంటుందని అంచనా. ఈక్విటీ చిన్నది కావడమే దీనికి కారణం. ఎల్‌ఐసీలో వాటాల అమ్మకం ఆరంభ దశలో ఉందని, ఈ విషయమై ప్రాథమికంగా చర్చలు జరిగినట్టు సంబంధిత వర్గాల సమాచారం.

### విలువ అధికం...

ఎల్‌ఐసీ దేశంలోనే అతిపెద్ద బీమా, ఆర్థిక సేవల కంపెనీగా ఉంది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎల్‌ఐసీ గనుక లిస్ట్ అయితే మార్కెట్ విలువ పరంగా టాప్ కంపెనీగా నిలుస్తుందని భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్‌ను దాటిపోతుందని అంచనా. రూ.5 కోట్ల ఈక్విటీ ఆధారంగా వేసిన అంచనా ఇది. లిస్ట్ చేయడం వల్ల ఖాతాలు మరింత పారదర్శకంగా నిర్వహించడంతోపాటు, పెట్టుబడులు, రుణాల పోర్ట్‌ఫోలియో వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడించాల్సి వస్తుంది. ఇది మరింత మెరుగైన కార్పొరేట్ గవర్నెన్స్‌కు దారితీస్తుందని భావిస్తున్నారు. రెండేళ్ల క్రితం కేంద్ర సర్కారు జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీలను లిస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఎల్‌ఐసీలో పెట్టుబడులను ఉపసంహరించుకోవాలంటే అందుకు ఎల్‌ఐసీ చట్టం 1956లో సవరణలు చేయాల్సి ఉంటుంది. ఎల్‌ఐసీ చట్టంలోని సెక్షన్ 37 ప్రకారం... ఎల్‌ఐసీ పాలసీలు అన్నింటికీ వాటి సమ్ అష్యూర్డ్, బోనస్‌లు చెల్లించే విషయంలో ప్రభుత్వం హామీదారుగా ఉంటోంది.

### పెట్టుబడుల కొండ

ఎల్‌ఐసీ 2017–18 వార్షిక నివేదిక ప్రకారం చూస్తే... డిబెంచర్లు, బాండ్లలో రూ.4,34,959 కోట్ల పెట్టుబడులు కలిగి ఉండగా, ఎన్నో మౌలిక రంగ ప్రాజెక్టులకు రూ.3,76,097 కోట్లను రుణాలుగా సమకూర్చింది. అదే ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ పెట్టుబడులపై రూ.23,621 కోట్ల లాభాన్ని ఆర్జించగా, ఈక్విటీలలో ఆ ఏడాది రూ.68,621 కోట్లు పెట్టుబడులు పెట్టింది. రూ.5 కోట్ల మూలధనంతో ఎల్‌ఐసీ సంస్థ ఏర్పాటు కాగా, ఐఆర్‌డీఏఐ నిబంధనల మేరకు బీమా సంస్థల కనీస ఈక్విటీ రూ.100 కోట్లుగా ఉండాలి. ఈక్విటీ చిన్నదే అయినప్పటికీ, ఇతర కంపెనీలతో పోలిస్తే ఎల్‌ఐసీ నిర్వహణలో భారీ ఆస్తులు ఉన్నాయి. 2018–19లో ఎల్‌ఐసీ పెట్టుబడుల మార్కెట్ విలువ వార్షికంగా 8.61 శాతం పెరిగి రూ.28.74 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ.26.46 లక్షల కోట్లుగా ఉంది. కార్పొరేషన్ మొత్తం ఆస్తులు రూ.31.11 లక్షల కోట్లకు చేరాయన్నది అంచనా. ''అధికారికంగా ప్రకటించినా, ప్రకటించకపోయినా కానీ ఎల్‌ఐసీ వ్యవస్థాపరంగా చాలా ముఖ్యమైన బీమా సంస్థ. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ తదితర వెంచర్ల బెయిలవుట్ విషయంలో ఎల్‌ఐసీ పెట్టుబడులు ఇప్పటికే పెద్ద చర్చకు దారితీసింది. మిలియన్ల పాలసీదారుల సొమ్ములు ఇవి. ఎల్‌ఐసీలో వాటాల అమ్మకానికి ముందు ఎల్‌ఐసీ చట్టంలో సవరణ చేయాల్సి ఉంటుంది''అని ఐఆర్‌డీఏఐ సభ్యుడు కేకే శ్రీనివాసన్ పేర్కొన్నారు. ఎల్‌ఐసీని తన పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం ఓ సాధనంగా వాడుకుంటున్న పరిస్థితి ఇన్వెస్టర్లకు అవగతమే. ఓఎన్‌జీసీ తదితర ఎఫ్‌పీవోలకు, ఐడీబీఐ బెయిలవుట్‌కు ప్రభుత్వ ఆదేశాలతో ఎల్‌ఐసీయే భారీగా నిధులు సమకూర్చింది. ఏటా ప్రభుత్వ సెక్యూరిటీల్లో అతిపెద్ద పెట్టుబడిదారు కూడా ఎల్‌ఐసీయే. ఏటా రూ.55,000–65,000 కోట్ల మేర స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తోంది. 2018–19లో ఎల్‌ఐసీ నూతన పాలసీలు, రెన్యువల్ పాలసీల ప్రీమియం రూపంలో రూ.3,37,185 కోట్ల ఆదాయాన్ని సంపాదించింది. పాలసీదారులకు చెల్లించిన మొత్తం ప్రయోజనం రూ.2,50,936 కోట్లు కావడం గమనార్హం.

| | |
|---|---|
| క్యాపిటల్ మార్కెట్లో పెట్టుబడుల విలువ | రూ.28.74 లక్షల కోట్లు |
| మొత్తం ఆస్తులు | రూ.31.11 లక్షల కోట్లు |
| ప్రీమియం ఆదాయం | రూ.3,37,185 కోట్లు |
| పాలసీదారులకు చెల్లించిన క్లెయిమ్‌లు | రూ.2,50,936 కోట్లు |
| ఏటా స్టాక్స్‌లో పెడుతున్న పెట్టుబడి | రూ.60,000 కోట్లు |

ఎల్‌ఐసీ 2018-19 వార్షిక నివేదిక ప్రకారం..

## పోర్ష్ మకన్ కొత్త వేరియంట్

- ధరలు రూ.70 లక్షల నుంచి ఆరంభం
- వచ్చే మే కల్లా ఎలక్ట్రిక్ కారు టేకాన్



**న్యూఢిల్లీ:** లగ్జరీ స్పోర్ట్స్ కార్ల కంపెనీ పోర్ష్ కంపెనీ కాంపాక్ట్ ఎస్‌యూవీ, మకన్‌లో కొత్త వేరియంట్‌ను సోమవారం మార్కెట్లోకి తెచ్చింది. ఈ కారు ధరలు రూ.69.98లక్షల(ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతాయని అని పోర్ష్ ఇండియా తెలిపింది. భారత్‌లో అత్యధికంగా విజయవంతమైన మోడల్ ఇదేనని, ఈ కొత్త వేరియంట్‌కు కూడా మంచి స్పందన లభించగలదని ఆశిస్తున్నామని పోర్ష్ ఇండియా డైరెక్టర్ పవన్ శెట్టి చెప్పారు. ఈ కారును 2–లీటర్ల టర్బోచార్జ్‌డ్ నాలుగు సిలిండర్ల ఇంజిన్‌తో రూపొందించామని, 252 హార్స్‌పవర్ శక్తిని ఈ ఇంజిన్ ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. గంటకు వంద కిలోమీటర్ల వేగాన్ని ఆరున్నర సెకన్లలోనే అందుకుంటుందని, గరిష్ట వేగం గంటకు 227 కి.మీ. అని పేర్కొన్నారు. ఈ మోడల్‌లో హై ఎండ్ వేరియంట్, మకన్ ఎస్‌ను కొత్త వీ6 ఇంజిన్‌తో రూపొందించామని, 354 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుందని వివరించారు. ఈ కారు ధర రూ.85.03 లక్షలని తెలిపారు. గత ఏడాది మొత్తం 348 కార్లను విక్రయించామని, ఈ ఏడాది కూడా అమ్మకాలు ఇదే రేంజ్‌లో ఉండగలవని పేర్కొన్నారు.

### 4 నిమిషాల్లోనే చార్జింగ్..

వచ్చే ఏడాది మే కల్లా ఎలక్ట్రిక్ కారు, టేకాన్‌ను భారత మార్కెట్లోకి తెస్తామని పవన్ శెట్టి తెలిపారు. ఇతర పోర్ష్ కార్ల మోడళ్లలాగే ఈ కారును కూడా పూర్తిగా తయారైన రూపంలోనే దిగుమతి చేసుకుంటామని చెప్పారు. ఈ కారు బ్యాటరీలను నాలుగు నిమిషాల్లోనే చార్జింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్లను చార్జింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించడానికి భారత్‌లోని ఫైవ్–స్టార్ హోటళ్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. కాగా ఎలక్ట్రిక్ వాహనాలపై జీఎస్‌టీని 12 శాతం నుంచి 5 శాతానికి, చార్జర్లపై పన్ను రేట్లను 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడాన్ని ఆయన స్వాగతించారు. ఇది సానుకూల నిర్ణయమని పేర్కొన్నారు.

# కంపెనీల వేటలో డాక్టర్ రెడ్డీస్

క్యూ1లో లాభం 45 శాతం అప్ ● రూ. 663 కోట్లుగా నమోదు ● ఆగస్టు నుంచి కొత్త సీఈవోగా ఎరెజ్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్‌ఎల్) తాజాగా మరింత వృద్ధి సాధించే దిశగా ఇతర కంపెనీలను కొనుగోలు చేసే యోచనలో ఉంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన చర్చలు వివిధ దశల్లో ఉన్నాయి. రుణ, ఈక్విటీ నిష్పత్తి కనిష్ట స్థాయిలో ఉండటంతో ఇతర సంస్థల కొనుగోలుకు ఆర్థికంగా కొంత వెసులుబాటు లభించగలదని డీఆర్‌ఎల్ భావిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో డీఆర్‌ఎల్ సహ చైర్మన్, సీఈవో జీవీ ప్రసాద్ ఈ విషయాలు వెల్లడించారు. తొలి త్రైమాసికంలో డీఆర్‌ఎల్ నికర లాభం 45% ఎగిసి రూ. 663 కోట్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ1లో నికర లాభం రూ. 456 కోట్లు. కెనడాలో రెవ్‌లిమిడ్ ఔషధ వివాదానికి సంబంధించి సెల్జీన్ సంస్థతో సెటిల్మెంట్ ఒప్పందం కింద రూ. 350 కోట్లు అందడం .. కంపెనీ లాభాల పెరుగుదలకు దోహదపడింది. క్యూ1లో సంస్థ ఆదాయం రూ. 3,721 కోట్ల నుంచి రూ. 3,843 కోట్లకు పెరిగింది. 'తొలి త్రైమాసికంలో చాలా మటుకు కీలక మార్కెట్లలో వృద్ధి నమోదు చేయగలిగాం. పనితీరును మెరుగుపర్చుకోవడంపై మరింతగా దృష్టి సారిస్తాం' అని ప్రసాద్ తెలిపారు. ఆగస్టు 1 నుంచి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ఎరెజ్ ఇజ్రేలీ బాధ్యతలు చేపడతారని ఆయన వెల్లడించారు. జీవీ ప్రసాద్ ఇకపై సహ చైర్మన్, ఎండీగా కొనసాగుతారు. ప్రస్తుతం ఇజ్రేలీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



క్యూ1 ఫలితాలను ప్రకటిస్తున్న జి.వి.ప్రసాద్. చిత్రంలో సౌమేన్ చక్రవర్తి(ఎడమ), ఎరెజ్ ఇజ్రేలి

**కొత్త ఉత్పత్తుల ఊతం..**

కొత్త ఉత్పత్తుల ఊతంతో కీలకమైన ఉత్తర అమెరికా, భారత్ తదితర మార్కెట్లలో ఆదాయాలు మెరుగుపర్చుకోగలిగినట్లు డీఆర్‌ఎల్ సీఎఫ్‌వో సౌమేన్ చక్రవర్తి తెలిపారు. గ్లోబల్ జనరిక్స్ విభాగం ఆదాయం ఎనిమిది శాతం వృద్ధితో రూ. 3,298 కోట్లకు చేరింది. ఉత్తర అమెరికాలో జనరిక్స్ ఆదాయం మూడు శాతం వృద్ధితో రూ. 1,632 కోట్లకు పెరిగింది. జనరిక్స్‌కు సంబంధించి యూరప్‌లో 19 శాతం (రూ.240 కోట్లు), భారత్‌లో 15 శాతం (రూ. 696 కోట్లు), వర్ధమాన దేశాల మార్కెట్లలో ఆదాయాలు 10 శాతం (రూ. 729 కోట్లు) మేర వృద్ధి నమోదు చేశాయి. తొలి త్రైమాసికంలో ఉత్తర అమెరికా మార్కెట్లో అయిదు కొత్త ఔషధాలను ప్రవేశపెట్టడంతో పాటు ఐసోట్రెటినోయిన్ ఔషధాన్ని రీ–లాంచ్ చేసినట్లు సౌమేన్ చక్రవర్తి చెప్పారు. అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏలో మొత్తం 107 జనరిక్ ఔషధాలకు అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అమ్మకాల పెరుగుదల, కొత్త ఉత్పత్తుల ఊతంతో భారత మార్కెట్ ఆదాయాలు వార్షిక ప్రాతిపదికన 15 శాతం వృద్ధి నమోదు చేశాయి.

**తగ్గిన పీఎస్‌ఏఐ ..**

అయితే, ఫార్మా సర్వీసెస్, యాక్టివ్ ఇంగ్రీడియంట్స్ (పీఎస్‌ఏఐ) విభాగం ఆదాయాలు గణనీయంగా తగ్గాయి. వార్షిక ప్రాతిపదికన 16 శాతం, సీక్వెన్షియల్‌గా 33 శాతం క్షీణతతో రూ. 454 కోట్లకు పరిమితమయ్యాయి. కొన్ని ఔషధాల నాణ్యతపరమైన అంశాలు తొలి త్రైమాసికంలో పీఎస్‌ఏఐ విభాగంపై ప్రతికూల ప్రభావం చూపాయని, రెండో త్రైమాసికంలో పరిస్థితులు సర్దుకోగలవని సౌమేన్ చక్రవర్తి వివరించారు.

ఫలితాలు మార్కెట్ ముగిశాక వెల్లడయ్యాయి. సోమవారం బీఎస్‌ఈలో డీఆర్‌ఎల్ షేరు సుమారు రెండు శాతం క్షీణించి రూ. 2,653 వద్ద ముగిసింది.

# ఇక అమెజాన్ ఫుడ్ డెలివరీ

### సెప్టెంబర్ నుంచి అందుబాటులోకి !




**బెంగళూరు:** ఆన్‌లైన్ దిగ్గజం, అమెజాన్‌డాట్‌కామ్ భారత్‌లో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వ్యాపారంలోకి ప్రవేశించాలని యోచిస్తోంది. ఐటీ ఇండస్ట్రియలిస్ట్, నారాయణ మూర్తి స్థాపించిన కాటమరన్ వెంచర్ ఫండ్‌తో ఈ వ్యాపారానికి సంబంధించి ప్రస్తుతం అమెజాన్‌డాట్‌కామ్ చర్చలు జరుపుతోందని సమాచారం. . ఈ వ్యాపారంలోకి రావడానికి ఇప్పుడిప్పుడే ఉద్యోగులను నియమించుకుంటోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత్‌లో పండుగల సీజన్ మొదలయ్యే సెప్టెంబర్ నుంచి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు అమెజాన్ ప్రయత్నాలు చేస్తోందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

**ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లు 176 శాతం అప్...**

భారత్‌లో మధ్య తరగతి వర్గాలు పెరుగుతుండటంతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీకి డిమాండ్ జోరుగా పెరుగుతోంది. గత ఏడాది ఆన్‌లైన్ ఆర్డర్లు 176 శాతం పెరిగాయి. భారత్‌లో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వ్యాపారంలో స్విగ్గీ, జొమాటోలు అగ్రస్థానంలో ఉన్నాయి. ట్యాక్సీ అగ్రిగేటర్ ఉబెర్, ఓలాలు కూడా ఫుడ్ డెలివరీ సర్వీసులను ఆరంభించాయి. ఉబెర్ సంస్థ, 2017లో ఉబెర్ ఈట్స్ పేరుతో ఈ ఫుడ్ డెలివరీ సర్వీసులను ప్రారంభించినప్పటికీ, స్విగ్గీ, జొమాటోలతో పోటీపడలేకపోతోంది. ఉబెర్ ఈట్స్‌ను అమెజాన్ కొనుగోలు చేయనున్నదని కూడా వార్తలు వచ్చాయి. మరోవైపు ఈ వ్యాపారం నుంచి వైదొలగాలని ఓలా నిర్ణయించుకుంది. కాగా పోటీ తీవ్రత అధికంగా ఉండటంతో అమెరికాలో తన ఫుడ్ డెలివరీ సర్వీసుల విభాగాన్ని అమెజాన్ మూసేసింది. అమెజాన్ సంస్థ 2016లో ప్రైమ్ సర్వీసులను భారత్‌లో ప్రారంభించింది. వీడియో, మ్యూజిక్ స్ట్రీమింగ్ సర్వీసులను అందిస్తోంది. ఇటీవలనే కిరాణా సరుకుల డెలివరీ సర్వీసుల వ్యాపారాన్ని కూడా ఆరంభించింది.

### అమెజాన్‌లో 5 లక్షల మంది విక్రేతలు

**చండీగఢ్:** ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ ప్లాట్‌ఫాం ద్వారా విక్రయించే విక్రేతల సంఖ్య అయిదు లక్షలు దాటింది. భారత్‌లో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన సుమారు అయిదేళ్లలోనే ఈ మైలురాయి సాధించగలిగామని అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (సెల్లర్ సర్వీసెస్) గోపాల్ పిళ్లై తెలిపారు. భారత మార్కెట్‌కు అనువైన సాధనాలను ప్రవేశపెట్టడం వల్లే ఇది సాధ్యపడిందని, ద్వితీయ.. తృతీయ శ్రేణి పట్టణాల నుంచి కూడా పెద్ద యెత్తున విక్రేతలు తమ ప్లాట్‌ఫాంలో భాగమయ్యారని ఆయన పేర్కొన్నారు. విక్రేతలందరికీ పారదర్శకంగా, సమానమైన అవకాశాలను అమెజాన్ కల్పిస్తోందని పిళ్లై వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో విక్రయాలకు తోడ్పాటు అందించే అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రోగ్రాం (ఏజీఎస్‌పీ)లో నమోదైన విక్రేతల్లో 80 శాతం మంది ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు చెందినవారే ఉన్నారని ఆయన చెప్పారు. ఏజీఎస్‌పీ ద్వారా ఇప్పటిదాకా 1 బిలియన్ డాలర్ల దాకా విలువ చేసే ఎగుమతులు జరిగాయని, 2023 నాటికి దీన్ని 5 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాలని నిర్దేశించుకున్నామని పిళ్లై చెప్పారు.

# హైదరాబాద్‌లో తగ్గిన గృహ విక్రయాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో గృహాల అమ్మకాల్లో వృద్ధి నమోదైంది. ఏప్రిల్ – జూన్ మధ్య కాలంలో అమ్మకాల్లో 6 శాతం గ్రోత్ కనిపించిందని ప్రాప్‌ఈక్విటీ సర్వే తెలిపింది. అయితే ఇదే సమయంలో కొత్త గృహాల సప్లయిలో మాత్రం 11 శాతం క్షీణత నమోదైందని సర్వే పేర్కొంది.

**5,89,503 గృహాల ఇన్వెంటరీ**

గుర్గావ్, నోయిడా, ముంబై, కోల్‌కతా, పుణే, హైదరాబాద్, బెంగళూరు, థానే, చెన్నై నగరాల్లో ఏప్రిల్ – జూన్ మధ్య కాలంలో 61,789 గృహాలు విక్రయమయ్యాయి. గతేడాది ఇదే కాలానికి అమ్మకాలు 58,292 యూనిట్లుగా ఉన్నాయి. ఇక, కొత్త గృహాలు ప్రారంభాలు ఈ ఏడాది ఏప్రిల్ – జూన్‌లో 51,108 యూనిట్లుగా కాగా.. గతేడాది ఇదే సమయంలో 57,425 గృహాలుగా ఉన్నాయి. విక్రయం కాకుండా ఉన్న గృహాలు (ఇన్వెంటరీ) 5,89,503 యూనిట్లుగా ఉన్నాయి.

**విక్రయాలు నగరాల వారీగా చూస్తే..**

హైదరాబాద్‌లో ఏప్రిల్ – జూన్‌లో 4,219 గృహాలు అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 11 శాతం తగ్గుదల. బెంగళూరులో 10,859 యూనిట్లు, చెన్నైలో 4,687, పుణేలో 16,025, ముంబైలో 6,125, గుర్గావ్‌లో 2,378 గృహాలు విక్రయమయ్యాయి. 2018 తర్వాత నుంచి డెవలపర్లు కొత్త గృహాల ప్రారంభాల్లో ఆచితూచి వ్యవహరిస్తున్నారని ప్రాప్ ఈక్విటీ ఫౌండర్ అండ్ ఎండీ సమీర్ జాసుజా తెలిపారు. ధరలను అందుబాటులో ఉంచేందుకు ఫ్లాట్ల విస్తీర్ణాలను తగ్గిస్తున్నారని పేర్కొన్నారు.

# ఫోన్‌పేలో రూ.698 కోట్ల పెట్టుబడులు

**ఇన్వెస్ట్ చేసిన మాతృసంస్థ**

**న్యూఢిల్లీ:** ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన డిజిటల్ చెల్లింపుల కంపెనీ ఫోన్‌పేకు రూ.698 కోట్ల పెట్టుబడులు లభించాయి. మాతృసంస్థ, ఫోన్‌పే ప్రైవేట్ లిమిటెడ్, సింగపూర్(గతంలో ఫ్లిప్‌కార్ట్ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్)కు షేర్ల జారీ ద్వారా ఫోన్‌పే కంపెనీకి ఈ నిధులు వచ్చాయి. రూ.10 షేర్‌కు రూ.3,440 ప్రీమియమ్‌తో మొత్తం 2.02 లక్షల షేర్లను జారీ చేయడం ద్వారా 698 కోట్లు సమీకరించామని ఫోన్‌పే తెలిపింది. కాగా ఈ ఏడాది మార్చిలోనే ఫోన్‌పే సంస్థ, తన మాతృకంపెనీ నుంచి రూ.700కోట్లు సమీకరించింది.

# ఆఫ్‌లైన్ చెల్లింపులకు క్యూఆర్ కోడ్ ఊతం

**క్యూ1లో పేటీఎం ప్లాట్‌ఫాంపై నెలకు 25 కోట్ల లావాదేవీలు**




**న్యూఢిల్లీ:** చాలా మటుకు డిజిటల్ లావాదేవీలపై చార్జీలను ప్రభుత్వం తొలగిస్తుండటంతో ఆఫ్‌లైన్ చెల్లింపుల్లో క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. 2019–20 తొలి క్వార్టర్‌లో తమ ప్లాట్‌ఫాంపై క్యూఆర్ కోడ్ ద్వారా నెలకు 25 కోట్ల పైగా లావాదేవీలు జరిగినట్లు చెల్లింపు సేవల సంస్థ పేటీఎం వెల్లడించింది. డీమానిటైజేషన్ సమయంలో డిజిటల్ చెల్లింపుల సాధనాలను వ్యాపార సంస్థలకు అందుబాటులోకి తేవడంలో చురుకైన పాత్ర పోషించడం.. తమకు ప్రస్తుతం కలిసి వస్తోందని పేటీఎం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ అబాట్ తెలిపారు. కిరాణా దుకాణాల నుంచి ఆటోలు, హోటళ్ల దాకా అన్ని చోట్లా క్యూఆర్ కోడ్ వినియోగం గణనీయంగా పెరిగిందని ఆయన వివరించారు. స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే చాలు చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేసే విధంగా రూపొందించిన క్యూఆర్ కోడ్స్ విధానంతో పేమెంట్స్ మరింత సులభతరం అయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి టెక్ దిగ్గజాలు సైతం క్యూఆర్ కోడ్ ఆధారిత చెల్లింపుల సేవలపై మరింతగా దృష్టి సారిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

**స్టాక్ బ్రోకింగ్ సేవల్లోకి పేటీఎమ్ మనీ**

డిజిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫార్మ్, పేటీఎమ్ మనీ త్వరలో స్టాక్ బ్రోకింగ్ సర్వీస్‌ను అందించనున్నది. దీంతో పాటు నేషనల్ పెన్షన్ స్కీమ్, ఈటీఎఫ్(ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్), ఇతర ఆర్థిక సాధనాల విక్రయాలను కూడా చేపట్టనున్నామని పేటీఎమ్ పూర్తి కాలపు డైరెక్టర్ ప్రవీణ్ జాదవ్ చెప్పారు. ఈ సేవలన్నీ ఈ ఆర్థిక సంవత్సరంలోనే అందుబాటులోకి తెస్తామని వివరించారు.

# వ్యక్తిగత దివాలా నియంత్రణ దశలవారీగా...


**దివాలా కంపెనీలను కొన్న వాటిపై క్రిమినల్ చర్యలు ఉండవు ● కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ ● ఐబీసీ సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం**



**న్యూఢిల్లీ:** మూడేళ్ల నాటి ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) చట్టంలో ప్రభుత్వం సవరణలు ప్రతిపాదించగా, ఇందుకు సంబంధించిన బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. నిర్వహణ అవసరాలకు రుణాలిచ్చిన సంస్థల (ఆపరేషనల్ క్రెడిటార్స్)తో పోలిస్తే, సెక్యూర్డ్ రుణాలిచ్చిన వాటికి ప్రాధాన్యంపై తాజా సవరణలతో స్పష్టత రానుంది. దివాలా కంపెనీని ఒడ్డెక్కించేందుకు దాన్ని కొనుగోలు చేసిన వారిపై ఎటువంటి క్రిమినల్ చర్యలు ఉండవని, అలాగే పరిష్కార ప్రణాళిక అమలు అనంతరం పన్నులు చెల్లించాలంటూ వారికి వ్యతిరేకంగా ఆదేశాలు కూడా జారీ చేయబోమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. రుణాలు ఎగ్గొట్టిన కంపెనీలకు సంబంధించిన వ్యక్తులపై మాత్రం క్రిమినల్ చర్యలు కొనసాగుతాయన్నారు. వ్యక్తులకు సంబంధించిన దివాలా నియంత్రణ చట్టాన్ని దశలవారీగా అమలు చేస్తామని చెప్పారు. ఐబీసీ చట్ట ఉద్దేశ్యాలను నీరుగార్చే చర్యలకు స్పందనగా తాజా సవరణలు తీసుకొచ్చినట్టు బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఎస్సార్ స్టీల్ దివాలా కేసులో వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని పంపిణీ చేసే విషయంలో రుణదాతలు, ఆపరేషనల్ క్రెడిటార్స్‌ను ఒకే విధంగా ఎన్‌సీఎల్‌టీ పరిగణించడాన్ని మంత్రి ఉదాహరణగా పేర్కొన్నారు. రుణ చెల్లింపుల్లో విఫలమైన కంపెనీని వేలం వేయడం ద్వారా వచ్చే మొత్తం పంపిణీపై రుణదాతల కమిటీకే అధికారం కల్పించడం, ఐబీసీ కింద ప్రతిపాదించే కేసుల పరిష్కారానికి 330 రోజుల గడువుతో సత్వర పరిష్కారానికి వీలు కల్పించడం ఈ సవరణల ఉద్దేశ్యాలుగా మంత్రి తెలిపారు.

# ఇదంతా ప్రభుత్వ నిర్వాకమే..

- డిమాండ్, ప్రైవేట్ పెట్టుబడులు తగ్గిపోతున్నాయి
- వాటికి ఊతమిచ్చేందుకు కేంద్రం చర్యలేమీ తీసుకోవడం లేదు
- బజాజ్ ఆటో చైర్మన్ రాహుల్ బజాజ్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** దేశీయంగా డిమాండ్, ప్రైవేట్ పెట్టుబడులు తగ్గిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీరుపై బజాజ్ ఆటో చైర్మన్ రాహుల్ బజాజ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పెట్టుబడులు, డిమాండ్‌కి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం ఏ విధంగానూ ప్రయత్నించడం లేదని ఆక్షేపించారు. 'ప్రభుత్వం చెప్పినా చెప్పకున్నా.. అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు గణాంకాలు చూస్తే గడిచిన మూడు–నాలుగేళ్లుగా వృద్ధి క్షీణిస్తోందని స్పష్టంగా తెలుస్తుంది. ప్రభుత్వం మాత్రం అంతా బాగానే ఉందని చూపే ప్రయత్నం చేస్తోంది. కానీ వాస్తవ పరిస్థితులను ఒప్పుకోక తప్పదు. డిమాండ్ లేదు. ప్రైవేట్ పెట్టుబడులు లేవు. మరింక వృద్ధి ఎక్కడ నుంచి వస్తుంది? ఎక్కడో ఆకాశం నుంచి ఊడిపడదుగా. ఆటో పరిశ్రమకు చాలా కష్టకాలంగా ఉంది. కార్లు, వాణిజ్య వాహనాలు, ద్విచక్ర వాహనాలు.. ఇలా అన్ని విభాగాలూ తీవ్ర సమస్యల్లో ఉన్నాయి' అని కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సందర్భంగా రాహుల్ వ్యాఖ్యానించారు. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో దేశీ ఆటోమొబైల్ పరిశ్రమ విక్రయాలు 12.3 శాతం క్షీణించాయి. కార్లు, ఎస్‌యూవీలు, వాన్స్‌కి సంబంధించిన పాసింజర్ వాహనాల విభాగం ఏకంగా 18.4 శాతం తగ్గింది. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్ తదితర దిగ్గజ సంస్థలన్నీ కూడా ఉత్పత్తిని తగ్గించుకుంటున్నాయి. అయినప్పటికీ అమ్మకాలు సరిగ్గా లేక గిడ్డంగులు, డీలర్ల దగ్గర ద్విచక్ర వాహనాలు, వాణిజ్య వాహనాల నిల్వలు భారీగా పేరుకుపోయి ఉన్నాయి. సాధారణంగా డీలర్ల దగ్గర 25–30 రోజులకు సరిపడేంత నిల్వలు ఉంటాయి. కానీ ప్రస్తుతం 65 రోజుల స్థాయికి నిల్వలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో రాహుల్ బజాజ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# రెండు రెట్లు పెరిగిన డీఎల్‌ఎఫ్ లాభం


**రూ.415 కోట్లకు నికర లాభం**




**న్యూఢిల్లీ:** రియల్టీ దిగ్గజం, డీఎల్‌ఎఫ్ నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రెండు రెట్లు పెరిగింది. గత క్యూ1లో రూ.173 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.415 కోట్లకు పెరిగిందని డీఎల్‌ఎఫ్ తెలిపింది. రూ.297 కోట్ల అసాధారణ ఆదాయం కారణంగా నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని వివరించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.1,658 కోట్ల నుంచి రూ.1,541 కోట్లకు తగ్గిందని పేర్కొంది. ఈ క్యూ1లో నికర అమ్మకాల బుకింగ్స్ .రూ.705 కోట్లుగా ఉన్నాయని తెలిపింది. గత క్వార్టర్‌లో కంపెనీ ప్రమోటర్లు చివరి దశ పెట్టుబడులు కింద రూ.2,250 కోట్లు ఇన్వెస్ట్ చేశారని పేర్కొంది. దీంతో కలుపుకొని ప్రమోటర్లు మొత్తం రూ.11,250 కోట్లు ఇన్వెస్ట్ చేశారని తెలిపింది. ప్రమోటర్లు భారీగా ఇన్వెస్ట్ చేసిన కంపెనీల్లో ఒకటిగా డీఎల్‌ఎఫ్ నిలిచిందని పేర్కొంది. నిర్మాణం పూర్తయిన ఇళ్ల విక్రయాలపై ఇక నుంచి ప్రధానంగా దృష్టి పెట్టనున్నామని వివరించింది.

# ఓరియంట్ సిమెంట్ లాభం మూడు రెట్లు


**7 శాతం వృద్ధితో రూ.691 కోట్లకు మొత్తం ఆదాయం**



**న్యూఢిల్లీ:** బిర్లా గ్రూప్‌నకు చెందిన ఓరియంట్ సిమెంట్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో మూడు రెట్లు పెరిగింది. గత క్యూ1లో రూ.16 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.56 కోట్లకు ఎగసిందని ఓరియంట్ సిమెంట్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.643 కోట్ల నుంచి 7 శాతం వృద్ధితో రూ.691 కోట్లకు పెరిగిందని పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ.616 కోట్ల నుంచి రూ.605 కోట్లకు తగ్గాయని వివరించింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఓరియంట్ సిమెంట్ షేర్ 2 శాతం నష్టంతో రూ.99 వద్ద ముగిసింది.

# గూగుల్‌తో సిస్కో జట్టు

**దేశవ్యాప్తంగా ఉచిత వైఫై జోన్స్ ఏర్పాటు**



**కొచ్చి:** టెక్ దిగ్గజం గూగుల్ దేశవ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో 'జీస్టేషన్' పేరిట ఉచిత హైస్పీడ్ వైఫైజోన్స్‌ను విస్తరిస్తోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నెట్‌వర్క్ మౌలికసదుపాయాలను కల్పించడం కోసం గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో వెల్లడించింది. ఇప్పటికే బెంగళూరులోని 25 ప్రాంతాల్లో జీస్టేషన్స్ అందుబాటులోకి వచ్చాయని, మరో 2–3 నెలల్లో ఇంకో 200 ప్రాంతాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయని పేర్కొంది.

# ఐటీ నిపుణులకు ఈమెయిల్ కష్టాలు

**సైబర్‌దాడులతో భారీ నష్టాలు**



**న్యూఢిల్లీ:** ఈమెయిల్స్ ద్వారా జరిగే ఫిషింగ్, రాన్సమ్‌వేర్ వంటి సైబర్ దాడులు ఐటీ నిపుణులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈమెయిల్ సెక్యూరిటీ విషయంలో పనివేళల తర్వాత కూడా చాలా మంది తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. వీటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు రాత్రుళ్లు, వారాంతాల్లో కూడా పనిచేయాల్సి వస్తోంది. 2019లో ఈమెయిల్ సెక్యూరిటీ తీరుతెన్నులపై అమెరికాకు చెందిన సైబర్ సెక్యూరిటీ సంస్థ బెరాకుడా నెట్‌వర్క్స్ రూపొందించిన ఓ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. సర్వేలో పాల్గొన్న వారిలో మూడొంతుల మంది ఐటీ నిపుణులు ఈమెయిల్స్ సెక్యూరిటీపరంగా తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నట్లు తేలింది.

# ఎన్‌బీఎఫ్‌సీ పెస్కీ కాల్స్‌ను నిషేధించడం సరికాదు


**స్పష్టం చేసిన ఆర్‌బీఐ**



**న్యూఢిల్లీ:** బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీలు) నుంచి రుణాలను ఆఫర్ చేస్తూ వచ్చే ఇబ్బందికర కాల్స్ (పెస్కీ కాల్స్) విషయంలో వినియోగదారులకు ఆర్‌బీఐ ఎటువంటి ఉపశమనం కల్పించడంలేదు. ఎన్‌బీఎఫ్‌సీలు తమ ఉత్పత్తుల విషయంలో అవగాహన కల్పిస్తున్నాయని, వాటిపై నిషేధం విధించడం సరైన విధానం కాబోదంటూ... ఓ సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు జవాబుగా ఆర్‌బీఐ పేర్కొంది. ఈ తరహా కాల్స్ ద్వారా రుణాలను ఆఫర్ చేస్తే, రుణాలను తీసుకునే ముందు నియమాలు, షరతుల గురించి పూర్తిగా తెలుసుకుని నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత వినియోగదారులపైనే ఉంటుందని తేల్చి చెప్పింది. కస్టమర్లకు కాల్స్ చేసి అన్ సెక్యూర్డ్ రుణాలు ఆఫర్ చేయడాన్ని నిషేధించాలని, వడ్డీ రేట్లపై పరిమితి విధించాలంటూ ఆర్‌టీఐ కార్యకర్త సుభాష్ అగర్వాల్ చేసిన పలు సూచనలను ఆర్‌బీఐ తిరస్కరించింది.

# వెలుగులోకి మాల్యా కొత్త షెల్ కంపెనీలు

- అక్రమంగా నిధుల మళ్లింపు కేసులో ఈడీ గుర్తింపు
- అనుచరుడి ఇంట్లో సోదాలు



**న్యూఢిల్లీ:** బ్యాంకులకు భారీ మొత్తంలో రుణాలను ఎగవేసి బ్రిటన్‌కు ఉడాయించిన విజయ్ మాల్యా కేసులో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. అనుచరుల ద్వారా డొల్ల(షెల్) కంపెనీలను సృష్టించి వాటిద్వారా నిధులను(బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను) మాల్యా తన సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వెలుగులోకి తెచ్చింది. ఈ లావాదేవీల్లో పాలుపంచుకున్నట్లు అనుమానిస్తూ కొన్ని షెల్ కంపెనీలను(యునైటెడ్ బ్రాండింగ్ వరల్డ్‌వైడ్ ఇతరత్రా) గుర్తించింది. దీని ఆధారంగా బెంగళూరుకు చెందిన వి.శశికాంత్, అతని కుటుంబ సభ్యుల ఇళ్లలో ఈడీ గతవారం సోదాలు నిర్వహించింది. శశికాంత్ అనే వ్యక్తి మాల్యాకు అత్యంత ఆప్తుడని ఈడీ వర్గాలు తెలిపాయి. తాజాగా అమల్లోకి వచ్చిన ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్(ఎఫ్ఈఓ) చట్టం కింద ఈ చర్యలు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ పేరుతో దాదాపు రూ.9,000 కోట్లకు పైగా రుణాలను ఎగ్గొట్టిన మాల్యాపై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కేసుల నుంచి తప్పించుకోవడానికి బ్రిటన్ పారిపోయిన మాల్యాను భారత్‌కు రప్పించేందుకు కేంద్రం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది.

# 11,200 పాయింట్ల దిగువకు నిఫ్టీ

- అంతంతమాత్రంగానే అంతర్జాతీయ సంకేతాలు
- కొనసాగుతున్న విదేశీ అమ్మకాలు
- 196 పాయింట్లు తగ్గి 37,686కు సెన్సెక్స్
- 95 పాయింట్ల నష్టంతో 11,189కు నిఫ్టీ



ఒక రోజు విరామం తర్వాత స్టాక్ మార్కెట్ మళ్లీ నష్టపోయింది. వాహన రంగ షేర్లలో భారీ అమ్మకాలు చోటు చేసుకోవడం, ఆసియా మార్కెట్లు బలహీనంగా ఉండటం వంటి కారణాల వల్ల సోమవారం స్టాక్ మార్కెట్ పతనమైంది. సెన్సెక్స్, నిఫ్టీలు రెండు నెలల కనిష్టానికి పడిపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతుండటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం ప్రతికూల ప్రభావం చూపించాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 196 పాయింట్లు పతనమై 37,686 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 95 పాయింట్లు నష్టపోయి 11,189 పాయింట్ల వద్ద ముగిశాయి. ఐటీ, బ్యాంక్, టెక్నాలజీ షేర్లు లాభపడటంతో నష్టాలు తగ్గాయి.

**527 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్....**

సావరిన్ బాండ్ల ద్వారా విదేశాల్లో రుణాల సమీకరించే విషయంలో వెనక్కు తగ్గేది లేదని, ఎఫ్‌పీఐలపై పన్ను విషయమై పునరాలోచన కూడా లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి స్పష్టం చేశారు. వృద్ధి జోరు పెంచడానికి ఆర్‌బీఐ రేట్లను తగ్గించగలదన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. దీంతో బాండ్ల రాబడులు భారీగా పడిపోయాయి. సెన్సెక్స్ లాభాల్లో ఆరంభమైనప్పటికీ, వెంటనే నష్టాల్లోకి జారిపోయింది. మధ్యాహ్నం సమయంలో నష్టాలు మరింతగా పెరిగాయి. చివర్లో నష్టాలు ఒకింత రివకరీ అయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 160 పాయింట్లు లాభపడగా, మరో దశలో 367 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 527 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి,.

**ఐసీఐసీఐ బ్యాంక్ 3 శాతం అప్...**

స్టాక్ మార్కెట్ నష్టపోయినప్పటికీ, ఐసీఐసీఐ బ్యాంక్ 3 శాతం లాభపడింది. ఈ క్యూ1లో ఈ బ్యాంక్ రూ.1,908 కోట్ల నికర లాభం ఆర్జించడం, రుణ నాణ్యత మెరుగుపడటంతో ఈ షేర్ 3.3 శాతం లాభంతో రూ.429 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 4.6 శాతం లాభంతో రూ.435 వద్ద గరిష్ట స్థాయిని తాకింది. బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.8,926 కోట్లు ఎగసి రూ.2,77,031 కోట్లకు పెరిగింది. సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా లాభపడిన షేర్ ఇదే.

● రూ. లక్ష కోట్ల మేర నిధుల దుర్వినియోగం జరిగిందన్న వార్తల నేపథ్యంలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్ 10 శాతం పతనమై రూ.559 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ 12 శాతం నష్టంతో రూ.547ను తాకింది.. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,786 కోట్లు ఆవిరై రూ.23,901 కోట్లకు పడిపోయింది. ఇతర గ్రూప్ కంపెనీలు–ఇండియాబుల్స్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ 5 శాతం, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్ 4.7 శాతం, ఇండియాబుల్స్ వెంచర్స్ 4.6 శాతం మేర పతనమయ్యాయి.

**రూ.6.77కు పడిపోయిన ఐడియా షేర్**

ఈ క్యూ1లో రూ.4,874 కోట్ల నికర నష్టాలు రావడం, ఆదాయంతో పాటు వినియోగదారుల సంఖ్య కూడా తగ్గడంతో బొంబాయి స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) లో వొడాఫోన్ ఐడియా షేర్ భారీగా పతనమైంది. ఇంట్రాడేలో 29 శాతం నష్టంతో రూ.6.56 వద్ద జీవిత కాల కనిష్ట స్థాయిని తాకిన ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన ఈ షేర్ చివరకు 27 శాతం నష్టంతో రూ.6.77 వద్ద ముగిసింది. షేర్ భారీ పతనం కారణంగా కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.7,126 కోట్లు హరించుకుపోయి, రూ.19,454 కోట్లకు పడిపోయింది. బీఎస్‌ఈలో 4.8 కోట్లు, ఎన్‌ఎస్‌ఈలో 66 కోట్ల షేర్లు ట్రేడయ్యాయి. వొడాఫోన్ ఐడియాతో పాటు ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన ఇతర షేర్లు కూడా నష్టపోయాయి. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ 9 శాతం, ఆదిత్య బిర్లా క్యాపిటల్ 4.3 శాతం, ఆదిత్య బిర్లా మనీ 1.6 శాతం, అల్ట్రాటెక్ సిమెంట్ 2.9 శాతం, హిందాల్కో ఇండస్ట్రీస్ 2.5 శాతం చొప్పున నష్టపోయాయి. మొత్తం ఈ గ్రూప్ కంపెనీల మార్కెట్‌క్యాప్ రూ.17,500 కోట్లు ఆవిరైంది.

## వాహన షేర్లు విలవిల



వాతావరణ కాలుష్యం తగ్గించడం లక్ష్యంగా ఎలక్ట్రిక్ వాహనాలకు కేంద్రం ప్రోత్సాహకాలను ప్రకటిస్తోంది. దీంట్లో భాగంగానే ఎలక్ట్రిక్ వాహనాలపై జీఎస్‌టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. మరోవైపు టూ, త్రీ వీలర్ల రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెంచాలని యోచిస్తోందని వార్తలు వచ్చాయి. అంతే కాకుండా పదిహేనేళ్లు దాటిన వాహనాలను వినియోగించకూడదంటూ మోటార్ వాహనాల చట్టానికి సవరణలు చేయాలని ప్రతిపాదిస్తోంది. అసలే డిమాండ్ మందగించి అమ్మకాలు తగ్గిపోయిన వాహన పరిశ్రమపై ప్రభుత్వ చర్యలు మరింత తీవ్రమైన ప్రభావం చూపనున్నాయన్న ఆందోళన నెలకొన్నది. దీంతో వాహన షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. టాటా మోటార్స్ 6.5 శాతం, బజాజ్ ఆటో 5 శాతం, ఐషర్ మోటార్స్ 4.5 శాతం, టీవీఎస్ మోటార్ 4.2 శాతం, మారుతీ సుజుకీ 4.2 శాతం, అశోక్ లేలాండ్ 3.5 శాతం, హీరో మోటొకార్ప్ 2.6 శాతం, మహీంద్రా 2 శాతం, అపోలో టైర్స్ 6 శాతం, మదర్సన్ సుమి సిస్టమ్స్ 4.3 శాతం, చొప్పున నష్టపోయాయి.

# ఏఎస్‌బీఏ యూపీఐ కింద తొలి ఐపీవో: ఎన్‌పీసీఐ




రిటైల్ ఇన్వెస్టర్లు ఐపీవో కోసం ఏఎస్‌బీఏ ఆధారిత యూపీఐ విధానంలోనే దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన కింద సోమవారం తొలి ఐపీవో వచ్చినట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) ప్రకటించింది. ఐపీవో ముగిసిన తర్వాత లిస్టింగ్‌కు ఆరు రోజులు ఉన్న సమయాన్ని మూడు రోజులకు తగ్గించాలన్న లక్ష్యంతో సెబీ ఈ నూతన విధానాన్ని ఆచరణలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టగా... 2019 జనవరి నుంచి యూపీఐ తొలి దశ అమల్లోకి వచ్చింది. అయితే, రిటైల్ ఇన్వెస్టర్లు డీపీలు, బ్రోకర్లకు ఫిజికల్‌గా దరఖాస్తులు సమర్పించే విధానం కూడా కొనసాగింది. రెండో దశ ఈ నెల 1 నుంచి అమల్లోకి రాగా, దీని కింద రిటైల్ ఇన్వెస్టర్లు బ్రోకర్లు, డీపీలు, ఆర్‌టీఏల ద్వారా దరఖాస్తుకూ యూపీఐ తప్పనిసరి. యూపీఐ మూడో దశలో భాగంగా లిస్టింగ్ కాల వ్యవధి మూడు రోజులకు తగ్గనుంది. ''నూతన ప్రక్రియ సమర్థతను పెంచడంతోపాటు మానవ వనరుల ప్రమేయాన్ని, రవాణాను తగ్గిస్తుంది. ఏఎస్‌బీఏ కోసం యూపీఐ 2.0 తప్పనిసరి. ఐపీవోలో షేర్ల అలాట్‌మెంట్ ప్రక్రియ ముగిసే వరకూ ఏఎస్‌బీఏ కింద సంబంధిత దరఖాస్తు దారుని బ్యాంకు ఖాతాలో నిర్ణీత మొత్తాన్ని బ్లాక్ చేయడం జరుగుతుంది''అని ఎన్‌పీసీఐ సీవోవో ప్రవీణ్‌రాయ్ తెలిపారు.

## బులియన్ రూ.లలో



| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,750 |
| బంగారం (22 క్యారెట్లు) | 34,050 |
| వెండి (కిలో) | 44,500 |
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,900 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,240 |
| వెండి (కిలో) | 44,500 |
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,900 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,240 |
| వెండి (కిలో) | 44,500 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,850 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,260 |
| వెండి (కిలో) | 41,000 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,820 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,320 |
| వెండి (కిలో) | 42,500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,940 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,240 |
| వెండి (కిలో) | 42,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 56.67 (రాత్రి 11.30కు) | $56.20 (శుక్రవారం ముగింపు) |
| బ్రెంట్ | 63.49 (రాత్రి 11.30కు) | $63.37 (శుక్రవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ –నెక్ /100కు రూ.లలో) 30-07-2019

| | |
|---|---|
| విశాఖ | 350–00 |
| చిత్తూరు | 358–00 |
| వరంగల్ | 314–00 |
| చెన్నై | 365–00 |
| ముంబై | 365–00 |
| విజయవాడ | 320–00 |
| నమక్కల్ | 355–00 |
| గోదావరి | 315–00 |
| **29-07-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 311–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.70 |
| బెంగళూరు | 340–00 |
| కోల్‌కత్త | 350–00 |
| ఢిల్లీ | 305–00 |

## ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 373.85 | 381.65 |
| ASIAN PAINT | 1513.25 | 1526.45 |
| AXIS BANK L | 720.25 | 729.85 |
| BAJAJ AUTO | 2487.65 | 2618.65 |
| BAJAJ FINSE | 7120.85 | 7233 |
| BAJAJ FINAN | 3252.65 | 3264.6 |
| BHARTI AIRT | 334.55 | 334.9 |
| BHARAT PETR | 342.2 | 343.8 |
| BRITANNIA I | 2672.3 | 2668.45 |
| CIPLA LTD | 522.25 | 532.1 |
| COAL INDIA | 205.4 | 210.65 |
| EICHER MOTO | 16388.1 | 17186.55 |
| GAIL (INDIA | 131.4 | 132.95 |
| GRASIM INDU | 795.65 | 874.95 |
| HCL TECHNOL | 1015.45 | 1001.45 |
| HDFC LTD | 2149 | 2165.75 |
| HDFC BANK L | 2244.3 | 2277.3 |
| HERO MOTOCO | 2404.55 | 2467.3 |
| HINDALCO I | 193.25 | 198 |
| HINDUSTAN Uni | 1713.3 | 1730.65 |
| INDIABULLS | 559.7 | 624.35 |
| ICICI BANK | 429.35 | 415.75 |
| INDUSIND BA | 1432.3 | 1415.5 |
| BHARTI INFR | 256.5 | 270.2 |
| INFOSYS LIM | 791.45 | 787 |
| INDIAN OIL | 138.25 | 141.8 |
| ITC LTD | 267.75 | 270.4 |
| JSW STEEL L | 241.4 | 249.7 |
| KOTAK MAHIN | 1502.5 | 1511.85 |
| LARSEN & TO | 1371.5 | 1392.15 |
| MAHINDRA & | 553.15 | 564.45 |
| MARUTI SUZU | 5561.25 | 5805.65 |
| NTPC LTD | 127.3 | 128.8 |
| OIL AND NAT | 140.35 | 141.9 |
| POWER GRID | 207.9 | 211.55 |
| RELIANCE IN | 1210.95 | 1213.8 |
| STATE BANK | 343.8 | 342.6 |
| SUN PHARMAC | 431.05 | 439.95 |
| TATA MOTORS | 137.55 | 147.15 |
| TATA STEEL | 433.45 | 445.5 |
| TATA CONSUL | 2130 | 2109.05 |
| TECH MAHIND | 646.3 | 643.5 |
| TITAN COMPA | 1078.9 | 1106.4 |
| ULTRATECH C | 4368.95 | 4500.55 |
| UPL LIMITED | 584.55 | 601.55 |
| VEDANTA LIM | 155.65 | 164.1 |
| WIPRO LTD | 262.4 | 263.6 |
| YES BANK LI | 94.75 | 96.05 |
| ZEE ENTERTA | 387.15 | 403.9 |

## నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ABB INDIA L | 1394.55 | 1382.05 |
| ACC LIMITED | 1535.7 | 1581.95 |
| AMBUJA CEME | 205.15 | 213.45 |
| ASHOK LEYLA | 71.65 | 74.2 |
| BAJAJ HOLDI | 3414.2 | 3384.75 |
| BANDHAN BAN | 492.25 | 490.2 |
| BANK OF BAR | 109 | 112.55 |
| BHEL | 59.25 | 60.65 |
| BIOCON LIMI | 237.05 | 241.85 |
| BOSCH LIMIT | 14815.95 | 15028.4 |
| CADILA HEAL | 227.3 | 234.15 |
| COLGATE PAL | 1163.3 | 1160.8 |
| CONTAINER C | 515.5 | 519.15 |
| DABUR INDIA | 427.9 | 428.15 |
| DLF LIMITED | 179.45 | 180.5 |
| AVENUE SUPE | 1449.9 | 1425.05 |
| GENERAL INS | 204 | 209.4 |
| GODREJ CONS | 613.25 | 619.4 |
| HAVELLS IND | 665.35 | 698.25 |
| HDFC AMC LI | 2174.6 | 2195.35 |
| HDFC LIFE I | 485.35 | 499.1 |
| HINDUSTAN Pet | 268.9 | 275.35 |
| HINDUSTAN Zinc | 215.75 | 225.5 |
| ICICI LOMBA | 1174 | 1140.8 |
| ICICI PRU L | 399.3 | 402.55 |
| VODAFONE ID | 6.75 | 9.25 |
| INTERGLOBE | 1579.95 | 1582.45 |
| L&T FINANCE | 101.15 | 103.75 |
| LUPIN LIMIT | 762.25 | 777.3 |
| MARICO LIMI | 365 | 361.05 |
| UNITED SPIR | 587 | 592.55 |
| MOTHERSON S | 107.95 | 113 |
| MRF LTD | 53785.3 | 54338.5 |
| NHPC LTD | 22.45 | 22.45 |
| THE NEW IND | 119.4 | 123.5 |
| NMDC LTD. | 109.45 | 111.25 |
| ORACLE FIN | 3320.6 | 3352.9 |
| PAGE INDUST | 18599.05 | 18494.9 |
| PIRAMAL ENT | 1790.05 | 1797.85 |
| PETRONET LN | 236.1 | 237.9 |
| P&G HYGIENE | 10702 | 10747.2 |
| PIDILITE IN | 1240.7 | 1243.9 |
| STEEL AUTHO | 44.2 | 45.2 |
| SBI LIFE IN | 797.35 | 795.1 |
| SHREE CEMEN | 21095.45 | 21431.3 |
| SIEMENS LTD | 1167.75 | 1186.3 |
| SHRIRAM TRA | 967.45 | 976.1 |
| UNITED BREW | 1421.45 | 1404.5 |

## బోర్డు సమావేశాలు

హీరో మోటొకార్ప్, యాక్సిస్ బ్యాంక్, టెక్ మహీంద్రా, ఎన్ఎండీసీ, ఎన్‌డీటీవీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ బ్యాంక్, డిష్ టీవీ, గుజరాత్ గ్యాస్, హెడెల్‌బెర్గ్ సిమెంట్ ఇండియా, పీఎన్‌బీ హౌసింగ్, షాపర్స్ స్టాప్

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 2,107 |
| ఎన్ఎస్ఈ | 31,390 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 8,98,332 |
| ఎఫ్ఐఐ | -704 |
| డీఐఐ | 1,352 |

## నిఫ్టీ 50

**టాప్ 7 గెయినర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ICICIBANK | 427.8 | 2.9 |
| INDUSINDBK | 1,431.50 | 1.13 |
| HCLTECH | 1,011.05 | 0.96 |
| TCS | 2,125.10 | 0.76 |
| INFY | 791.85 | 0.62 |
| SBIN | 343.3 | 0.2 |
| TECHM | 644 | 0.08 |

**టాప్ 7 లూజర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| IBULHSGFIN | 549 | -12.07 |
| GRASIM | 791 | -9.59 |
| TATAMOTORS | 137.8 | -6.35 |
| VEDL | 155.4 | -5.3 |
| INFRATEL | 256.5 | -5.07 |
| BAJAJ-AUTO | 2,489.20 | -4.94 |
| EICHERMOT | 16,370.00 | -4.75 |


ములుగు జిల్లా కన్నాయిగూడెంలోని దేవాదుల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్ట్ ఉధృతి


ములుగు మండలంలోని సర్వాపురం-జగ్గన్నగూడెం మధ్య ఉన్న బొగ్గుల వాగు ఉరకలు

# గోదారమ్మ పరవళ్లు

**దేవాదుల వద్ద 77.70 మీటర్లు ● తుపాకులగూడెం వద్ద నిలిచిన పనులు**


మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఎదులబంధం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తూతూంగా వాగు

**ఏటూరునాగారం/కన్నాయిగూడెం:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదారమ్మ పరుగులు పెడుతోంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో జలకళ సంతరించుకుంది. సముద్ర మట్టానికి 72 మీటర్ల ఎత్తులో నీరు ఉంటేనే దేవాదులలోని మోటార్లను ఆన్ చేసే అవకాశం ఉంది. అలాంటిది 77.70 మీటర్ల మేర ప్రవాహం ఉండటంతో ఇరిగేషన్ అధికారులు రెండో దశలో మొదటి మోటారును ప్రారంభించి ఎగువ ప్రాంతాల్లోని రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోస్తున్నారు. రిజర్వాయర్ల నీటి మట్టాన్ని అంచనా వేసి మోటార్లను ఎక్కువ మొత్తంలో ఆన్ చేసే అవకాశం ఉంది.

**నిలిచిన తుపాకులగూడెం బ్యారేజీ పనులు**

నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం గోదావరి నదిపై నిర్మిస్తున్న పీవీ నర్సింహారావు బ్యారేజీ పనులు నిలిచిపోయాయి. గోదావరి వరద ఉప్పొంగి ప్రవహించడంతో మెషినరీలను ఒడ్డుకు చేర్చారు. వర్షాలు తగ్గితేనే పనులు మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. బ్యారేజ్‌లోని 30 పిల్లర్ల వరకు గోదావరి నీటిలోనే ఉండటంతో ఇవతలి వైపున ఉన్న 11 పిల్లర్ల వద్ద పనులు చేపట్టేవారు. అయితే వర్షాలు కురుస్తుండటంతో పనులు సాగే పరిస్థితి లేకుండా పోయింది. గోదావరి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో బ్యారేజీ వద్ద తగు జాగ్రత్తలను తీసుకోవాలని అధికారులు సూచనలు చేశారు. గోదావరిలోకి ఎవరు కూడా వెళ్లొద్దని ఆదేశించారు.

## చొక్కాలో ఇమిడే బుల్లి ఏసీ!

మనకు ఇక్కడ వానలు పడుతూ వాతావరణం కాస్తా చల్లబడిందిగానీ.. యూరప్‌లో మాత్రం ఎండ దంచికొడుతోంది. ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్ ముందున్న ఫౌంటేన్లు పబ్లిక్ షవర్లుగా మారిపోతే.. ఎండ కన్నెరుగని వాళ్ల కాళ్లు బొబ్బలెక్కిపోతున్నాయి.



వాతావరణ మార్పుల పుణ్యమా అని ఇలాంటి పరిస్థితులు ఇకపై ఏటా ఉన్నా ఆశ్చర్యపోనక్కరలేదు. ఈ సమస్యకు పరిష్కారం ఏంటన్నది కాసేపు పక్కన పెడితే.. కాస్తంత ఉపశమనం పొందేందుకు జపనీస్ కంపెనీ సోనీ ఓ వినూత్న ఆవిష్కరణ చేసింది. ఫొటోలో కనిపిస్తున్న బుల్లి ఏసీని సిద్ధం చేసింది. మెడ భాగంలో చొక్కాలో ఈ బుల్లి ఏసీని ఉంచుకుంటే చాలు.. (ప్రత్యేకమైన అర ఉన్న షర్ట్ కావాల్సి ఉంటుంది) మీ ఒంటి చుట్టూ చల్లటి గాలి వీస్తూనే ఉంటుంది. బయటితో పోలిస్తే చొక్కాలోపలి ఉష్ణోగ్రతలు కనీసం 8 డిగ్రీ సెల్సియస్ తక్కువ ఉంటుందని సోనీ సంస్థ చెబుతోంది. చలికాలంలో దీన్ని వెచ్చదనం కోసమూ వాడుకోవచ్చు. రియాన్ పాకెట్ అని పేరు పెట్టిన ఈ పర్సనల్ ఏసీ తయారీకి సోనీ క్రౌడ్ సోర్సింగ్ ద్వారా నిధులు సేకరించింది. ప్రకటించిన కొన్ని రోజులకే అనుకున్న మొత్తం కంటే బోలెడంత ఎక్కువ పెట్టుబడుల కింద రావడం గమనార్హం. ఒక్కో రియాన్ పాకెట్ ఖరీదు దాదాపు రూ.10 వేల వరకు ఉంటుంది. స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్ ద్వారా పనిచేసే ఈ ఏసీ బ్యాటరీని ఒకసారి చార్జ్ చేస్తే దాదాపు 23 గంటల పాటు ఆగకుండా పనిచేస్తుంది.

# ఇక ఎత్తిపోసుడే

**జూరాలకు నేడు కృష్ణా జలాల రాక**

- ఎగువ ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి లక్ష క్యూసెక్కుల వరద
- నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్‌ల ద్వారా ఎత్తిపోతలకు పంపులు సిద్ధం
- జూరాలలో 5 టీఎంసీల నిల్వ దాటగానే ఎత్తిపోతలు మొదలు
- గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణపై సీఎం సమీక్ష
- అప్రమత్తంగా ఉండాలని ఇంజనీర్లకు ఆదేశం

**గతేడాది జూరాల నుంచి ఎత్తిపోతలు ఇలా... (టీఎంసీల్లో)**

| | |
|---|---|
| నెట్టెంపాడు: | 6.78 |
| భీమా లిఫ్టు-1: | 4.78 |
| భీమా లిఫ్టు-2: | 7.41 |
| కోయిల్ సాగర్: | 4.29 |
| జూరాల కాల్వలకు: | 23.98 |

**సాక్షి, హైదరాబాద్:** ఎగువ కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి విడుదల చేసిన కృష్ణా జలాలు మంగళవారం ఉదయానికి జూరాల చేరనుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు జూరాలకు వచ్చే నీటిని వచ్చినట్లుగా ఎత్తిపోసేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంది. జూరాల నిర్ణీత మట్టాలకు నిల్వ చేరిన వెంటనే నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పంపులను ప్రారంభించి కృష్ణా జలాల ఎత్తిపోతలను చేపట్టనుంది. గతేడాది 50 టీఎంసీల మేర నీటిని జూరాలపై ఆధారపడిన ప్రాజెక్టుల కింది ఆయకట్టుకు తరలించగా ఈ ఏడాది అంతకుమించి నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

**ఎగువ నుంచి లక్ష క్యూసెక్కులు..**

పశ్చిమ కనమల్లో కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టికి వరద ఉధృతి పెరిగిన విషయం తెలిసిందే. సోమవారం సైతం ఆల్మట్టిలోకి లక్ష క్యూసెక్కుల మేర వరద వస్తుండగా అంతే మొత్తం నీటిని దిగువ నారాయణపూర్‌కు విడుదల చేస్తున్నారు. ఆల్మట్టిలో ప్రస్తుతం 129 టీఎంసీలకుగాను 123 టీఎంసీల మేర నిల్వ ఉంది. ఇక నారాయణపూర్‌లో సైతం 37 టీఎంసీలకుగాను 32 టీఎంసీల నిల్వ ఉండగా అందులోంచి 18 గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువ నదిలోకి వదిలారు. ఈ నీరు జూరాల వైపు వస్తోంది. సోమవారం మధ్యాహ్నమే జూరాలకు ముందున్న కర్ణాటకలోని గూగల్ బ్యారేజీని కృష్ణా వరద దాటగా మంగళవారం ఉదయానికి జూరాలను చేరుకోనుంది. జూరాలలో ప్రస్తుతం 9.66 టీఎంసీలకుగాను 1.99 టీఎంసీల మేర నిల్వ ఉంది. ఇందులో మరో 5 టీఎంసీల నీరు చేరిన వెంటనే భీమా, కోయిల్ సాగర్, నెట్టెంపాడు పంపులు ప్రారంభం కానున్నాయి. దీంతోపాటే జూరాల కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగనుంది. గతేడాది జూరాలతోపాటు ఎత్తిపోతల పథకాల ద్వారా 50 టీఎంసీలకుపైగా నీటిని ఎత్తిపోయగా ఈ ఏడాది 70 టీఎంసీల మేర నీటిని ఎత్తిపోయాలని భావిస్తున్నారు. ఈ నీటి ద్వారా గరిష్టంగా 4.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించడంతోపాటు భీమా కింద 180 చెరువులు, కోయిల్‌సాగర్ కింద 45, నెట్టెంపాడు కింద 105, జూరాల కింద 150 చెరువులు నింపాలని ప్రణాళిక వేసుకున్నారు. వరద వచ్చే రోజులు, పంపులు నడిచే దినాలనుబట్టి ఎత్తిపోతలు చేపట్టనున్నారు. ఒకేసారి లక్షకు మించి ప్రవాహాలు కొనసాగితే మంగళవారం సాయంత్రానికే జూరాల ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది. అదే జరిగితే మంగళవారం రాత్రికే జూరాల గేట్లు ఎత్తి దిగువ శ్రీశైలానికి నీటి విడుదల జరిగే అవకాశం ఉంది.

**నేటి నుంచి ఎల్లంపల్లికి గోదావరి జలాల ఎత్తిపోత**

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల ఎత్తిపోత కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఇప్పటికే మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను దాటి గోదావరి జలాలు సుందిళ్ల బ్యారేజీకి రాగా అక్కడి గోలివాడ పంప్‌హౌస్‌లో మోటార్ల ద్వారా నీటిని మంగళవారం నుంచి ఎల్లంపల్లిలోకి ఎత్తిపోయనున్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద సోమవారం గోదావరి ప్రవాహం 9 వేల క్యూసెక్కుల మేర నమోదైంది. 94.9 మీటర్ల లెవల్‌లో బ్యారేజీలో 4.6 టీఎంసీల నిల్వ ఉంది. ఇక్కడి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా ప్రస్తుతం 4 మోటార్లను నడిపిస్తూ 8,600 క్యూసెక్కుల నీటిని అన్నారం బ్యారేజీకి తరలిస్తున్నారు. ఇప్పటివరకు 1,500 గంటలకుపైగా కన్నెపల్లి మోటార్లు నడవగా 12 టీఎంసీల నీటి ఎత్తిపోత జరిగింది. ఇక అన్నారం బ్యారేజీలో 7.7 టీఎంసీల మేర నీటి నిల్వ ఉండగా ఇక్కడ మూడు మోటార్ల ద్వారా సుందిళ్ల బ్యారేజీకి నీటిని తరలిస్తున్నారు. సుందిళ్లలో 5.8 టీఎంసీల నీటి నిల్వ చేరగా ఆదివారం ఫోర్ బేలోకి నీటిని పంపి పరీక్షించారు. మంగళవారం మధ్యాహ్నానికి గోలివాడ పంప్‌హౌస్‌లోని రెండు మోటార్ల ద్వారా నీటిని ఎల్లంపల్లికి ఎత్తిపోయనున్నారు. రెండు మోటార్లు నడిచినా 5,200 క్యూసెక్కుల మేర నీటిని తరలించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితే మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు మొత్తంగా 120 కిలోమీటర్ల గోదావరి నది నీటి గలగలలతో కళకళ్లాడనుంది. ఎల్లంపల్లికి నీరు చేరితే కాళేశ్వరంలోని లింక్-1 ప్రక్రియ అంతా పూర్తి కానుంది. ఇక వచ్చే నెల 5వ తేదీ నుంచి నంది మేడారం ప్యాకేజీ-6లోని మోటార్లను నడిపించడం ద్వారా లింక్-2 ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. ప్యాకేజీ-7లోని టన్నెల్, ప్యాకేజీ-8 రామడుగులోకి పంపులను సైతం ప్రారంభిస్తే మిడ్‌మానేరుకు నీరు చేరనుంది.



**వరద నిర్వహణకు చర్యలు చేపట్టండి: కేసీఆర్**

గోదావరి పరిధిలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లతోపాటు కడెం, ఎల్లంపల్లిలో వరద మొదలైనందున వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వరద నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రాజెక్టుల్లో వరద పరిస్థితిపై కేసీఆర్ సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా కడెంకు చేరుకుంటున్న వరదతో ప్రాజెక్టు నిండి ఎల్లంపల్లికి వరద చేరుకునే అవకాశం ఉండటంతో గోలివాడ వద్ద ఉన్న పంపుల్లో ఎన్ని మోటార్లను నడిపిస్తారో పరిశీలించి నీటిని ఎత్తిపోయాలన్నారు. అలాగే కృష్ణా బేసిన్‌లో భారీ వరదలు వస్తున్నందున దానిపై ఆధారపడ్డ ప్రాజెక్టుల ద్వారా గరిష్ట నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. శ్రీశైలానికి వరద చేరిన వెంటనే కల్వకుర్తి పంపులను సైతం నడిపించి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలన్నారు. దీంతోపాటే ప్రతి బ్యారేజీ వద్ద గేట్ల నిర్వహణ, పంపులు మోటార్ల మరమ్మతులు చేసి ఇంజనీర్లు ఆయా ప్రాజెక్టులు ఉన్న ప్రాంతాల్లోనే ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశానికి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఓఎస్‌డీ శ్రీపతి దేశ్‌పాండే, ఈఎన్‌సీ మురళీధర్ హాజరయ్యారు.



## చేతివాటానికీ హద్దులున్నాయి!

ఇండొనేసియాలోని బాలీకి వెళ్లిన కుటుంబం ఒకటి రిసార్ట్‌లో చేతివాటం ప్రదర్శించింది. అక్కడి నుంచి బోలెడన్ని వస్తువులను చిలక్కొట్టుడు కొట్టేసింది. వారి బ్యాగులను పోలీసులు తెరిచి చూడటంతో వాళ్ల అసలు బండారం బయటపడింది. దేశం పరువు పోయిందంటూ కొంతమంది నెటిజన్లు విసుక్కుంటే.. కొన్ని కంపెనీలు ఈ అంశాన్ని మార్కెటింగ్‌కు ఉపయోగించుకున్నాయి. ప్రయాణ ఏర్పాట్లు చేసే ఓ సంస్థ అడుగు ముందుకేసి.. హోటల్ రూమ్ నుంచి ఏయే వస్తువులు తీసుకెళ్లొచ్చు.. ఏవి తీసుకెళ్లకూడదో చెబుతూ ఓ వీడియోను ట్విటర్‌లో పెట్టేసింది. రూమ్ బుక్ చేసుకున్న హోటల్ నుంచి కొన్ని వస్తువులు తీసుకెళ్లేందుకు యాజమాన్యానికి పెద్ద అభ్యంతరమేమీ ఉండదు.. కానీ కనిపించిందల్లా ఎత్తుకొచ్చేద్దామంటేనే సమస్య. బాత్‌రూమ్‌లో ఉంచే సబ్బులు, షాంపూ తదితరాలతో పాటు షవర్ క్యాప్స్, టూత్‌బ్రష్‌లను మనం ఎంచక్కా మన బ్యాగేజీతోపాటు తీసుకొచ్చుకోవచ్చు. అలాగే పెన్నూ, ఎన్వలప్ కవర్లతో పాటు కాఫీ, టీ ప్యాకెట్లకూ అభ్యంతరముండదు.. చాలా హోటళ్లు వీటన్నింటికీ కలిపి బిల్లు వేస్తుండటం ఇందుకు కారణం. షాంపూ వంటివి మీకు అమితంగా నచ్చితే ఇంకో సెట్ కావాలని అడిగినా ఫైవ్‌స్టార్ హోటళ్లు అంగీకరిస్తాయి. అరకొర వాడేసిన వస్తువులను రూమ్ సర్వీస్ వాళ్లు ఎలాగూ వృథాగా పడేస్తారు కాబట్టి తెచ్చేసుకుంటే ఇబ్బందేమీ ఉండదు. కాకపోతే తువ్వాళ్లు, బాత్‌రోబ్‌లు, హెయిర్ డ్రయర్లు, కాఫీ కెటిల్స్, బల్బులు, కర్టెన్లు వంటివి మాత్రం తెచ్చుకుంటేనే సమస్య. ఆ మధ్య బెంగాల్ అధికారగణం లండన్‌లోని హోటల్‌లో వెండిస్పూన్లు జేబులో పెట్టేసుకుని వచ్చేస్తుంటే సెక్యూరిటీ వాళ్లు పట్టుకున్నారు. 50 పౌండ్ల జరిమానా కడితేగానీ వదల్లేదు.

## చిగురించిన హరితహారం ఆశలు

**ఐదో విడత హరితహారానికి సిద్ధమవుతున్న అధికారులు ● ఆగస్టు 10లోగా అధికారికంగా సీఎం ప్రారంభించే అవకాశం**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు హరితహారంపై ఆశలు రేకెత్తిస్తున్నాయి. కనీసం ఈ నెల మొదలయ్యే నాటికి వానలు పడటం మొదలైతే హరితహారం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించవచ్చని అధికారులు భావించారు. అయితే ఆ అంచనాలకు భిన్నంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, కొన్ని ప్రాంతాల్లో కరువు ఛాయలు కూడా కనిపించాయి. దీంతో ఈ ఏడాది మొక్కలు నాటడం, వాటి సంరక్షణ పెద్ద సవాల్‌గా మారుతుందనే ఆందోళన అధికారుల్లో వ్యక్తమైంది. ప్రస్తుతం కురుస్తున్న వానలు ప్రోత్సాహకరంగా ఉండటంతో హరితహారాన్ని చురుకుగా సాగించవచ్చని అటవీ, పంచాయతీరాజ్ శాఖ లు అంచనా వేస్తున్నాయి. వచ్చే నెల 10లోగా సీఎం కేసీఆర్ ఐదో విడత హరితహారాన్ని అధికారికంగా మొదలు పెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అధికారిక కార్యక్రమంతో నిమిత్తం లేకుండా వాతావరణ పరిస్థితులు అనుకూలించిన చోట మొక్కలు నాటడాన్ని మొదలుపెట్టాలని గతంలోనే జిల్లాల కలెక్టర్లను ఆదేశాలు ఇచ్చారు.

**సంరక్షణా ముఖ్యమే...**

ఐదో విడతలో భాగంగా మొక్కలు నాటడం పైనే కాకుండా వాటి సంరక్షణ విషయంలోనూ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాటిన మొక్కల లెక్కలతోనే సరిపుచ్చకుండా, వాటిని బతికించడంపై శ్రద్ధ పెడితేనే హరితహారం లక్ష్యాలు నెరవేరుతాయని వివిధ స్థాయిల అధికారులకు సూచించింది. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములు చేసేలా కార్యాచరణను చేపట్టాలనే ఆలోచనతో ఉంది. హరితహారంలో మరింతగా జవాబుదారీతనాన్ని పెంచేందుకు మండలానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ శాఖల సిబ్బందిని ఇందు కోసం ప్రతిపాదించారు. వ్యవసాయ శాఖ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు, హార్టీకల్చర్ ఆఫీసర్లు, అటవీ అధికారులను కలిపి మొత్తం 25 వేల మంది సిబ్బందిని ఒక్కో ప్రాంతానికి హరితహారం నోడల్ ఆఫీసర్లుగా నియమించి పర్యవేక్షించనున్నారు.

**తగిన ఎత్తులో పెరిగినవే..**

నర్సరీల్లో తగిన ఎత్తులో పెరిగిన మొక్కలను మాత్రమే ఈసారి నాటేందుకు తరలించాలని, మిగతా వాటిని వచ్చే ఏడాది పెద్ద మొక్కలుగా నాటేందుకు పెంచాలని ప్రభుత్వం సూచించింది. అన్ని శాఖల అధికారులు కూడా తమ శాఖ పరిధిలో నాటిన మొక్కల పెంపు బాధ్యత తీసుకోవాలని, ప్రతీ వారం తప్పనిసరిగా ఒకరోజు ఫీల్డ్ విజిట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మొక్కలు నాటుతున్న ప్రదేశాలను తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయాలని, దానివల్ల పర్యవేక్షణ సులువవుతుందని పేర్కొంది.

**5 ఏళ్లు.. 230 కోట్ల మొక్కలు..**

వచ్చే ఐదేళ్లలో 230 కోట్ల మొక్కలను నాటడమే లక్ష్యంగా హరితహారం అమలు చేస్తున్నారు. మొత్తం 4 విడతల్లో కలిపి ఇప్పటికే 113.58 కోట్ల మొక్కలు నాటారు. 2015-16లో హరితహారం ప్రారంభించినప్పుడు 15.86 కోట్లు నాటగా, 2016-17లో 31.67 కోట్లు, 2017-18లో 34.07 కోట్ల మొక్కలు, 2018-19లో 31.98 కోట్ల మొక్కలు నాటినట్లుగా ప్రభుత్వ లెక్కలను బట్టి తెలుస్తోంది. ఐదో విడతలో (2019-20) నర్సరీల్లో 100 కోట్ల మొక్కలు పెంచుతుండగా, రాష్ట్రవ్యాప్తంగా నాటాల్సిన మొక్కల లక్ష్యం 83.30 కోట్లుగా ఉంది.

## ఆగస్టు 11 నుంచి తిరుమలలో పవిత్రోత్సవాలు

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 11 నుంచి 13వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఆగస్టు 10న అంకురార్పణంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలిసి కొన్ని, తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి నష్టం రానీయకుండా ఆగమ శాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. 1962 నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఉదయం 9.00 నుంచి 11.00 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6.00 నుంచి రాత్రి 7.00 గంటల వరకు ప్రత్యేక అలంకరణలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఆగస్టు 11న పవిత్రాల ప్రతిష్ట, ఆగస్టు 12న పవిత్ర సమర్పణ, ఆగస్టు 13న పూర్ణాహుతి నిర్వహిస్తారు. కాగా, పవిత్రోత్సవాల నేపథ్యంలో ఆగస్టు 10న వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు, ఆగస్టు 11 నుంచి 13వ తేదీ వరకు విశేష పూజ, అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దయ్యాయి.

# కోటిస్తేనే కనికరించారు!

- ఫైనాన్షియర్ అపహరణ
- హైదరాబాద్‌లో అర్ధరాత్రి హైడ్రామా
- సినిమా షూటింగ్ తలపించేలా ఘటన
- రూ.3 కోట్ల డిమాండ్.. కోటికి డీల్
- డబ్బు తీసుకుని గజేందర్‌ను వదిలిపెట్టిన కిడ్నాపర్లు
- దోమలగూడలో ఘటన.. కిడ్నాప్ కేసుగా నమోదు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజేందర్



గజేందర్ కారు

**హైదరాబాద్:** రాష్ట్ర రాజధానిలోని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోమొబైల్ ఫైనాన్షియర్ కిడ్నాప్‌కు గురయ్యాడు. ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఫైనాన్షియర్‌ను కిడ్నాప్ చేసిన ఆగంతకులు రూ.కోటి తీసుకుని సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో వదిలిపెట్టారు. దాదాపు 3 గంటలపాటు సినీ ఫక్కీలో ఈ ఘటన జరిగింది. చివరకు బాధితుడు స్వల్పగాయాలతో బయటపడ్డారు. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకట్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. హిమాయత్‌నగర్ రోడ్ నంబర్ 16లో నివసించే గజేందర్ పారక్ (40) మైనా ఫైనాన్స్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. స్నేహితులను కలిసేందుకు తరచూ దోమలగూడ ఏవీ కళాశాల వద్దకు వస్తుంటాడు. ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతం లో తన కారు (టీఎస్09ఎఫ్ఏ2131)లో అక్కడికి వచ్చాడు. అతడి స్నేహితుడు రసగుల్లా అతడితో మాట్లాడి వెళ్లిపోయాడు. 11.15 గంటల ప్రాంతంలో 30 నుంచి 35 ఏళ్ల వయసున్న ఇద్దరు బైక్‌పై వచ్చి కారు వెనకాల ఆపారు. వారు గజేందర్‌ను అడ్డగించేలోపే ముసుగు వేసుకున్న మరో ముగ్గురు కారులో అక్కడికి చేరుకుని గజేందర్‌ను కారులో కూర్చోబెట్టారు. ఎక్కడికి వెళ్తున్నామో తెలియకుండా గజేందర్‌కు మాస్క్ తగిలించారు.

**రూ.3 కోట్లు డిమాండ్...**

గజేందర్‌ను అబిడ్స్‌కు తరలించి రూ.3 కోట్లు డిమాండ్ చేశారు. రూ.15 నుంచి రూ.20 లక్షల కంటే ఎక్కువ ఇవ్వలేనని చెప్పినా కిడ్నాపర్లు ఒప్పుకోకపోగా, గజేందర్‌ను చితకబాదారు. దీంతో రూ.కోటి ఇవ్వడానికి డీల్ కుదిరింది. గజేందర్ అతని స్నేహితుడు రాజేశ్ అగర్వాల్‌కు ఫోన్ చేసి విషయం తెలిపి రూ.కోటి తీసుకురావాలని కోరాడు. జగదీశ్ మార్కెట్ వద్ద ఉన్న బాంబే జ్యూస్ సెంటర్ వద్దకు డబ్బులు తీసుకొచ్చి అతడి కారు బానెట్‌పైనే ఉంచి దూరంగా వెళ్లాలని కిడ్నాపర్లు సూచించారు. రాజేశ్ అలాగే చేయగా, స్కూటీపై ముసుగువేసుకుని వచ్చిన ఇద్దరు ఆ బ్యాగ్ తీసుకుని చిరాగ్ ఆలీ లేన్ వైపు పారిపోయారు. అనంతరం గజేందర్‌ను చిరాగ్ ఆలీ లేన్‌లో వదిలిపెట్టారు. బాధితుడు ఇంటికి వెళ్లి ఉదయం 5 గంటల ప్రాంతంలో చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసి, అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు చేరాడు. సెంట్రల్ డీసీపీ విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి ఏసీపీ వై.నర్సింహారెడ్డి, సీఐ వెంకట్‌రెడ్డి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

**ఆర్థిక లావాదేవీలే కారణమా?..**

గజేందర్ కిడ్నాప్ కేసులో ఆర్థిక లావాదేవీలే ప్రధాన పాత్ర పోషించాయా అనే అనుమానంతో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఫార్చ్యూన్ ఫైనాన్స్‌లో దాదాపు రూ.24 కోట్ల మేర మోసం చేశాడనే కేసులో గజేందర్ అన్నను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి దానికి ఏదైనా సంబంధం ఉందా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గజేందర్‌తో పాటు మరికొందరు బినామీలుగా ఏర్పడి ముంబైకి చెందిన కంపెనీని మోసగించిన కేసులు కూడా ఉన్నట్లు సమాచారం. కాగా, కిడ్నాప్ జరిగిన ప్రాంతంతో పాటు అబిడ్స్‌లో చోటుచేసుకున్న నాటకీయ పరిణామాలను కూడా పోలీసులు సీసీ ఫుటేజీల ద్వారా సేకరిస్తున్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792